PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 23 | విజయవాడ, బుధవారం 23 ఆగస్టు 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 23 August 2023 | Rs

మేం కలిసే నడుస్తాం

- కమ్యూనిస్టుల్లేకుంటే మునుగోడులో బిఆర్ఎస్ గెలిచేదా?
- అవకాశవాదంతో కెసిఆర్ మిత్ర ధర్మం పాటించలేదు
- సిపిఐ, సిపిఎం ఉమ్మడి సమావేశంలో వక్తలు

2

ఆ 17 నిమిషాలు ఉత్కంఠభరితం!



- చంద్రయాన్-3 సాఫ్ట్ ల్యాండింగ్‌కు సర్వం సిద్ధం
- కొనసాగుతున్న తనిఖీలు
- నేడు అపురూప ఘట్టం ఆవిష్కరణకు ఇస్రో ఏర్పాట్లు

• లోపలి పేజీలో.. •

తల్లీబిడ్డల హత్య కేసులో ఉన్మాదికి ఉరిశిక్ష

మౌలాలి (ఫైల్)

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

తల్లీబిడ్డ హత్య కేసులో దోషికి చిత్తూరు కోర్టు ఉరిశిక్ష విధించింది. సంబంధించి ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... చిత్తూరు జిల్లా తంబళ్లపల్లి మండలం గంగిరెడ్డిపల్లికి చెందిన సయ్యద్ మౌలాలి చేపలు పట్టుకుని జీవనం సాగించేవాడు. అదే గ్రామానికి చెందిన సరళమ్మతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆమెకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. తాగుడుకు బానిసైన మౌలాలి... సరళమ్మ పెద్ద కుమార్తె గంగులమ్మపై అత్యాచారం చేసేవాడు. ఈ విషయం తెలుసుకొని నిలదీసిన సరళమ్మను 2020లో ఇంట్లోనే హత్య చేసి గ్రామ సమీపంలోని పెద్ద ఏరులో మృతదేహాన్ని పడేశాడు. తల్లి గురించి పిల్లలు ప్రశ్నించడంతో మీ అమ్మకు కరోనా సోకిందని, ఆస్పత్రిలో ఉందని నమ్మబలికాడు. పిల్లలతో సహా బెంగళూరుకు మకాం మార్చేశాడు. తన తల్లిని ఏం చేశావంటూ ప్రశ్నించిన గంగులమ్మనూ హత్య చేసి, మృతదేహాన్ని మాయం చేశాడు. ఈ రెండు సంఘటనలూ 2020 ఆగస్టులో చోటుచేసుకున్నాయి. తల్లీబిడ్డ కనిపించకుండా పోవడంతో 2021లో సరళమ్మ సమీప బంధువు ధనమ్మ తంబళ్లపల్లి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మౌలాలిని అరెస్టు చేసి హత్య, పోక్సో చట్టంతోపాటు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. విచారణ తుది దశకు వచ్చి నేరం రుజువు కావడంతో అతనికి ఉరి శిక్ష విధిస్తూ చిత్తూరు ఎడిజె కోర్టు న్యాయమూర్తి రమేష్ మంగళవారం తీర్పు చెప్పారు.

కన్నతండ్రే కడతేర్చాడు

ఎన్.గొల్లపల్లిలో దారుణం



మంజుల (ఫైల్)

ప్రజాశక్తి- కనిగిరి (ప్రకాశం జిల్లా)

కన్నతండ్రి చేతిలో కుమార్తె దారుణ హత్యకు గురైంది. కనిగిరి మండలం ఎన్ గొల్లపల్లిలో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం... పామూరు మండలం మార్కొండాపు రానికి చెందిన బూసిరాజు వెంకటేశ్వర్లుకు, వెలిగండ్ల మండలం పద్మాపురానికి చెందిన నరసమ్మ భార్యాభర్తలు. వీరికి ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు. మద్యానికి బానిసైన వెంకటేశ్వర్లు వేధింపులు ఎక్కువ కావడంతో గతంలో నరసమ్మ పామూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామ పెద్దలు సర్దిచెప్పడంతో కనిగిరిలో కాపురం ఉంటున్నారు. మళ్లీ వెంకటేశ్వర్లు గొడవ పడుతుండడంతో రెండు నెలల క్రితం పిల్లలను తీసుకొని నరసమ్మ తన పుట్టింటికి వెళ్లారు. చిన్నకుమార్తె మంజుల (12) కనిగిరి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. అక్కడికి వెళ్లిన వెంకటేశ్వర్లు తన కుమార్తె మంజులను ఊరికి వెళ్దామంటూ ఆటోలో తీసుకెళ్లి ఎన్ గొల్లపల్లి సమీపంలో ఆటోలో నుంచి దించి, పద్మాపురం గ్రామ శివారులోని చెరువు సమీపాన ఆమెను ముఖంపై, తలపై రాయితో బలంగా కొట్టి కిరాతకంగా హత్య చేశాడు. తనను, చిన్న కుమార్తెను చంపుతానని బెదిరించాడని, ఇంత ఘోరానికి పాల్పడతాడని ఊహించలేదని బాలిక తల్లి విలపించారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు ఎస్‌పి మల్లికాగర్గ్ తెలిపారు.

కాటన్ బ్యారేజీ నుంచి సముద్రంలోకి విడుదలవుతున్న గోదావరి జలాలు

మళ్లీ వరద భయం!

- పెరుగుతున్న గోదావరి ఉధృతి
- భద్రాచలం వద్ద 32 అడుగుల నీటిమట్టం

ప్రజాశక్తి- ఏలూరు, రాజమహేంద్రవరం ప్రతినిధులు

గోదావరి నదిలో నీటి ఉధృతి పెరుగుతుండడంతో ఏలూరు జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలను మళ్లీ వరద భయం వెంటాడుతోంది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు రెండ్రోజులుగా గోదావరి వరద ఉధృతి పెరుగుతూ వస్తోంది. గడిచిన 24 గంటల్లో భద్రాచలం వద్ద ఆరు అడుగుల మేర ప్రవాహం పెరిగింది. సోమవారం సాయంత్రం నాటికి 26 అడుగులు ఉన్న నీటిమట్టం మంగళవారం సాయంత్రం నాటికి 32 అడుగులకు మిగతా2లో

విశాఖ ఉక్కు ఇక రెండేళ్లే!

- కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి వివాదాస్పద రాతలు
- భగ్గుమన్న కార్మికులు
- అడ్మిన్ భవనం వద్ద ఉద్రిక్తత



22/8/2023 | N. N. Sinha, Secretary Steel | It is a very clean plant and equally loved by its staffers. Personally I think it has many-2 years of productive life. I wish RINL is able to optimize its productivity to be among the nation's best. Best of wishes to the entire unit in this endeavour. Thanks for showing me around and displaying your enthusiasm.

సందర్శకుల పుస్తకంలో కేంద్ర స్టీల్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి నాగేంద్రనాథ్ సిన్హా రాసిన అభిప్రాయం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఉక్కునగరం

రాష్ట్ర ప్రజానీకం ప్రతిష్టాత్మకంగా భావించే విశాఖ ఉక్కు పరిశ్రమ మనుగడకు కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి ఒకరు డెడ్‌లైన్ రాశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంవత్సరాల తరబడి ప్రజానీకం చేస్తున్న పోరాటాన్ని అవహేళన చేసేలా 'అక్షరాల' వ్యవహరించారు. ఈ విషయం తెలిసిన ఉక్కు పరిశ్రమ కార్మికలోకం భగ్గుమంది. కేంద్ర ప్రభుత్వ వైఖరిని ని రసిస్తూ అడ్మినిస్ట్రేషన్ భవనం వద్దకు దూసుకురావడానికి కార్మికులు ప్రయత్నించారు. కేంద్ర మంత్రిత్వ శాఖ కార్యదర్శి నాగేంద్ర నాథ్ సిన్హా మంగళవారం నాడు విశాఖ ఉక్కు పరిశ్రమను సందర్శించారు. కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తూనే ఎప్పటికప్పుడు అధికోత్పత్తి సాధిస్తున్న కార్మికలోకాన్ని అభినందించాల్సిన ఆయన ఆ పని చేయకపోగా సందర్శకుల పుస్తకంలో వివాదాస్పద వ్యాఖ్యలు రాశారు. ఉత్పత్తి లక్ష్యాలను కార్మికులు ఎప్పటికప్పుడు అధిగమిస్తూ కొత్త రికార్డులు సృష్టిస్తుంటే సందర్శకుల పుస్తకంలో ' రెండు సంవత్సరాల తరువాత విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పాదకత ఉండదు' అని రాశారు. అంతటితో ఆగక ' ప్లాంటు జీవిత కాలం రెండేళ్లే ' అని కూడా లిఖించారు. కేంద్ర ప్రభుత్వ ఉక్కు కార్యదర్శి రాసిన ఈ రాతలను చూసి అధికార యంత్రాంగం సైతం దిగ్భ్రాంతికి గురైంది. విషయం తెలుసుకున్న స్టీల్ ప్లాంట్ కార్మికులు ఆగ్రహానికి గురయ్యారు. అడ్మిన్ భవనం ముట్టడికి సిద్ధమయ్యారు. నినాదాలు, నిరసనలతో చాలాసేపు ఆ ప్రాంగణం హోరెత్తింది. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా 922 రోజుల నుంచి తామంతా పోరాడుతున్న సందర్భంలో ఇక్కడికి వచ్చిన కేంద్ర స్టీల్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఇక్కడి పరిస్థితులను కేంద్ర ప్రభుత్వంతో చెప్పాల్సిపోయి సందర్శకుల పుస్తకంలో ఈ విధంగా రాయడం తగదంటూ కార్మికులు ఆగ్రహించారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్ జె.అయోధ్యరామ్ అడ్మిన్ బిల్డింగ్‌లోకి దూసుకుని వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు పెద్ద ఎత్తున మోహరించి ఆయనను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులకూ, పోలీసులకూ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుని తీరతామంటూ కార్మికులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. కేంద్ర స్టీల్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి స్టీల్ ప్లాంట్‌ను సందర్శిస్తారని తెలిసి కార్మికులు, ఎల్ఎంఎం, ఎస్‌బిఎం విభాగాలకు చెందిన ఉద్యోగులు మంగళవారం ఉదయం నుంచే పెద్ద ఎత్తున కూర్మన్నపాలెంలోని దీక్షా శిబిరం వద్దకు చేరుకుని ఆందోళనలో భాగస్వాములయ్యారు.

ప్లాంట్ ప్రయివేటీకరణ తగదు : ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

అంతకుముందు సిన్హాతో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు మిగతా2లో

ఎరువుల సంచులపై రాజకీయ ప్రచారమా..?

'ఒక దేశం-ఒకే ఎరువు' సర్క్యులర్‌పై ఎఐకెఎస్ ఆగ్రహం

న్యూఢిల్లీ : ఎరువుల సంచులపై రాజకీయ ప్రచారం చేయాలనుకునే కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎఐకెఎస్ తీవ్రంగా ఖండించింది. ప్రధానమంత్రి భారతీయ జనుర్వరక్ పరియోజన్ అనే పథకం ద్వారా 'ఒక దేశం- ఒకే ఎరువు' అమలు చేస్తామని ఇటీవల కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ జారీ చేసిన సర్క్యులర్‌పై ఎఐకెఎస్ మండిపడింది. ప్రతి ఎరువు బస్తాపై మోడీ ఫోటో, పేరు ముద్రించడాన్ని తప్పుపట్టింది. ఈ పథకం పేరు కూడా బిజెపి పేరును గుర్తు చేసే విధంగా ఉందని విమర్శించింది. ఎన్నికల సమయంలో ప్రభుత్వ ఖజానాను రాజకీయ ప్రచారానికి ఉపయోగించుకునేందుకే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ ఎత్తుగడ వేసిందని పేర్కొంది. ఈ మేరకు ఎఐకెఎస్ అధ్యక్ష, కార్యదర్శులు అశోక్ ధావలే, విజూ కృష్ణన్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి అవకాశాన్ని తమ పార్టీ ప్రచారానికి ఉపయోగించుకోవాలనే పట్టుదలతో అధికార బిజెపి ఉందని ప్రకటనలో విమర్శించారు. కోవిడ్ టీకా ధ్రువపత్రాలు, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేయబడిన ఆహార ధాన్యాల ప్యాకెట్లపై మోడీ ఫోటోలను ముద్రించడాన్ని ఎఐకెఎస్ గుర్తు చేసింది. ఎరువుల సబ్సిడీ వ్యవస్థ మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం సృష్టించినది కాదనీ, 1970 నుంచి ఇది ఉనికిలో ఉందని తెలిపింది. అయినా ప్రతీ బస్తాపై తన ఫోటో, పేరు ముద్రించుకోవడం ద్వారా మోడీ తాను చేయని పనికి క్రెడిట్ తీసుకుని సెల్ఫ్ ప్రమోషన్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారని ప్రకటన విమర్శించింది. నిజానికి 'ఒక దేశం-ఒకే ఎరువు' అనే భావనే పూర్తిగా అసంబద్ధమైనదని, దేశంలో వివిధ ప్రాంతాల్లో నేలలు, అవసరాలు, పంటలను బట్టి రకరకాల ఎరువులు అవసరమవుతాయని తెలిపింది. అలాగే పథకంతో దేశంలో వ్యవసాయరంగంలో క్రోనీ క్యాపిటలిజాన్ని ప్రోత్సహించేందుకే కేంద్ర మంత్రితత్వ శాఖ దీనిని తీసుకొచ్చిందని ఎఐకెఎస్ విమర్శించింది. ప్రస్తుతం ఎక్కువ శాతం ఎరువులు ప్రైవేటు కంపెనీల ద్వారా ఉత్పత్తి కావడమో లేక దిగుమతి చేసుకోవడమో జరుగుతోందని, ఈ ప్రైవేటు సంస్థలను మోడీ ప్రభుత్వం తమ రాజకీయ ప్రచారానికి వాహనంగా ఉపయోగించుకోవాలనుకుంటుందని విమర్శించింది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా ఎరువుల ఉత్పత్తి, సరఫరా తీవ్రంగా దెబ్బతిన్నాయని ఎఐకెఎస్ తెలిపింది. అశాస్త్రీయ పద్ధతులను మిగతా 2లో

కౌలు చెల్లించండి

- సిఆర్‌డిఎకు, ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి

రాజధాని ప్రాంత రైతులకు కౌలు చెల్లింపు అంశంలో సిఆర్‌డిఎ, రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తమకు వార్షిక కౌలు చెల్లించేలా ప్రభుత్వానికి ఆదేశించాలని కోరుతూ అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య, రాజధాని పరిరక్షణ సమితి ఆధ్వర్యాన పిటిషన్ దాఖలైంది. దీనిపై ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. రైతుల తరఫున న్యాయవాది ఉన్నం మురళీధర్ వాదనలు వినిపించారు.

రైతులకు కౌలు చెల్లించేందుకు జిఓ ఇచ్చిన ప్రభుత్వం.. కౌలు చెల్లించలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఏటా మేలో కౌలు చెల్లించేవారని, ఈ ఏడాది ఇప్పటి వరకు చెల్లించలేదని వాదించారు. వాదనలు విన్న హైకోర్టు.. సిఆర్‌డిఎ, ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అనంతరం తదుపరి విచారణను నాలుగువారాలకు వాయిదా వేసింది.

ఆ మూడు రోజులు ఢిల్లీ మూత

- సెప్టెంబరు 9, 10 తేదీల్లో జి20 శిఖరాగ్ర సదస్సు
- 8 నుంచి 10 వతేదీ వరకు ప్రభుత్వ సెలవుదినాలు: ఢిల్లీ పోలీసుల సిఫారసు
- రాజధానిలో అంతులేని ఆంక్షలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జి-20 శిఖరాగ్ర సమావేశం భారత్ అధ్యక్షతన వచ్చే నెల 9,10 తేదీల్లో ఢిల్లీలో జరగనున్న దృష్ట్యా దానికి ఒక రోజు ముందు నుంచే రాజధాని నగరాన్ని ఢిల్లీ పోలీసులు భద్రతా వలయంతో దిగ్బంధనం గావించనున్నారు. సెప్టెంబరు 8,9,10 తేదీల్లో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలను మూసివేయనున్నారు. ఆ మూడు రోజులు రాజధాని వీధులు జన సంచారం లేక బోసిపోనున్నాయి. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలకు సెలవు ప్రకటించాలని ఢిల్లీ పోలీసులు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేశారు. ప్రగతి మైదాన్ వద్ద ఇటీవల ప్రారంభించబడిన భారత్ మిగతా5లో

మరోసారి హద్దు మీరారు

- సూర్జిత్ భవన్‌లో పార్టీ వర్కుషాప్‌ను పోలీసులు అడ్డుకునే యత్నం
- ప్రతిఘటనతో వెనక్కి
- ఇసికి ఫిర్యాదు చేస్తాం:సీతారాం ఏచూరి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ అధీనంలోని ఢిల్లీ పోలీసులు మరోసారి హద్దు మీరారు. మూడు రోజుల క్రితం హరి కిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో సెమినార్‌ను అడ్డుకున్న పోలీసులు, తాజాగా పార్టీ వర్కుషాప్‌ను కూడా అడ్డుకునేందుకు యత్నించారు. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే సిపిఎం వర్కుషాప్ ప్రారంభం కావడానికి ముందు ఢిల్లీ పోలీసులు వచ్చి దీనిని అనుమతించలేమని చెప్పారు. జి20 సమ్మిట్ ముగిసే వరకు సూర్జిత్ భవన్‌లో ఎలాంటి కార్యక్రమాన్ని అనుమతించరాదని ఎస్‌హెచ్ఓ హుకుం జారీ చేశారు. దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని పార్టీ నేతలు హెచ్చరించారు. సిపిఎం మిగతా2లో

బీమాలో సామాజిక అసమానతలు

- గత రబీలో మెజార్టీ సంఖ్యలో ఒసిలు
- వారిది 51.10 శాతం
- ఒబిసిలు 41.53 శాతమే
- కౌలు రైతులకు మొండిచెయ్యి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

గత రబీలో కేంద్ర పథకం ఫసల్ బీమాతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన వైఎస్ఆర్ ఉచిత పంటల బీమాలో సామాజిక పొందిక ఉల్టాపల్టా అయింది. పంటలకు బీమా చేయించుకున్న రైతుల్లో జనరల్ కేటగిరి రైతుల శాతం అధికంగా కనిపిస్తోంది. ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి.. ఈ మూడు కేటగిరీలు కలుపుకుంటే కూడా జనరల్ కేటగిరీ (ఒసి) రైతులే ఎక్కువగా ఉన్నారు. కొన్ని జిల్లాల్లో ఆ సంఖ్య మరీ ఎక్కువగా ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి స్వంత జిల్లా వైఎస్ఆర్ కడపలో రాష్ట్రంలోనే ఎక్కువగా 76.26 శాతం మంది 'జనరల్' రైతులు ఉండటం విశేషం. 70 శాతానికిపైగా 'జనరల్' రైతులు కలిగిన జిల్లాలు తూర్పుగోదావరి (75.26 శాతం), ప్రకాశం (73.99 శాతం), పల్నాడు (71.79 శాతం). సాధారణంగా ఏజెన్సీ జిల్లాలైన అల్లూరి, మన్యం వంటి చోట్ల ఎస్‌టి రైతులు మెజార్టీ సంఖ్యలో ఉండటం కద్దు. తతిమ్మా జిల్లాల్లో బిసి జనాభా ఎక్కువుంటుంది. కానీ క్రాప్ ఇన్సూరెన్స్ విషయంలో 'జనరల్' రైతులు అధికంగా ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది.

బిసిల కంటే ఎక్కువా?

2022-23 రబీకిగాను 24 జిల్లాల్లో నోటిఫై చేసిన పంటలకు దిగుబడి ఆధారిత పంటల బీమా అమలు చేశారు. విశాఖపట్నం, పశ్చిమగోదావరి జిల్లాలను మినహాయించారు. బీమా కోసం 44.23 లక్షల దరఖాస్తులు రాగా 13.98 లక్షల మంది అర్హత పొందారు. పంటలు సాగు చేసిన 36.29 లక్షల ఎకరాలకు బీమా చేశారు. కాగా ఇన్సూరెన్స్ చేయించుకున్న రైతుల్లో జనరల్ కేటగిరీకి చెందిన వారిది 51.10 శాతం. తతిమ్మా అన్ని కేటగిరీల రైతులూ 48.90 శాతం. ఎస్‌సి 6.16 శాతం, ఎస్‌టి 1.21 శాతం, ఒబిసి 41.53 శాతం. జిల్లాలవారీగా ఎక్కువ తక్కువలున్నప్పటికీ ఎపిలో ఎస్‌సి జనాభా సుమారు 16 శాతం, ఎస్‌టి జనాభా 6 శాతం. ఇవి కూడా 2011 జనగణనకు చెందినవి. రాష్ట్ర విభజన ముందు నాటివి. బిసి కుల గణన చేపట్టకపోయినా జనాభాలో వారు 40-50 శాతం పైగానే ఉంటారు. జనరల్ కేటగిరీ జనాభా 30 శాతానికి ఎట్టి పరిస్థితుల్లోనూ మించదు. క్రాప్ ఇన్సూరెన్స్‌లో జనరల్ కేటగిరీ రైతులు 50 శాతానికంటే ఎక్కువ ఉన్నారు. ఆలిండియా స్థాయిలో గత రబీలో పంటల బీమా చేయించుకున్న రైతుల్లో ఎస్‌సి 6.78 శాతం, ఎస్‌టి 5.35 శాతం, జనరల్ 32.47 శాతం కాగా ఒబిసి 55.40 శాతం. గత ఖరీఫ్‌లో మన దగ్గర కూడా సామాజిక పొందిక వాస్తవాలకు తగ్గట్టే ఉంది. ఎపిలో 2022-23 ఖరీఫ్‌లో పంటల బీమా చేయిం చుకున్న రైతుల్లో ఎస్‌సి 6.25 శాతం, ఎస్‌టి 8.68 శాతం, జనరల్ 27.51 శాతం, ఒబిసి 57.56 శాతం. రబీ దగ్గరకొచ్చేసరికి ఒబిసిల పర్సెంటేజి తగ్గింది.

కౌల్దారులైనందునే...

ఎస్‌సి, ఎస్‌టి, బిసిలలో ఎక్కువగా కౌలు రైతులుంటారు. వారికి సరైన గుర్తింపు లేని కారణంగా, పంటలు సాగు చేసేది వారే అయినప్పటికీ బీమా మాత్రం భూయజమానుల పేరు మీద జరుగుతోందని, విపత్తుల వలన పంటలు నష్టపోతే వచ్చే అరకొర పరిహారం కూడా ల్యాండ్ ఓనర్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి మిగతా 2లో

29న మణిపూర్ అసెంబ్లీ సమావేశం

- రాష్ట్ర కేబినెట్ నిర్ణయం

గువహటి : మణిపూర్ శాసనసభ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 29న నిర్వహించాలని ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ నేతృత్వంలోని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. సోమవారం తీసుకున్న నిర్ణయాన్ని ముఖ్యమంత్రి కార్యాలయం మంగళవారం ఎక్స్ (ట్విట్టర్)లో ప్రకటించింది. జులై నుండి మణిపూర్ కేబినెట్ మూడుసార్లు ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో జాతుల ఘర్షణ, హింసపై చర్చించేందుకు సోమవారం ప్రత్యేక సమావేశం జరపాలని కేబినెట్ కోరినా గవర్నర్ నోటిఫికేషన్ జారీ చేయకపోవడంతో సమావేశం జరగలేదు. ఈసారి గవర్నర్ నోటిఫకేషన్ జారీ చేస్తారని భావిస్తున్నట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఏడాదిలో కనీసం రెండుసార్లు అసెంబ్లీ సమావేశమవాల్సి వుంటుంది. గత సమావేశం మార్చిలో జరిగింది. సెప్టెంబరు 2 లోగా మరో సమావేశం జరగాల్సి వుంది. అయితే ఒకవేళ సమావేశం పెట్టినా భద్రతా కారణాల రీత్యా తాము రాలేమని ఇప్పటికే బిజెపికి చెందిన ఏడుగురు కుకీ ఎమ్మెల్యేలు చెప్పారు.

ఇక ఎపి ఎన్‌జిజిఓ

ఎపి ఎన్‌జిఓ పేరు మార్పు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ నాన్ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్‌ను ఇకపై ఆంధ్రప్రదేశ్ నాన్ గజిటెడ్, గజిటెడ్ అసోసియేషన్ (ఎపి ఎన్‌జిజిఓ)గా పేరు మారుస్తూ ఎపి ఎన్‌జిఓ 21వ రాష్ట్ర మహాసభ తీర్మానం చేసింది. ఆ సంఘ మహాసభ సందర్భంగా మంగళవారం పలు తీర్మానాలకు ఆమోదం తెలిపింది. హైదరాబాద్‌లో ఉన్న హెడ్ క్వార్టర్స్ స్థానంలో అమరావతిలో ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవాలని, నూతన జిల్లాల్లో కార్యవర్గాలను ఎన్నుకోవడంతో పాటు మహిళలకు సముచిత స్థానాలు కల్పించాలని తీర్మానించింది. వెస్ట్ కృష్ణా అధ్యక్షులు, సంఘం కాన్‌స్టిట్యూషన్ కమిటీ మెంబరు ఎ.విద్యాసాగర్ తీర్మానాలను ప్రవేశపెట్టారు. పశ్చిమ కృష్ణా ప్రధాన కార్యాలయం విజయవాడలో, తూర్పు కృష్ణా శాఖ కార్యాలయం మచిలీపట్నంలో ఉండాలని , సవరించిన బైలాస్ ప్రకారం నాన్ గజిటెడ్, గజిటెడ్, నాన్ గజిటెడ్ కేడర్ సేవల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులందరికీ మెంబర్ షిప్ ఇవ్వాలని మహాసభ తీర్మానించింది.

ఈ సందర్భంగా ఎపి ఎన్‌జిఓ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల్లో కొన్ని విభాగాల్లో ఎదుర్కొంటున్న ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ముందు ఉంచామని, వీలైనంత వేగంగా సమస్యలను పరిష్కరించేందుకు ఆయన కృషి చేస్తారని అన్నారు. మహాసభకు రాష్ట్ర ముఖ్యమంత్రిని ఆహ్వానించడం గత ఏడు దశాబ్దాలుగా ఆనవాయితీగా వస్తోందన్నారు. ముఖ్యమంత్రి నుంచి ఉద్యోగులకు ప్రయోజనం కలిగించే ఏదో ఒక ప్రకటన వస్తుందని ఉద్యోగులు ఎవరూ భావించలేదన్నారు. తమ సంఘంలో గజిటెడ్ ఆఫీసర్లను కూడా సభ్యులుగా చేర్చుకోవాలని నిర్ణయించినట్లు బండి శ్రీనివాసరావు వెల్లడించారు. తమ బైలాలో ఇందుకు సంబంధించిన సవరణలను కూడా చేపట్టి సవరించిన అంశాలను కూడిన ప్రతులను ప్రభుత్వానికి పంపిస్తామని, ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చాక తమ సంఘం పేరును మారుస్తామన్నారు.

ఆలిండియా గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు సుభాష్ లంబా మాట్లాడుతూ ఓపిఎస్ విధానాన్ని దేశంలో ఐదు రాష్ట్రాలు అమలు చేస్తున్నాయన్నారు. ఓపిఎస్ గురించి నవంబరు 3న ఢిల్లీలో ర్యాలీ చేయనున్నట్లు లంబా పేర్కొన్నారు. రాష్ట్ర (ఫధాన కార్యదర్శి కెవి శివారెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వం శాశ్వత ఉద్యోగులుగా గుర్తించేందుకు ప్రభుత్వం అంగీకరించడం శుభపరిణామమన్నారు. ఇదే విషయంలో కొంతమంది కాంట్రాక్టు ఉద్యోగులు తెలిపిన అభ్యంతరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేలా సంఘం బాధ్యత తీసుకుంటుందన్నారు.

ఫ్యాప్టో ధర్నా వాయిదా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల సమస్యలపై ఈ నెల 23న ఫ్యాప్టో చేపట్టనున్న ధర్నా వాయిదా పడింది. మంగళవారం విజయవాడలో ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించేందుకు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ.. ఫ్యాప్టో ప్రతినిధుల బృందంతో చర్చలు జరిపారు. చర్చల్లో పాఠశాల విద్యాకమిషనర్ సురేష్ కుమార్, సమగ్ర శిక్ష ఎస్‌పిడి శ్రీనివాసరావు, జెడి సర్వీస్ ఎం రామలింగం, సెక్రటరీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, జెడి సర్వీసెస్ కో-ఆర్డినేటర్ పి పార్వతి, ఫ్యాప్టో ఛైర్మన్ ఎన్ వెంకటేశ్వర్లు, మంజుల, కో-ఛైర్మన్ నరహరి, మనోజ్ కుమార్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ సాయి శ్రీనివాస్, చిరంజీవి, శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు కెఎస్ ప్రసాద్, హెచ్ హృదయరాజు, తిమ్మన్న, భానుమూర్తి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులకు ఈ నెలలో ఎరియర్స్ బిల్స్, ఆగస్టు నెల జీతాలను చెల్లించటానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని ఫ్యాప్టో ఛైర్మన్ ఎన్ వెంకటేశ్వర్లు తెలిపారు. జిఓ 117పై మరింత సమగ్ర చర్చ జరగాలని, జిఓను పూర్తి స్థాయిలో సమీక్షించాలని కోరారు. ఒక సంవత్సరం లోపల రిటైర్డ్ అయ్యే ఉపాధ్యాయులకు, అనారోగ్యానికి గురైన వారికి ఈ సర్దుబాటు నుంచి మినహాయింపు ఇస్తామని అన్నారని తెలియజేశారు. ఈ నేపథ్యంలోనే బుధవారం జరగాల్సిన ఉపాధ్యాయుల ధర్నాను వాయిదా వేస్తున్నట్లు ఎన్ వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ మంజుల ఒక ప్రకటనలో తెలిపారు.

పెన్షన్ రూ.తొమ్మిది వేలు చెల్లించాలి

- విజయవాడ ధర్నా చౌక్‌లో నిరసన దీక్ష

ధర్నా చేస్తున్న పెన్షనర్లకు సంఘీభావం తెలుపుతున్న సిహెచ్ బాబూరావు

ప్రజాశక్తి - విజయవాడ

కార్మికులు, ఉద్యోగులకు ఇచ్చే పెన్షన్ ప్రభుత్వాల భిక్షకాదని, హక్కుగా గుర్తించాలని సిఐటియు రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబూరావు అన్నారు. ఇపిఎఫ్ పెన్షనర్లకు రూ.తొమ్మిది వేల కనీస పెన్షన్ ఇవ్వాలని, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (ఎపిఆర్‌పిఎ) కేంద్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం విజయవాడ ధర్నాచౌక్‌లో నిరసన దీక్ష జరిగింది. పలువురు పెన్షనర్లు దీక్షలో పాల్గొన్నారు. వారికి పలువురు నేతలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బాబురావు, పెన్షనర్ల సంఘం నాయకులు ఎన్.ఎ.శాస్త్రి, జీవరత్నం, సిఐటియు నేతలు ఎ.వెంకటేశ్వరరావు, సుధాకర్ మాట్లాడారు. శతకోటీశ్వరులైన ప్రజా ప్రతినిధులకు వేల రూపాయల పెన్షన్లు ఇస్తూ, ఆర్‌టిసి, మిల్క్ ప్రాజెక్ట్ తదితర ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రయివేటు సంస్థల్లో పనిచేసి రిటైరైన వారికి నెలకు రూ.1000 కనీస పెన్షన్ ఇవ్వడం సిగ్గుచేటన్నారు. మరోవైపు వీరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. పెన్షన్ నిధులను స్టాక్ మార్కెట్లో ఉంచి కార్పొరేట్లకు మోడీ ప్రభుత్వం ఊడిగం చేస్తోందన్నారు. కనీస పెన్షన్ పెంచని కేంద్ర ప్రభుత్వాన్ని గద్దెదించాలని పెన్షనర్ల సంఘం పిలుపునివ్వడం అభినందనీయమన్నారు.

రైల్వేలో సీనియర్ సిటిజన్లకు ఉన్న 50 శాతం రాయితీని కేంద్రం రద్దు చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ తీసుకురాకుండా జిపిఎస్ పేరుతో ఉద్యోగులను మభ్యపెడుతోందని విమర్శించారు. జీవిత కాలమంతా శ్రమటోడ్చి పని చేసిన వారికి పెన్షన్ చెల్లించడం ప్రభుత్వాలు, యాజమాన్యాల బాధ్యత అని తెలిపారు. వారిని భారంగా ప్రభుత్వాలు చూడటం క్షంతవ్యం కాదన్నారు. సమాజానికి సేవలు అందించిన వృద్ధులు, పెన్షనర్ల బాగోగులను చూడాల్సిన నైతిక బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఈ నిరసన దీక్షలో ఇంకా పెన్షన్‌దారుల సంఘం నేతలు శ్రీనివాస్, ప్రభుదాస్, ఎంఎన్.పాత్రుడు, పి.మురహరి, జిపి.రామస్వామి పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న బాలాంత్రపు ప్రసూన

తొలి ప్రయత్నంలోనే మంచి రచన

- "ద మ్యాంగో లేడీ" పుస్తక పరిచయ సభలో పలువురు వక్తలు

ప్రజాశక్తి-విజయవాడ

తొలి రచనలోనే అన్ని పార్శ్వాలను టచ్ చేస్తూ అనుపమ పద్మజ మల్లాజోశ్యుల పుస్తక రచన సాగించడం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. అనుపమ పద్మజ మల్లాజోశ్యుల రచించిన "ద మ్యాంగో లేడీ" పుస్తక పరిచయ సభ సాహితీ స్రవంతి-సమన్విత-జిఆర్‌కె- పోలవరపు సాహితీ సమితి, జాషువా సాంస్కృతిక వేదిక-ప్రజాశక్తి బుక్ హౌస్ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో జరిగింది. దీనికి సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓ శాంతిశ్రీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రచయిత బాలాంత్రపు ప్రసూన పుస్తకాన్ని పరిచయం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఒక తెలుగు రచయిత్రి ఆంగ్లంలో తొలి రచనగా 31 సంవత్సరాల వయస్సులోనే ఈ పుస్తకాన్ని రచించడం గొప్ప విషయమని అన్నారు. నవలలోని పాత్రధారి "మంగ" అనే ఒక పాప ఒక గ్రామంలో అనాధగా ప్రవేశించి, ఆ గ్రామస్తులందరితోనూ దేవతగా పూజించబడి, కొన్ని కారణాల వల్ల ఆ గ్రామం నుంచి వెళ్లగొట్టబడిందని తెలిపారు. 13 ఏళ్లకే పెళ్లి కావడం, చివరకు భర్తను కోల్పోయి, పట్టుదలతో చదువుకొని అమెరికా వెళ్లి, తిరిగొచ్చి ఆ గ్రామానికి అండగా నిలబడిన ఒక యువతి కథ ఎన్నెన్నో మలుపులతో ఎంతో చక్కగా రచయిత రచించారని పేర్కొన్నారు. ఎంతో శ్రమకోర్చి పుస్తకాన్ని పూర్తి చేశారని తెలిపారు. వికసిత పుష్పంగా అనుపమ పద్మజ రచన చేయడానికి ముందుకు వచ్చారని, ఈ ప్రయత్నం ఎంతో అభినందనీయమన్నారు. మరో రచయిత దుట్టా శమంతకమణి మాట్లాడుతూ... ప్రతిపాత్రలో రచయిత పరకాయి ప్రవేశం చేశారని పేర్కొన్నారు. పుస్తకంలోని అన్ని పాత్రలు, భాష ఎంతో చక్కగా ఉన్నాయన్నారు. రచయిత అనుపమ పద్మజ తన పుస్తకం నేపథ్యాన్ని వివరించారు. రచయిత తల్లి పద్మజ తన కుమార్తె రచనకు తోడ్పాటునందించిన వైనాన్ని వివరించారు. ముందుగా వక్తలను సాహితీస్రవంతి నిర్వాహకులు సత్యాజీ వేదికపైకి ఆహ్వానించగా, ప్రజాశక్తి బుక్‌హౌస్ మేనేజర్ లక్ష్మయ్య వందన సమర్పణ చేశారు. శాంతి పాట పాడారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా ఆర్ట్స్ అకాడమి ప్రధాన కార్యదర్శి గోళ్ల నారాయణరావు, పలువురు సాహితీవేత్తలు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

మేం కలిసే నడుస్తాం

- కమ్యూనిస్టులేకుంటే మునుగోడులో బిఆర్‌ఎస్ గెలిచేదా?
- అవకాశవాదంతో కెసిఆర్ మిత్ర ధర్మం పాటించలేదు
- సిపిఐ, సిపిఎం సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఎం, సిపిఐ కలిసే పోటీ చేస్తాయని ఆ పార్టీల రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. కలిసొచ్చే వామపక్ష, లౌకిక, అభ్యుదయ, ప్రజాతంత్ర శక్తులతో కలిసి ముందుకెళ్తామని చెప్పారు. ఏకపక్షంగా బిఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించడం సరైంది కాదన్నారు. సిఎం కెసిఆర్ అవకాశవాదంతో పొత్తు ధర్మాన్ని పాటించలేదని, దీనిపై ఆయన వివరణ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కమ్యూనిస్టులేకుంటే మునుగోడు ఉప ఎన్నికల్లో బిఆర్‌ఎస్ అభ్యర్థి గెలిచేవారా? అని ప్రశ్నించారు. బిఆర్‌ఎస్ రాజకీయ వైఖరిలోనే మార్పు వచ్చిందని, లేదంటే పొత్తు వైఫల్యానికి కారణాలేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ పరిణామాలను ప్రజలు అర్థం చేసుకుని వామపక్ష పార్టీలను వచ్చే ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌లో మంగళవారం సిపిఐ, సిపిఎం రాష్ట్ర నాయకుల ఉమ్మడి సమావేశం జరిగింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, జాన్‌వెస్లీ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ సిఎం కెసిఆర్ ఏకపక్షంగా బిఆర్‌ఎస్ అభ్యర్థుల జాబితాను ప్రకటించారన్నారు. ఇది ఊహించని పరిణామమని పేర్కొన్నారు. ఇది మిత్రధర్మం కాదన్నారు. మునుగోడు ఎన్నికలప్పుడు వారే తమ మద్దతు అడిగారని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లోనూ కలిసే పనిచేస్తామంటూ సిఎం కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావు ప్రకటించారని చెప్పారు. బిఆర్‌ఎస్ ఆవిర్భావ సభకు సైతం ఆహ్వానించారని, కేరళ ముఖ్యమంత్రి విజయన్ వచ్చారని అన్నారు. అఖిల భారత స్థాయిలో బిజెపిని ఓడించడమే లక్ష్యమంటూ కెసిఆర్ ప్రకటించారని వివరించారు. ఇప్పుడు అందుకు విరుద్ధంగా ఏకపక్షంగా వ్యవహరించారన్నారు. అయితే, ఇక్కడ సీట్లు సమస్య కాదని, బిఆర్‌ఎస్ రాజకీయ వైఖరిలోనే తేడా వచ్చిందని వివరించారు. బిజెపిని ఓడించేందుకే ఇండియా కూటమి ఏర్పడగా, తాము ఎన్‌డిఎ, ఇండియా కూటములకు దూరంగా ఉన్నామంటూ బిఆర్‌ఎస్ నేతలు చెప్పారని గుర్తు చేశారు. 2024లో బిజెపిని గద్దెదించడమే తమ లక్ష్యమని, కేరళలో సిపిఎంకు ప్రత్యర్థిగా కాంగ్రెస్ ఉన్నా దేశ సమైక్యత, బిజెపిని ఓడించడం కోసమే ఆ కూటమిలో ఉన్నామని చెప్పామని చెప్పారు. సీట్లు ప్రకటించాక పొత్తు కోసం వెంపర్లాడాల్సిన అవసరం లేదన్నారు. మునుగోడులో మద్దతు ఇవ్వడంలో ఇసుమంత తప్పులేదని స్పష్టం చేశారు. బిజెపి, బిఆర్‌ఎస్ ఒకటే అని తాము అనడం లేదన్నారు. బిజెపికి వ్యతిరేకంగా బిఆర్‌ఎస్ పనిచేయాలని కోరారు. ఒక ఎమ్మెల్యే, రెండు ఎమ్మెల్సీ సీట్లు ఇస్తామన్నారని, దాన్ని అంగీకరించలేదని చెప్పారు. బిజెపి పట్ల బిఆర్‌ఎస్ వైఖరి ఏమిటో కెసిఆర్ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తొమ్మిదేళ్లలో అప్రజాస్వామిక పాలన కొనసాగించారని, ఏకపక్ష, నియంతృత్వ విధానాలను అవలంభించారని, ధర్నాచౌక్‌ను ఎత్తేశారని, ఉద్యమాలను అణచివేశారని విమర్శించారు. అయితే, బిజెపిని వ్యతిరేకించినందుకే మునుగోడులో మద్దతిచ్చామని, రాజకీయ స్నేహం కొనసాగించామని చెప్పారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సిఎం కెసిఆర్ ఏకపక్షంగా బిఆర్‌ఎస్ జాబితాను ప్రకటించిన తీరు అభ్యంతరకరమని, కనీసం మిత్రధర్మాన్ని, స్నేహాన్ని పాటించలేదని, పొమ్మనకుండా పొగ పెట్టినట్టుగా ఉన్నదని విమర్శించారు. బిజెపితో ఎక్కడో సఖ్యత వచ్చిందనే అంశం తమకు అర్థమైందన్నారు. రాష్ట్రంలో బిజెపి ప్రమాదం ఉందా? లేదా?అనే దానిపై కెసిఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మునుగోడులో బిజెపి గెలిస్తే ప్రస్తుతం తెలంగాణలో రాజకీయ పరిస్థితి, కెసిఆర్ పరిస్థితి ఏమయ్యుండేదని నిలదీశారు. బిఆర్‌ఎస్‌తో పొత్తు చెడినా తాము వ్యక్తిగతంగా కాకుండా విధానపరంగానే విమర్శిస్తామన్నారు. బిఆర్‌ఎస్‌ది రాజకీయ అవకాశవాదమని విమర్శించారు.

మహిళలపై హింసను నివారించేందుకు చర్యలు తీసుకోండి : మహిళా సంఘాల ఐక్యవేదిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహిళలపై పెరిగిపోతున్న హింసను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకునేలా ఒక విధానపరమైన విధానాన్ని తీసుకురావాలని మహిళా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర సచివాలయంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జి జయలక్ష్మికి మహిళా సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు డి రమాదేవి, డి శ్రీనివాసకుమారి, శ్రీదేవి (ఐద్వా), పి పద్మ (పిఒడబ్ల్యు) కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ఇటీవల కాలంలో మహిళలు, బాలికలపై లైంగిక హింస దారుణంగా పెరిగిందని వివరించారు. సోదరిని వేధించవద్దన్నందుకు 15 ఏళ్ల పిల్లవాడిని దారుణంగా హత్యచేశారని తెలిపారు. చాలా కేసుల్లో పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంతో హింసకు అడ్డులేకుండా పోతోందన్నారు. నిర్భయ, దిశ చట్టాలు ప్రచారానికే పరిమితమయ్యాయి తప్ప మహిళలపై హింసను నివారించలేకపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు, హత్యలను విచారించేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని కోరారు. గుజరాత్‌లోని అదానీ పోర్టు, విశాఖలోని ఏజెన్సీ ప్రాంతం మత్తుమందులకు అడ్డాగా మారాయని తెలిపారు. మద్యం, మత్తు మందుల దురలవాట్లతో యువత విచక్షణ కోల్పోయి తమ జీవితాలను కోల్పోతున్నారని అన్నారు. రాష్ట్రంలో బెల్ట్‌షాప్‌లు నిషేధించామని చెబుతున్నా.. ఆచరణలో బెల్ట్‌షాపులు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై జరిగే ఈ దాడులను నియంత్రించేందుకు న్యాయ, సామాజిక నిపుణులతో కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మీడియా మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేసి హింస, అశ్లీలత వున్న సినిమాలను, టివి సీరియల్స్‌ను నియంత్రించాలని కోరారు. సోషల్ మీడియా ట్రోలింగ్‌లపై చర్యలు తీసుకోవాలన్నారు. బాల్యవివాహాల నిరోధానికి బాలికలకు నిర్భంద విద్యను 19 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. అనాధ బాలలు, బాలికలు వుండే హాస్టల్స్ ఆవరణలో గెస్ట్‌హౌస్‌లు లేకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

యువరైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-పెద్దవడుగూరు (అనంతపురం)

అప్పుల బాధ తాళలేక ఓ యువరైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... మేడిమాకులపల్లి గ్రామానికి చెందిన తోట రాజశేఖరరెడ్డి(32) తనకున్న పొలంలో మిరప, పత్తిపంటలు సాగుచేశారు. సాగు నిమిత్తం దాదాపు రూ.16 లక్షల వరకు అప్పులు చేశారు. పంటలు చేతికందకపోవడంతో అప్పుల భారం అధికమైంది. అప్పులు తీరే దారిలేక సోమవారం రాత్రి పొలం వద్దకెళ్లి పురుగుల మందు తాగారు. తోటి రైతులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

నేటి నుంచి గిడుగు రామ్మూర్తి జయంతి వారోత్సవాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి 160వ జయంతి సందర్భంగా ఈ నెల 23 నుంచి 29 వరకు వారం రోజులపాటు తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షులు పి విజయబాబు తెలిపారు. అమరావతి సచివాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ద్విభాషా విధానాన్ని ప్రోత్సహించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటోందని అన్నారు. ఈ వారోత్సవాలను అన్ని జిల్లాల కేంద్రాలతోపాటు రాష్ట్ర స్థాయిలో ప్రధానంగా గుంటూరు, విజయవాడ కేంద్రాల్లో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ వారోత్సవాల్లో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు, రాష్ట్ర సచివాలయంలోని ఉద్యోగులకు కథలు, కవితలు, అంత్యాక్షరీ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే సాహితీ వేత్తలను, భాషా సేవకులను, భాషా వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్న వారిని ఈ సందర్భంగా సత్కరిస్తామని అన్నారు. తెలుగు భాషా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా రాష్ట్ర స్థాయిలో ఈ నెల 23న ఉదయం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ వారోత్సవాలు ప్రారంభమై ఈ నెల 29న సాయంత్రం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే కార్యక్రమంతో ముగుస్తాయన్నారు.

ఎరువుల సంచులపై రాజకీయ ప్రచారమా..?

(మొదటి పేజీ తరువాయి)

ప్రోత్సహించడం, దేశీయ ఉత్పత్తిని అణగదొక్కడం, ఎరువులను పెద్ద ఎత్తున బ్లాక్ మార్కెటింగ్‌కు అనుమతించడం వంటి కారణాలతో ఎరువుల సరఫరా తీవ్ర సంక్షోభంలో పడిన విషయాన్ని గుర్తు చేసింది. ఎన్నికల సమయంలో ప్రధానమంత్రి భారతీయ జనుర్వరక్ పరియోజన్ వంటి పథకాలతో జిమ్మిక్కులకు పాల్పడుతున్నారని, కేంద్ర ప్రభుత్వం ధరల నియంత్రణను కఠినంగా అమలు చేయాలని, రైతుల నుంచి కార్పొరేట్ కంపెనీల దోపిడీని అరికట్టాలని ఎఐకెఎస్ డిమాండ్ చేసింది.

మహిళా సాధికారతకు చేయూత

- సెర్ప్ సిఇఒ ఇంతియాజ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రతి మహిళనూ వ్యాపారవేత్తగా తీర్చిదిద్ది వారి కుటుంబాల్లో ఆర్థిక సుస్థిరత, సాధికారతను తీసుకురావడమే లక్ష్యంగా సంస్థ పనిచేస్తున్నదని సెర్ప్ కార్యనిర్వహణాధికారి ఇంతియాజ్ అన్నారు. విజయవాడలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి సంక్షేమ పథకాలను అందిస్తూ మహిళా సాధికారతకు విశేష కృషి చేస్తున్నదని తెలిపారు. మహిళలకు సున్నా వడ్డీ, అమ్మఒడి, వైయస్ఆర్ చేయూత, ఆసరా కింద నాలుగేళ్లలో 64 వేల కోట్లను వారి ఖతాల్లో జమ చేశామని పేర్కొన్నారు. గతంలో సి, డి గ్రేడ్‌లోకి ఉన్న సంఘాలు, ఈ పథకాల సహకారంతో ఎ, బి గ్రేడ్‌లోకి చేరాయని పేర్కొన్నారు. ప్రభుత్వం క్రమం తప్పకుండా వైయస్ఆర్ సున్నా వడ్డీ చెల్లిస్తున్నందున గతంలో నిర్వీర్యమైన సంఘాలు తిరిగి క్రియాశీలకంగా మారాయని అన్నారు. ప్రస్తుతం బ్యాంకులు డ్వాక్రా సంఘాలకు రూ.20 లక్షల వరకు ఎటువంటి పూచీకత్తు లేకుండా బ్యాంకు లింకేజీ ద్వారా రుణం ఇస్తున్నట్లు తెలిపారు. సంఘాలు తీసుకున్న రుణాలను చెల్లించడంలో 99.67 శాతం రికవరీతో రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉన్నదని అన్నారు. బిగ్ ఇంపాక్ట్ ప్రాజెక్టులో భాగంగా 16 వేల మందికి లబ్ధి చేకురేలా రూ.60 కోట్లతో 12 జిల్లాల్లో చిన్న, మధ్యతరహా పరిశ్రములు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

నా హత్యకు కుట్ర : పోసాని

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తనపై టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హత్యకు కుట్ర చేస్తున్నారని ఎపి స్టేట్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పోసాని కృష్ణ మురళి ఆరోపించారు. మంగళవారం సచివాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోకేష్ పిఎ చైతన్య తనను టిడిపిలోకి ఆహ్వానించారని, అంగీకరించలేదనే అక్కసుతో చంపేందుకు కుట్ర చేస్తున్నారని తెలిపారు. లోకేష్ అక్రమాలపై విమర్శలు చేసినందుకు తనపై రూ.నాలుగు కోట్ల పరువు నష్టం కేసు వేశారని అన్నారు. కంతేరులో లోకేష్ భూమి కొన్నారని ఆరోపించడం పరువు నష్టం అయ్యిందా? అని ప్రశ్నించారు.

సభలో మాట్లాడుతున్న లోకేష్

ప్రజల కష్టాలు చూశా... వారి కన్నీళ్లు తుడుస్తా

- యువగళం బహిరంగ సభలో లోకేష్

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

యువగళం పాదయాత్రలో ప్రజల కష్టాలు చూశానని, వారి కష్టాలు తొలగించేందుకు, కన్నీళ్లు తుడిచేందుకు కృషి చేస్తానని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 191వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా గన్నవరంలో మంగళవారం రాత్రి బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మహాశక్తి పథకం కింద ఆడబిడ్డ నిధి ఏర్పాటు చేసి 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్నారు. తల్లికి వందనం పథకం కింద ప్రతి తల్లికి ఏడాదికి రూ.15 వేలు పంపిణీ చేస్తామని, దీపం పథకంలో ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని, ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరుద్యోగులను మోసగించారని అన్నారు. స్టడీ సర్కిళ్లు మూసేశారని తెలిపారు. తమ ప్రభుత్వంలో ప్రభుత్వ, ప్రయివేట్, స్వయం ఉపాధి ద్వారా ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. నిరుద్యోగ యువతకు యువగళం నిధి కింద నెలకు రూ.3 వేల ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఏడాది జాబ్ నోటిఫికేషన్ ఇస్తామని ప్రకటించారు. వ్యవసాయం పంపుసెట్లకు అమర్చిన విద్యుత్ మీటర్లను తొలగిస్తామని, ఇసుక, సిమెంట్, స్టీల్ ధరలను తగ్గించి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. రైతులకు ప్రతి ఏడాది రూ.20 వేలు ఇస్తామని తెలిపారు. ఇసుక దందాలో జగన్ అక్రమంగా సంపాదిస్తున్నారని ఆరోపించారు. టిడిపి కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధింపులు గురిచేస్తున్న పోలీస్ అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తొలుత టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ విగ్రహానికి లోకేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాదయాత్రలో టిడిపి నేతలు కొనకళ్ల నారాయణరావు, వర్ల రామయ్య, పంచుమర్తి అనురాధ, మండలి బుద్ధప్రసాద్, జలీల్ ఖాన్, కనకమేడల రవీంద్ర, దేవినేని ఉమా, బుద్దా వెంకన్న, అశోక్ బాబు, గద్దె అనురాధ, శ్రీరాం తాతయ్య, కంభంపాటి రామ్మోహనరావు, నెట్టం రఘురామ్, కొల్లు రవీంద్ర, చింతకాయల అయ్యన్నపాత్రుడు, తంగిరాల సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లి పెత్తందారులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తిరుపతి జిల్లా పుత్తూరు మండలం గొల్లపల్లి గ్రామంలో పోలాక్షమ్మ గుడి జాతర సందర్భంగా పొంగళ్ళు పెట్టుకోవడానికి వెళ్లిన దళితులను అడ్డుకుని అవమానించిన పెత్తందారులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ నల్లప్ప, ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు.

రేపు కార్మిక, రైతు ఉమ్మడి జాతీయ సదస్సు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సమాఖ్యల ఉమ్మడి వేదిక, సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) తల్కతోరా స్టేడియంలో ఈ నెల 24న చారిత్రాత్మక అఖిల భారత సదస్సు నిర్వహించనున్నాయి. కార్మిక, కర్షకుల హక్కులపై పెరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య హననాన్ని నిరసిస్తూ కార్మికులు, రైతుల ఐక్య పోరాటానికి సంస్థాగత రూపం ఇవ్వడానికి ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, హెచ్‌ఎంఎస్, ఎల్‌పిఎఫ్, ఎఐయుటియుసి, టియుసిసి, ఎస్సిడబ్ల్యుఎ, ఎఐసిసిటియు, యుటియుసి పది కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక 2014లో మోడీ వచ్చినప్పటి నుండి కార్మికుల తరపున దేశవ్యాప్తంగా కార్మికుల ఐక్య పోరాటానికి నాయకత్వం వహించింది. ఈ కాలంలో అనేక అఖిల భారత సార్వత్రిక సమ్మెలను నిర్వహించిన సంగతి విదితమే.

మైనార్టీల అభ్యున్నతికి కృషి : ఇక్బాల్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మైనారిటీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందించడంతో పాటు వారి సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని రాష్ట్ర మైనారిటీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్‌ఖాన్ అన్నారు. ముస్లిములు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, పారసీల సమస్యలపై వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని కర్నూలు కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అహ్మద్‌ఖాన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన, ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైనారిటీ కమిషన్ ఛైర్మన్ మాట్లాడుతూ.. 37 వినతులు స్వీకరించామని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ఎస్‌బిఐ చీఫ్ దినేష్ పదవీకాలం పొడిగింపు..!

న్యూఢిల్లీ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఛైర్మన్ దినేష్ ఖారా పదవీ కాలాన్ని పొడిగించే అవకాశం ఉందని తెలుస్తోంది. వచ్చే అక్టోబర్ ముగింపు నాటికి ఆయన పదవీ విరమణ పొందాల్సి ఉంది. కాగా.. పది నెలల పాటు పదవీ కాలాన్ని పొడిగించే అవకాశం ఉందని సమాచారం. ఇటీవల దేశంలో ఆదాయపు పన్ను కట్టేవారి సంఖ్య గణనీయంగా పెరిగిందని, తలసరి వార్షిక ఆదాయం 2014- 2023 మధ్య 2 లక్షల నుంచి 13 లక్షలకు పెరిగిందంటూ ఎస్‌బిఐ రిసెర్చి గ్రూప అధ్యయనంపేరిట ఒక నివేదిక ఇచ్చారు. ప్రభుత్వానికి అనుకూలంగా నివేదిక ఇచ్చినందుకు బహుమానమే ఈ పదవీ కాలం పొడిగింపు అని పరిశీలకులు భావిస్తున్నారు.

మరోసారి హద్దు మీరారు

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరైన పార్టీ కార్యక్రమం అని, ఎసిపితో సహా ఉన్నతాధికారులకు సమాచారం అందించామని సుర్జిత్ భవన్ నిర్వాహకులు ఎస్‌హెచ్‌ఒకు తెలిపారు. ఎసిపిని సంప్రదించడంతో పోలీసు బృందం వెనుదిరిగింది. ఎస్‌హెచ్‌ఒ దురుసుగా ప్రవర్తించడంపై సిపిఎం నాయకత్వం ఢిల్లీ పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. రెండు రోజుల క్రితం జి20 సదస్సుకు ప్రత్యామ్నాయంగా సూర్జిత్ భవన్‌లో నిర్వహించిన పీపుల్స్ గ్రూప్ 'వియ్-20'ని అడ్డుకునేందుకు సూర్జిత్ భవన్ గేటుకు ఢిల్లీ పోలీసులు తాళాలు వేయడంపై పెద్ద యెత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి., మోడీ ప్రభుత్వ ప్రమేయం లేకుండా ఇది జరుగుతుందని అనుకోడానికి వీల్లేదు. ఢిల్లీ పోలీసుల తాజా చర్యను సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఏచూరి ఖండించారు. మోడీ హయాంలో సెమినార్లను కూడా స్వేచ్ఛగా జరుపుకోలేని స్థితి నెలకొందని అన్నారు. దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

బీమాలో సామాజిక అసమానతలు

(మొదటి పేజీ తరువాయి)

ఉంటోంది. భూరికార్డులు, సాంకేతిక కారణాల వలన చాలా మంది ఎస్‌సి, ఎస్‌టి, బిసి రైతులు బీమాకు దూరమవుతున్నారు. ఇ-క్రాప్‌లో వారి పేర్లు ఎక్కట్లేదు. కేంద్రంతో కలిపి అమలు చేస్తున్న బీమా పథకంలో ఇ-క్రాప్ డేటాను కాకుండా బ్యాంకుల్లో లోన్లు తీసుకున్న రైతుల డేటాను తీసుకుంటున్నారు. ఆ రీత్యా కౌలు రైతులు, బ్యాంక్ గుమ్మం తొక్కని కొత్త రైతులు బీమాకు దూరమవుతున్నారు.

జిల్లాలవారీ శాతం

జిల్లా	ఎస్‌సి	ఎస్‌టి	ఒబిసి	జనరల్
అల్లూరి	0.13	96.10	0.59	3.18
అనకాపల్లి	0.77	0.92	63.46	36.35
అనంతపురం	3.69	1.38	32.95	56.98
అన్నమయ్య	4.24	1.40	35.24	59.12
బాపట్ల	10.02	0.49	26.01	63.48
చిత్తూరు	7.87	0.50	37.41	54.22
కోనసీమ	9.89	0.13	27.78	62.20
తూర్పుగోదావరి	4.00	0.16	20.58	75.26
ఏలూరు	7.76	2.32	35.37	54.55
గుంటూరు	11.73	0.45	22.22	65.60
కాకినాడ	3.43	0.14	27.58	68.85
కృష్ణా	7.45	0.22	30.93	61.40
కర్నూలు	6.59	0.88	66.34	26.19
నంద్యాల	7.46	1.27	36.60	54.67
ఎన్‌టిఆర్	8.43	4.03	29.73	57.81
పల్నాడు	4.16	2.61	21.44	71.79
మన్యం	2.57	5.45	83.73	8.25
ప్రకాశం	4.57	0.41	21.03	73.99
నెల్లూరు	8.37	1.49	34.23	55.91
శ్రీసత్యసాయి	3.17	6.00	42.12	48.71
శ్రీకాకుళం	1.58	1.02	82.32	15.08
తిరుపతి	13.57	1.45	39.70	45.28
విజయనగరం	1.23	0.25	88.67	9.85
వైఎస్ఆర్	2.95	0.21	18.55	76.29

విశాఖ ఉక్కు ఇక రెండేళ్లే!

(మొదటి పేజీ తరువాయి)

సమావేశమయ్యారు. ప్లాంట్ ప్రయివేటీకరణ తగదని అన్నారు. జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ 2030 నాటికి 300 మిలియన్ టన్నులు కావాలని కేంద్రం తన డిపిఆర్‌లో రాసుకుందని, వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరిస్తే ఎక్కడ నుంచి స్టీల్ తెస్తుందని ప్రశ్నించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో ప్రస్తుతం 102 మిలియన్ టన్నులు ఉత్పత్తి అవుతోందని, ఇంకా దేశ అవసరాలకు మరిన్ని మిలియన్ టన్నులు అవసరమని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌లో మూడో ఫర్నేస్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపిస్తే ప్లాంట్ వేల కోట్ల రూపాయల లాభాల్లోకి తెస్తామని అన్నారు. రా మెటీరియల్ కోల్, ఐరన్ ఓర్ రైల్వే రేకులు కూడా ఉక్కు మంత్రిత్వ శాఖ పరిధిలో, కేంద్రం ఆధీనంలో ఉన్నాయని, వీటిని ఇస్తే రూ.36 వేల కోట్ల టర్నోవర్ సాధిస్తామని వివరించారు. ప్రభుత్వానికి రూ.వేల కోట్ల ఆదాయం సమకూరుతుందన్నారు. 16 వేల మంది కాంట్రాక్టు కార్మికులు వేతనాలు పెరగక అవస్థలు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

కేంద్రానికి వివరిస్తా : సిన్హా

కార్మిక సంఘాలతో చర్చలు అనంతరం నాగేంద్రనాథ్ సిన్హా మాట్లాడుతూ 'కేంద్ర ప్రభుత్వానికి ఇక్కడ బలాలు, బలహీనతలు తెలియజేస్తాను. పరిస్థితిని వివరించి రా మెటీరియల్ సాధనపై చర్చిస్తాను' అని బదులిచ్చారు.

మళ్లీ వరద భయం!

(మొదటి పేజీ తరువాయి)

చేరుకుంది. అక్కడ నుంచి దిగువకు 3.9 లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని అధికారులు తెలిపారు. ఏలూరు జిల్లాలోని ఎద్దువాగు, గుండేటి వాగులు పొంగిపొర్లుతున్నాయి. ఎద్దువాగు పొంగడంతో వేలేరుపాడు మండలంలోని బోళ్లపల్లి, చిగురుమామిడి మధ్య ఉన్న కాజ్‌వేపై వరద నీరు చేరింది. దీంతో, కొయిదా, కట్కూరు, కాకిసనూరు, బోళ్లపల్లి, టేకూరు తదితర 12 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కుక్కునూరు, దాచారం మధ్య గుండేటి వాగుపై ఉన్న కాజ్‌వే నీట మునగడంతో బెస్తగూడెం, సీతారామపురం, నెమలిపేట, గుణ్ణంబోరు తదితర గ్రామాలకు ఈ మార్గంలో రాకపోకలు స్తంభించాయి. ఈ గ్రామాలకు 15 కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. వరద నీరు చేరడంతో అల్లూరి సీతారామరాజు జిల్లా దేవిపట్నం మండలంలోని గండిపోశమ్మ ఆలయం మూడు రోజులుగా ముంపులోనే ఉంది. కాటన్ బ్యారేజీ వద్ద ఎనిమిది అడుగుల నీటిమట్టం నమోదైంది. బ్యారేజీ 175 గేట్లను పైకిలేపి 3.6 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు విస్తారంగా కురవడంతో రానున్న 24 గంటల్లో మరింత ప్రవాహం పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

అరసం అధ్యక్షునిగా పెనుగొండ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులుగా గుంటూరుకు చెందిన సీనియర్ న్యాయవాది పెనుగొండ లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా సుఖదేవ్‌సింగ్ శిర్సా మరోసారి ఎన్నికయ్యారు. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లోని సత్యగ్రహ కన్వెన్షన్ సెంటర్ (రాంగేయ రాఘవ స్మారక సభావేదిక)లో జరుగుతున్న అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం 18వ మహాసభలు మంగళవారం ముగిశాయి. నూతన కమిటీలో తెలుగు రాష్ట్రాల నుండి వెల్లురు నారాయణ, కార్యవర్గ సభ్యులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, వల్లూరి శివప్రసాదు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు. అనంతరం పలు పుస్తకాలను ఆవిష్కరించారు. జబల్‌పూర్‌లో నిర్మితమవుతున్న అణు కర్మాగారాన్ని తక్షణమే నిలిపేయాలని తీర్మానించారు. కారల్‌మార్క్స్, అంబేద్కర్ ఆలోచన విధానంతోనూ, సామాజిక సమస్యకు అద్దం పట్టే సాహిత్యం రావాలని, కొత్తతరం రచయితలను ప్రోత్సహించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు.

కలెక్టర్ ఆదేశాలతో.. తహశీల్దార్ నేతృత్వంలో..

పోలాక్షమ్మ ఆలయంలోకి దళితుల ప్రవేశం

- అఖిలపక్షం పోరాటం సక్సెస్

అఖిలపక్షం నేతలతో కలిసి పోలాక్షమ్మను దర్శించుకున్న దళితులు

ప్రజాశక్తి - తిరుచానూరు, పుత్తూరు టౌన్ (తిరుపతి జిల్లా)
అఖిలపక్షం పోరాటం ఫలించింది. కలెక్టర్ కె వెంకటరమణారెడ్డి పెత్తందారుల వికృత చేష్టలపై మండిపడుతూ దళితులతో ఆలయ ప్రవేశం చేయించాలని పుత్తూరు తహశీల్దార్‌ను ఆదేశించారు. దీంతో జోరువానలో తహశీల్దార్ పరమేశ్వరస్వామి నేతృత్వంలో అఖిలపక్ష నేతలతో కలిసి మంగళవారం సాయంత్రం పోలాక్షమ్మను దళితులు సందర్శించి 'వివక్షపై' విజయం సాధించారు. వివరాలిలా ఉన్నాయి.

కలెక్టర్‌కు అఖిలపక్షం వినతి

దళితులను ఆలయంలోకి ప్రవేశించనీకుండా వివక్ష పాటించిన ఆలయ చైర్మన్ శ్రీనివాసరెడ్డిని అరెస్టు చేయాలని, దళితులకు ఆలయ ప్రవేశం కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. మంగళవారం తిరుపతి కలెక్టరేట్‌లో అఖిలపక్ష నేతలు కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. దళితులకు ఆలయ ప్రవేశం కల్పించాలని, దళితుల గ్రామాల్లోకి పోలాక్షమ్మ విగ్రహాన్ని ప్రదర్శనగా తీసుకురావాలని కోరారు. స్పందించిన కలెక్టర్ పుత్తూరు తహశీల్దార్‌కు ఫోన్ చేశారు. తక్షణం దళితులతో ఆలయ ప్రవేశం చేయించాలని, వారి రాజ్యాంగబద్ధ హక్కును కాపాడాలని ఆదేశించారు. శాంతి కమిటీని ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకుంటామని అఖిలపక్ష నాయకులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వందవాసి నాగరాజు, పి మురళి మాట్లాడుతూ 77 ఏళ్ల స్వాతంత్ర్యం తరువాత కూడా దళితులను చిన్నచూపు చూడటం తగదన్నారు. గుడిలోకి ప్రవేశించడానికి ఇంత పోరాటం చేయాల్సి వచ్చిందంటే పెత్తందారుల పట్టు ఎంత ఎక్కువగా ఉందో, వాళ్ల దౌర్జన్యాలు ఎంత మితిమీరిపోతున్నాయో అర్థమవుతోందన్నారు. సామరస్యంగా సమస్యను పరిష్కరించకపోతే గతంలో పచ్చికాపల్లం మహాభారత ఉద్యమం జరిగిన విధంగా ఇక్కడా జరుగుతుందని హెచ్చరించారు. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన రెవెన్యూ, పోలీసు అధికారులు ప్రేక్షకపాత్ర వహించడం సరికాదన్నారు. పోలాక్షమ్మను సందర్శించుకున్నందుకు దళితులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్ వెంకటేష్, రాధాకృష్ణ, విశ్వనాథం, మహేష్, నందయ్య పాల్గొన్నారు.

ఇడికి సుప్రీం ముకుతాడు

- చట్టంగా మారొద్దని హెచ్చరిక
- చట్ట పరిధిలోనే పనిచేయాలని నిర్దేశం
- ఛత్తీస్‌గఢ్ మద్యం కుంభకోణం కేసులో అక్షింతలు

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం, బిజెపి అధినేతల కనుసన్నల్లో ఎంపిక చేసుకున్నవారిపైనే దాడులు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)పై సుప్రీంకోర్టు మంగళవారం నాడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇడి తనకు తాను చట్టంగా మారారాదని, చట్టం పరిధిలోనే పనిచేయాల్సివుంటుందని సర్వోన్నత న్యాయస్థానం హెచ్చరించింది. ఛత్తీస్‌గఢ్ మద్యం కుంభకోణం కేసు విచారణ సందర్భంగా అటు ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆధిత్యనాథ్ ప్రభుత్వానికి, ఇడికి సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఐఎఎస్ అధికారి అనిల్ తుతేజా, అతని కుమారుడు యాష్ తుతేజలపై ఇడి, ఉత్తరప్రదేశ్ పోలీసులు ఎలాంటి బలవంతపు చర్యలు కొనసాగకుండా ముందస్తు రక్షణ కొనసాగుతుందని సుప్రీంకోర్టు సోమవారం స్పష్టం చేసింది. వీరిద్దరికి జులై 18న ముందస్తు రక్షణ కల్పిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. అయినా ఇడి తన దర్యాప్తును కొనసాగించడంపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మద్యం కుంభకోణంలో ఉపయోగించిన నకిలీ హోలోగ్రామ్‌ల తయారీకి సంబంధించిన విషయంపై జులై 28న ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి ఇడి లేఖ రాసింది. దీంతో ఈ కేసులో యుపి పోలీసులు జులై 30 అనిల్ తుతేజాతో సహా ముగ్గురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. యుపి పోలీసులకు ఇడి లేఖ రాయడం సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంగించడమేనని నిందితులు ఇద్దరూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు ఆదేశాల తరువాత కూడా ఇడి దర్యాప్తు చేయడాన్ని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సుధాన్షు ధులియాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తప్పుపట్టింది. ఇడి తనకు తానుగా చట్టం కాకూడదని తెలిపింది. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ అధికారుల్ని, వారి కుటుంబ సభ్యులను అరెస్టు చేస్తామని ఇడి బెదిరిస్తుందని, ముఖ్యమంత్రి భూపేష్ భాఘల్‌ను ఇరికించడానికి ఇడి ప్రయత్నిస్తుందని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకుని వచ్చారు. దీంతో భయోత్పాద వాతావరణాన్ని సృష్టించవద్దని ఇడికి ధర్మాసనం తెలిపింది. తదుపరి విచారణను సెప్టెంబరు 26కి వాయిదా వేసింది.

చిరంజీవిని విమర్శించేంత సంస్కారహీనుడిని కాదు

- మాజీ మంత్రి కొడాలి నాని

ప్రజాశక్తి-గుడివాడ (కృష్ణా జిల్లా)
ప్రముఖ సినీనటుడు చిరంజీవిని తాను విమర్శించినట్లు నిరూపించాలని మాజీ మంత్రి కొడాలి నాని సవాల్ విసిరారు. తానేం మాట్లాడానో చిరంజీవి, ఆయన అభిమానులకు తెలుసని వ్యాఖ్యానించారు. కృష్ణాజిల్లా గుడివాడలో మంగళవారం జరిగిన చిరంజీవి పుట్టినరోజు వేడుకల్లో కొడాలి నాని పాల్గొన్నారు. కేక్ కట్ చేసి చిరు అభిమానులకు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరి జోలికీ వెళ్లని చిరంజీవిని విమర్శించేంత సంస్కారహీనుడిని కాదని, ఆయన అభిమానుల ముసుగులో టిడిపి, జనసేన శ్రేణులు గుడివాడ రోడ్లపై దొర్లారన్నారు. చిరంజీవికి, తమకు మధ్య అగాధం సష్టించాలని కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. డ్యాన్సులు, నటన చేతకాని వాళ్లకు చిరంజీవి సలహాలు ఇవ్వాలనే చెప్పానని స్పష్టం చేశారు. తన వెంట ఉన్న వారిలో 60 శాతం మంది చిరంజీవి అభిమానులేనని, అందుకు తాను గర్విస్తున్నానని కొడాలి నాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

హంద్రీనీవా నీటి కోసం పాదయాత్ర

- కాలువ పనులు పూర్తి చేసి సాగునీరివ్వాలి : సిపిఎం

రాగులపాడు పంప్‌హౌస్ వద్ద పాదయాత్రను ప్రారంభిస్తున్న రాంభూపాల్

ప్రజాశక్తి - ఉరవకొండ (అనంతపురం)
హంద్రీ నీవా కాలువ పనులను పూర్తి చేసి, సాగునీటిని అందించాలని కోరుతూ మంగళవారం సిపిఎం పాదయాత్ర చేపట్టింది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ పాదయాత్ర అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం రాగులపాడు పంప్‌హౌస్ వద్ద మంగళవారం ప్రారంభమైంది.

ఈ పాదయాత్రను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ ప్రారంభించారు. రాగులపాడు హంద్రీనీవా పంప్ హౌస్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర తట్రకల్లు, గంజికుంట, వజ్రకరూరు, కమలపాడు, కమలపాడు తండా మీదుగా మొదటి రోజు కొనసాగింది. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ.. హంద్రీనీవా కాలువ కింద వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. పాలకుల నిర్లక్ష్యంతో నీటి సరఫరాపై నీలినీడలు కమ్ముకున్నాయని చెప్పారు. ఉరవకొండ నియోజకవర్గంలో దాదాపు లక్ష ఎకరాలకు సాగునీరు ఇస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో అధికార పార్టీ నాయకులు విఫలమయ్యారని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులను వైసిపి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. హంద్రీనీవా పిల్ల కాలువలు పూర్తి కాకపోవడంతో కళ్లెదుటే నీరు పారుతున్నా అవి రైతుల పొలాలకు చేరని దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి డిస్ట్రిబ్యూటరీ పనులను తక్షణమే పూర్తి చేసి సాగునీటిని అందించాలని డిమాండ్ చేశారు. గుంతకల్లు, వజ్రకరూరు, ఉరవకొండ మండలాల్లోని చెరువులన్నింటినీ హంద్రీనీవా నీటితో నింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.శ్రీనివాసులు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాల రంగయ్య, రంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి, గుంతకల్ సిపిఎం నాయకులు దాసరి శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

నీటి వనరులతోనే అభివృద్ధి సాధ్యం

- గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలి : ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి-పర్చూరు (బాపట్ల జిల్లా)
నీటి వనరులతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ లక్ష్మణరావు అన్నారు. అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా పర్చూరులోని కొల్లా వారి కల్యాణ మండపంలో మంగళవారం రైతు సదస్సు జరిగింది. దీనికి ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు హాజరై మాట్లాడారు. గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలని డిమాండ్ చేశారు. ఈ ఛానల్ విస్తరణకు రాష్ట్రంలోని ప్రధాన పార్టీలన్నీ హామీ ఇచ్చినప్పటికీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. భూసేకరణ ప్రకటన జారీ చేసి రూ.113 కోట్లు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. కామ్రేడ్ కొల్లా వెంకయ్య లాంటి ఎందరో నాయకులు గుంటూరు ఛానల్ కార్యరూపం దాల్చాలనే ఉద్దేశంతో పోరాటం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సభకు ఎఎంసి మాజీ చైర్మన్ నరిశెట్టి ఆచార్యులు అధ్యక్షత వహించారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి తల్లపనేని రామారావు, ఉపాధ్యక్షులు బండి శంకరయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య పాల్గొన్నారు.

ఆక్రమణలు నిలువరిస్తాం : మంత్రి సత్యనారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
పట్టణాల్లో దేవాదాయశాఖ సత్రాలు, మఠాల ఆక్రమణలు జరగకుండా నిలువరిస్తామని దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. సచివాలయంలోని పబ్లిసిటీసెల్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆలయాల వారీ సమీప ప్రాంతాల్లో ఏడాది పొడవునా ధర్మప్రచార కార్యక్రమం నిర్వహిస్తామని, ఈ కార్యక్రమంతో స్థానిక కళాకారులకు చేయూత లభిస్తుందని అన్నారు. దేవాదాయ స్థలాలు, భూములు ఆక్రమణలకు గురికాకుండా ఉండేందుకు రికార్డుల ప్రకారం ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి 15 రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 4.60 లక్షల ఎకరాల భూమి, 1.65 లక్షల గజాల వాణిజ్య స్థలం ఆక్రమణలో ఉందని మంత్రి పేర్కొన్నారు. లోకేష్ చేస్తున్నది గందరగోళ యాత్ర అని ఎద్దేవా చేశారు. ప్రభుత్వమే ఓటర్ల జాబితాను తనిఖీ చేయిస్తోంద న్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఇమేజ్ తగ్గుతోందని, ఒంటరిగా పోటీ చేసే ధైర్యం లేక టిడిపితో జనసేన కలిసిపోటీ చేయబోతోందన్నారు. రూ.5 లక్షలలోపు ఆదాయం ఉన్న ఆలయాలు రాష్ట్ర వ్యాప్తంగా 23,600 ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆలయాల నిర్వహణ అప్పజెప్పేందుకు కేవలం 37 దరఖాస్తులు మాత్రమే వచ్చాయన్నారు.

ఎఐతో ఉద్యోగాలకు ముప్పు : ఐబిఎం సిఇఒ

న్యూఢిల్లీ : చాట్‌జిపిటి, గూడుల్ బార్డ్ తరహా కృత్రిమ మేధా టూల్స్‌తో ఉత్పాదకత పెరిగినప్పటికీ ఉద్యోగులకు ముప్పు ప్రమాదం పొంచి ఉందని ఐబిఎం ఛైర్మన్, సిఇఒ అరవింద్ కృష్ణ ఉన్నారు. ఎఐ టూల్స్ రాకతో ముందుగా బ్యాక్ ఆఫీస్, వైట్ కాలర్ ఉద్యోగాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని తాను విశ్వసిస్తున్నానన్నారు. కృత్రిమ మేధా నాణ్యమైన జీవితాన్ని అందించగలదన్నారు. నూతన టెక్నాలజీని యాక్సెస్ చేసుకునేందుకు సంస్థలకు సాయపడేలా ఐబిఎం ఇటీవల జనరేటివ్ ఎఐ ప్లాట్‌ఫాంలతో కూడిన వేదిక వాట్సన్‌ఎక్స్‌ను ప్రవేశపెట్టింది. ఎఐ ప్రభావం తమ కంపెనీ ఉద్యోగులపై కూడా ఉండనుందన్నారు. దీంతో ఐబిఎంలోనూ ఉద్యోగాలు ఊడొచ్చని స్పష్టమవుతోంది.

దొంగ ఓట్లకు సూత్రదారి చంద్రబాబే : మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ (పల్నాడు జిల్లా)
రాష్ట్రంలో దొంగ ఓట్లను ఎలా చేర్చాలో బాగా తెలిసిన వ్యక్తి చంద్రబాబు నాయుడేనని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు విమర్శించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. భారీగా దొంగ ఓట్లు నమోదు చేసి గతంలో చంద్రబాబు అధికారంలోకి వచ్చారని, ఓటుకు ఆధార్ అనుసంధానం చేయడంతో భారీగా దొంగ ఓట్లు వెలుగు చూస్తుండడంతో భరించలేకపోతున్నారని అన్నారు. బిసిల గురించి మాట్లాడే అర్హత చంద్రబాబుకు, ఆయన కుమారుడు లోకేష్‌కు లేదని విమర్శించారు. చంద్రబాబు ఒక్క బిసినైనా రాజ్యసభకు పంపించారా? అని ప్రశ్నించారు. బిసిలను ఓట్లేసే యంత్రంలా వాడుకున్నారని విమర్శించారు. చంద్రబాబు పేదలకు సెంటు భూమి కూడా ఇవ్వలేదని, జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక 33 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారని తెలిపారు. బిసిలకు 56 కార్పొరేషన్లు కేటాయించి వారి అభ్యున్నతికి కృషి చేశారన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
వ్యవసాయ మార్కెటింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్మెంట్ టెండరు నోటీసు
నెం.06/2023-24, తేది : 19.08.2023
కృష్ణా జిల్లాలోని పామర్రు మండలంలోని కనుమూరు పిఎసిఎస్ లో కనుమూరు గ్రామంలోని ఎమ్‌పిఎఫ్‌సి గోడౌన్ స్థలం లెవెలింగ్ పని (1 పని-రూ.5.21 లక్షల) కొరకు ఆన్‌లైన్ టెండర్లు కోరడమైనది. పూర్తి వివరములకు www.apeprocurement.gov.in లోని ఇ-మార్కెట్‌లో తేది : 21.08.2023, మ.1.00 గం. నుండి చూడవచ్చును. ఫోన్ : 0866-2974950, 9182361369.
సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, వ్యవసాయ మార్కెటింగ్, విజయవాడ.
DIPRNo.10653/CL/ADVT/1/1/2021-22

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
కమీషనర్ ప్రింటింగ్, స్టేషనరీ & స్టోర్స్ శాఖ
ఓపెన్ టెండరు ప్రకటన
నెం.2287/అడ్మినిస్ట్రేషన్/ఎ3/2023-24, తేది : 21.08.2023
డిజిపి మరియు కమీషనర్ ఆఫ్ ప్రింటింగ్, విజయవాడ వారికి రూ.15 లక్షలు ఆ పైన విలువ గల అద్దె వెహికల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో రిజిస్ట్రేషన్ కలిగి ఉండిన అద్దెకు ఇచ్చు వాహనందారుల నుండి 2023-24 ఆర్థిక సం॥నకు ఓపెన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండర్ల లభ్యత కమీషనర్ ఆఫ్ ప్రింటింగ్, ముత్యాలంపాడు, విజయవాడ కార్యాలయము నందు ది.23.08.2023 నుండి 28.08.2023 వరకు లభించును.
DIPRNo.10652/CL/ADVT/1/1/2021-22 సం/- డిజిపి మరియు కమీషనర్

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda
బ్యాంక్ ఆఫ్ బరోడా
గణపవరం బ్రాంచ్, పల్నాడు జిల్లా
స్వాధీనతా ప్రకటన
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(1) ప్రకారం)
ఇందుమూలముగా, **బ్యాంక్ ఆఫ్ బరోడా, గణపవరం బ్రాంచ్** అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002లోని రూల్ 3తో చదివే సదరు సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ నోటీసులో పేర్కొన్న బకాయి **తేది.28.03.2022 నాటికి రూ.7,03,347.25 (అక్షరాల ఏడు లక్షల మూడు వేల మూడు వందల నలభై ఏడు రూపాయల ఇరవై ఐదు పైసలు మాత్రమే)** + వర్తించని వడ్డీ +ఇతర ఖర్చులతో నోటీసు తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా **ఋణగ్రహీత : శ్రీ ఆలా నాగరాజు, తండ్రి : శ్రీ ఆలా శ్రీను,** నెం.3-83, తిమ్మాపురం గ్రామం, యడ్లపాడు మండలం, పల్నాడు జిల్లా-522233 మరియు అగతావరప్పాడు, ఇన్నర్ రింగ్ రోడ్, గుంటూరు, గుంటూరు జిల్లా-522509 వారిని కోరుతూ **తేది.15.06.2022** న డిమాండ్ నోటీసు ను జారీచేసినారు.
ఋణగ్రహీత, హామీదారు, తనఖాదారు సదరు ఋణాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఋణగ్రహీత, హామీదారు, తనఖాదారు మరియు సాదారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా సదరు చట్టము నందలి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002, రూల్ 8తో చదివే సదరు సెక్షన్ 13(4) యొక్క చట్టం 13 క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ ఈ దిగువ సంతకందారు బ్యాంకునకు తనఖా ఉంచిన దిగువ వివరించిన ఆస్తిని **తేది.18.08.2023 న స్వాధీనం** చేసుకున్నారు.
ఋణగ్రహీత, హామీదారు, తనఖాదారు మరియు సాదారణ ప్రజానీకానికి ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎవ్వరూ ఎట్టి లావాదేవీలు జరుపరాదు. సదరు ఆస్తికి సంబంధించిన ఎట్టి లావాదేవీలైననూ **తేది.28.03.2022 నాటికి రూ.7,03,347.25 (అక్షరాల ఏడు లక్షల మూడు వేల మూడు వందల నలభై ఏడు రూపాయల ఇరవై ఐదు పైసలు మాత్రమే)** + వర్తించని వడ్డీ + ఇతర చార్జీలు మొ॥నవి **బ్యాంక్ ఆఫ్ బరోడా, గణపవరం బ్రాంచ్** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.
ఋణగ్రహీత, హామీదారు, తనఖాదారులకు సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలు గమనించవలెను.
స్థిరాస్తి వివరములు
నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, చిలకలూరిపేట సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా, యడ్లపాడు మండలం, తిమ్మాపురం గ్రామం, సర్వే నెం.322, డి.నెం.3-83 వద్ద ఉన్న 72.6 చ॥గ॥ల భూమి మరియు భవనము యావత్తు ఆస్తినకు **హద్దులు : తూర్పు** : షేక్ ఖాసీం వలి గారి ఇల్లు, **దక్షిణం** : సర్కార్ బజార్, **పడమర** : కొక్కెర లక్ష్మయ్య గారి స్థలం, **ఉత్తరం** : కర్లపూడి సాంబశివ రావు గారు విడిచిపెట్టిన బజార్.
తేది : 18.08.2023
ప్రదేశం : గణపవరం
సం/- అధీకృత అధికారి
బ్యాంక్ ఆఫ్ బరోడా

23 ఏళ్లుగా నిరీక్షణ



CHIEF MINISTER'S OFFICE
Date:12/04/2007
04052 No:3870/CMP/2007
Please find enclosed a representation of Sri K. Narasimha Reddy, President, Gurukula Vidhyalayala Telangana Udyogula Sangam, Hyderabad requesting to settle their various problems of staff working in A.P. Residential Educational Institutions Society at the earliest.
Hon'ble Chief Minister has endorsed as "PLEASE PUT UP". It is requested to examine the issues and CIRCULATE the file, for the orders of the Hon'ble Chief Minister.
(K. PRABHAKAR REDDY)
Spl. Secretary to C.M.,
Secretary (Secondary & School), School Education

క్రమబద్ధీకరణను ప్రారంభించాలని అప్పటి సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన ఉత్తర్వులు



DEPARTMENTS: EDUCATION

	File/CMF No.	Subject in brief	ENDORSEMENT
1	19187/SE.Genl.II/A1/09 1504/14 (Edn)	Permitting the regularisation of the services of (454) CRTs, working in APREIS & MJPAPBCWRS, in the cadre of TGT/PET, with prospective effect, etc. subject to certain conditions, as recommended by the Group of Ministers(GoM)	Discussed with Minister (SE). In view of the factual position, stated at Paras 377 to 380, on pages 129 & 130 nf, the proposal at Para 381, on page 130 nf, is approved.
2	3244/VC.II/10 1280/14 (Edn.)	Recommendations of the V&E Department, on the allegations, against the Secretary & Correspondent of VR College, Nellore & others in the appointment of the posts of Lecturers.	Para 50 on page 13 nf is approved.
3	20562/SE:Vigl(1) (Edn.) 1505/14 (Edu)	Sanction of prosecution against Joginipally Ravinder Rao, School Assistant, ZPHS, Velgonda(V), Dharmaram (M), Karimnagar district, etc for involvement in a DA case.	The orders already passed, at 132, on page 27 nf, is reiterated. The School Education, Dept. shall implement the orders immediately.

CHIEF MINISTER
Kindly see the orders of the Hon'ble CM. at Sl.No.__ of the above statement.
(SHAMSHER SINGH RAWAT)
Spl. Secretary to CM.

రెగ్యులరైజేషన్‌కు అంగీకరిస్తూ అప్పటి సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డి సంతకం చేసిన ఫైల్

- ముఖ్యమంత్రులు మారుతున్నా రెగ్యులర్ కావట్లేదు
- గురుకుల పాఠశాలల కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల వ్యథ

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి
ముఖ్యమంత్రులు మారు తున్నా, దశాబ్దాలు గడుస్తున్నా గురుకుల పాఠశాలల్లోని కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల రెగ్యులరైజేషన్ కల మాత్రం నెరవేరడం లేదు. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా కాంట్రాక్ట్ ఉపాధ్యాయులుగానే కొనసాగాల్సి వస్తోంది. అధికారులకు, కేబినెట్ సబ్ కమిటీ సభ్యులకు, మంత్రులకు, ముఖ్యమంత్రికి విన్నవించినా వారిని రెగ్యులరైజ్ చేసేందుకు చర్యలు తీసుకోవడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా 50 ఎపి రెసిడెన్షియల్ పాఠశాలలు (ఎపిఆర్ఎస్), 32 మహాత్మా జ్యోతీబా పూలే బిసి రెసిడెన్షియల్ పాఠశాలలు (ఎంజెపిబిసిఆర్ఎస్) ఉన్నాయి. ఎపిఆర్ఎస్ పాఠశాలల్లో 143 మంది, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో 21 మంది, ఎంజెపిబిసిఆర్ఎస్‌లలో 63 మంది మొత్తం 227 మంది కాంట్రాక్టు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వారంతా 2,000, 2,001, 2,003, 2,005, 2,007ల్లో పేపర్ నోటిఫికేషన్, రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ పాయింట్, మెరిట్ ద్వారా నియమితులైన వారే. తమను రెగ్యులరైజ్ చేయాలని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డికి వారు విన్నవించడంతో గురుకుల ఉపాధ్యాయుల క్రమబద్ధీకరణ ప్రారంభించారు. సాంఘిక సంక్షేమ పాఠశాలల ఉపాధ్యాయులను క్రమబద్ధీకరిస్తూ జిఒ 59ని జారీ చేశారు. ఆయన మరణంతో తరువాత సిఎం అయిన రోశయ్య ఎమ్మెల్సీ కమిటీని నియమించారు. ఆ కమిటీ నివేదికకు కేబినెట్ ఆమోదం లభించిన కొద్ది రోజులకే తెలంగాణ ఉద్యమం ప్రారంభమైంది. తరువాత కిరణ్‌కుమార్‌రెడ్డి సిఎం అయ్యాకా గురుకుల కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల క్రమబద్ధీకరణకు అంగీకరిస్తూ సంతకం చేశారు. రాష్ట్ర విభజనతో అది కూడా మరుగున పడిపోయింది. విభజన అనంతరం చంద్రబాబు సిఎం అయ్యాకా క్రమబద్ధీకరణ చేస్తామని హామీ ఇచ్చారు. అప్పుడు పాదయాత్ర చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఆదే హామీ ఇచ్చారు. జగన్ సిఎం అయ్యాకా స్పందనల్లో, సబ్ కమిటీ సభ్యులకు గురుకుల పాఠశాలల కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు విన్నవించారు. కర్నూలు పర్యటనకు వచ్చినప్పుడు స్వయంగా ఆయన దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. అప్పుడు కూడా న్యాయం చేస్తానని జగన్ హామీ ఇచ్చారు. ఆ హామీలన్నీ నీటి మూటలు గానే మిగిలిపోయాయి. ప్రభుత్వం తాజాగా పది వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని చెబుతున్నా, ఆ జాబితాలో వారికి స్థానం దక్కలేదు. 12 నెలల వేతనం కూడా అమలు కాలేదు. దీనికి సంబంధించిన ఫైల్ అన్ని శాఖల ఆమోదం పొందినా ప్రభుత్వం అడుగు ముందుకేయడం లేదు. రెగ్యులరైజ్ కాకపోవడంతో ఈ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డు కూడా వర్తించడం లేదు. ముఖ్యమంత్రులు మారుతున్నా తమను పట్టించుకోకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెగ్యులరైజ్ చేయాలి



దాదాపు 15 నుంచి 18 ఏళ్లుగా పనిచేస్తున్న మాకు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రెగ్యులరైజ్ చేసి న్యాయం చేయాలి. పది రోజుల విరామంతో 12 నెలల వేతనాన్ని అందించాలి.
- డి హమీద్, కాంట్రాక్ట్ గురుకుల ఉపాధ్యాయుల కన్వీనర్

పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌లు పొందినవారికి ధ్రువపత్రాలు అందజేస్తున్న సిఎం పినరయి విజయన్

పరిశోధన రంగానికి కేరళ పెద్ద పీట

తిరువనంతపురం : నవ కేరళ శాస్త్ర, పరిశోధన, విజ్ఞాన రంగాల్లో ప్రగతిపథంలో పయనిస్తోంది. ఈ దిశగా రాష్ట్రంలోని ఎల్‌డిఎఫ్ కూటమి ప్రభుత్వం ప్రకటించిన పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ విజేతలకు ముఖ్యమంత్రి పినరయి విజయన్ మంగళవారం నాడు ధ్రువపత్రాలు అందజేశారు. విజ్ఞానరంగ అభివృద్ధికి, పరిశోధన రంగంలో ప్రగతికి ఈ ఫెలోషిప్‌లు ఎంతగానో దోహందం చేస్తాయని ఈ సందర్భంగా విజయన్ అన్నారు. పరిశోధన రంగంలో అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు కానీ తమ జోక్యాన్ని తగ్గించుకుంటున్న నేపథ్యంలో కేరళ పెద్ద పీట వేసి ప్రోత్సహిస్తుండటం విశేషం. గత రాష్ట్ర బడ్జెట్‌లో పరిశోధన రంగానికి కేరళ ప్రభుత్వం ఏకంగా రూ.3500 కోట్లు కేటాయించింది. జాతీయ స్థాయి ప్రామాణికాలను పాటించి రాష్ట్రంలో 'న్యూ కేరళ డాక్టోరల్ ఫెలోషిప్' ఎంపిక ప్రక్రియను నిర్వహించారు. ఈ ఎంపికలో విజేతలుగా నిలిచిన పరిశోధన రంగ అభ్యర్థులందరినీ ముఖ్యమంత్రి విజయన్ అభినందించారు. ఫెలోషిప్‌కు అర్హులైన వారందరూ తమ బాధ్యతను చక్కగా నిర్వర్తించాలని సిఎం ఆకాంక్షించారు.

మరిన్ని నెలలు ధరల కుంపటే..

- ద్రవ్యోల్బణం పెరగొచ్చు..
- ఆర్థిక మంత్రిత్వ శాఖ హెచ్చరిక

హైదరాబాద్ : ఇప్పటికే నింగినంటిన ధరలతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతుంటే.. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ మరో బాంబు పేల్చింది. కూరగాయలు, పప్పులు, నూనెలు, ఉల్లి, టమాట ధరలు ఎగిసపడగా.. వచ్చే నెలల్లో మరింత పెరగొచ్చని హెచ్చరించింది. రాబోయే కొన్ని నెలల్లో ద్రవ్యోల్బణం సూచీ మరింత పైకి ఎగబాకుతుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ మంగళవారం తన నెలవారి రిపోర్ట్‌లో విశ్లేషించింది. దేశీయంగా నెలకొన్న అనిశ్చితుల కారణంగా రానున్న కొన్ని నెలల పాటు ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు కొనసాగే అవకాశం ఉందని పేర్కొంది. కాగా.. అది తాత్కాలికమేనని ఆర్థిక శాఖ పేర్కొంది. ప్రభుత్వ ముందస్తు చర్యలు, తాజా పంటల రాక కారణంగా ధరలు క్రమంగా తగ్గే అవకాశం ఉందని పేర్కొంది. ఆహార ద్రవ్యోల్బణం తాత్కాలికంగానే ఉండొచ్చని అంచనా వేసింది.ప్రాంతీయ అనిశ్చితులు , ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను పెంచుతాయని నివేదిక పేర్కొంది. మరోవైపు ఆగస్ట్‌లో ఇప్పటి వరకూ లోటు వర్షపాతం నమోదవడంతో కొత్త నిల్వలు వచ్చే వరకూ ఆహార ద్రవ్యోల్బణం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేసింది.

మూతపడుతున్న చారిత్రక ఇండియా క్లబ్

లండన్ : లండన్ నడిబొడ్డున గల చారిత్రక ఇండియా క్లబ్ మూతపడుతోంది. క్లబ్ వ్యవస్థాపకుల్లో ఒకరైన కృష్ణ మీనన్‌తో సహా జాతీయవాదులకు కేంద్రంగా వున్న, భారత స్వాతంత్ర్య ఉద్యమం తొలినాళ్ళ మూలాలు కలిగిన ఈ క్లబ్‌ను వచ్చే నెల్లో మూసివేయనున్నారు. ఈ క్లబ్‌ను మరింత ఆధునాతనమైన హోటల్‌గా మార్చడానికి ఆ స్థల యజమానులు నిర్ణయించారు. క్లబ్ మూసివేతకు నోటీసులిచ్చారు. దీనికి వ్యతిరేకంగా క్లబ్ ప్రొప్రయిటర్లు యాద్గార్ మార్కర్, ఆయన కుమార్తె ఫిరోజాలు 'సేవ్ ఇండియా క్లబ్' పేరుతో సుదీర్ఘంగా పోరాటం సాగించారు. కానీ ఆ పోరాటంలో వారు ఓడిపోయారు. మూసివేతను ప్రకటించారు. సెప్టెంబరు 17 చివరగా ప్రజలకు అందుబాటులో వుండే రోజని వారు తెలిపారు. 70 ఏళ్ళ క్రితం ప్రారంభించిన ఈ ఇండియా క్లబ్ భారత ఉపఖండానికి చెందిన మొదటి తరం ఇమ్మిగ్రెంట్లకు ఒక ఇల్లు వంటిదని ఫిరోజా వ్యాఖ్యానించారు. యువకులైన భారతీయులు ఇక్కడ కూర్చుని, తింటూ, రాజకీయాలు చర్చించుకుంటూ, భవితవ్యాల గురించి ప్రణాళికలు వేసుకుంటారనే ఉద్దేశ్యంతోనే మీనన్ ఈ క్లబ్‌ను నెలకొల్పారని ఎస్‌ఓఎఎస్ (స్కూల్ ఆఫ్ ఓరియంటల్ ఆఫ్రికన్ స్టడీస్)కి చెందిన పార్వతి రామన్ వ్యాఖ్యానించారు.

కోర్టు ఆదేశాల ఉల్లంఘన

- మార్గదర్శిలో సిఐడి సోదాలపై అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
మార్గదర్శి సంస్థపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని, కోర్టు ఆదేశాలను సైతం ఉల్లంఘించి మార్గదర్శిలో సిఐడి అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిఐడి అధికారులు జగన్‌కు ప్రైవేటు సైన్యంలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కర్ణాటకలో 109వ బ్రాంచ్‌ను మార్గదర్శి ప్రారంభించిందంటే ఆ సంస్థ నిజాయతీకి ఇదే నిదర్శనమని అన్నారు. మార్గదర్శి చిట్ ఫండ్ బ్రాంచుల్లో సోదాలు చేయొద్దని హైకోర్టు స్పష్టంగా చెప్పిందని, కోర్టు ఆదేశాలను సైతం ఉల్లంఘించి రాత్రి వేళల్లో సోదాలు నిర్వహిస్తుండటం జగన్ విధ్వంస విధానాలకు నిదర్శమని విమర్శించారు. ఇప్పటికైనా మార్గదర్శిపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని హితవు పలికారు.

దోపిడీపై పాలకులను నిలదీయాలి : అయ్యన్న పాత్రుడు

రాష్ట్ర ప్రభుత్వ దోపిడీని ప్రజలందరూ ప్రశ్నిస్తూ.. పాలకులను నిలదీయాల్సిన సమయం ఆసన్నమైందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్న పాత్రుడు అన్నారు. మంగళగిరి టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖపట్నంలో వైసిపి ఎంపి విజయసాయిరెడ్డికి, భీమునిపట్నం ప్రాంతంలో రూ.300 కోట్లు విలువైన తుర్లవాడ కొండ భూమిని కేవలం రూ.20 కోట్లకు కట్టబెట్టేందుకు జగన్ ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందన్నారు.

రెండు రోజుల క్రితం విజయసాయిరెడ్డి గ్యాంగ్ కొండను పరిశీలించడానికి వెళ్లడంతో అక్కడ ప్రజలకు అనుమానం వచ్చిందన్నారు. విజయసాయిరెడ్డి కూతరు ప్రైవేటు యూనివర్సిటీ కడుతున్నారని, అందుకోసం 120 ఎకరాలు కేటాయించాలని ప్రభుత్వానికి దరఖాస్తు చేశారని, ఆ దరఖాస్తుపై అధికార యంత్రాంగం ఆగమేఘాలపై ఫైల్‌ను సిద్ధం చేసి సిఎం కార్యాలయానికి పంపిందని అయ్యన్న పాత్రుడు పేర్కొన్నారు.

పరిమితి దాటేశారు

- జిఎస్‌డిపిలో రుణం 41.75%
- వాస్తవ పరిమితి 35.6 శాతమే
- స్పష్టం చేసిన ఎజి కార్యాలయం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి
ముగిసిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిఎస్‌డిపిలో రుణ పరిమితిని రాష్ట్ర ప్రభుత్వం దాటేసింది. వాస్తవంగా చేసిన రుణాలు జిఎస్‌డిపి పరిధిలోనే ఉన్నప్పటికీ, ఆఫ్ బడ్జెట్ అనుమతుల ద్వారా చేసిన రుణాలు కూడా కలిపితే పరిమితి దాటేసినట్టేనని ప్రధాన అక్కౌంటెంట్ జనరల్ కార్యాలయం స్పష్టం చేసింది. ఇదే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రికార్డుల్లో రుణం 4,23,943 కోట్లుగా గుర్తించారు. ఇది వాస్తవ జిఎస్‌డిపి అయిన 13,17,728 కోట్ల రూపాయల్లో 32.17 శాతంగా ఉంది. ఎఫ్ఆర్‌బిఎమ్ (ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్) చట్టం మేర మొత్తం జిఎస్‌డిపిలో 35.60 శాతం వరకు రుణాలు తీసుకోవచ్చు. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వం పరిమితికి లోబడే రుణాలు చేసినట్లు స్పష్టమవుతోందని పిఎజి పేర్కొంది. అయితే పలు సంస్థలకు ఇచ్చిన ఆఫ్ బడ్జెట్ రుణాలను కలిపితే జిఎస్‌డిపిలో రుణ శాతం ఏకంగా 41.75 శాతానికి పెరిగిపోయినట్టయిందని అక్కౌంటెంట్ జనరల్ కార్యాలయం వ్యాఖ్యానించింది. ఆఫ్ బడ్జెట్ రుణాలు 1,26,286 కోట్ల రూపాయలకు చేరుకున్నాయని, ఇది జిఎస్‌డిపిలో 9.58 శాతంగా ఉన్నాయని పిఎజి వ్యాఖ్యానించింది. అందుకే మొత్తం శాతం 41.75 శాతానికి చేరిపోయిందని తెలిపింది. దీంతో జిఎస్‌డిపిలో పరిమితి దాటిపోయినట్టయిందని పిఎజి పేర్కొంది.పిఎజి రాసిన లేఖ ఆర్థిక శాఖ లో చర్చనీయాంశంగా మారింది.

సంపాదకీయం

పెన్షన్ ఉద్యోగి హక్కు

అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామన్న హామీని గాలికొదిలేసిన ముఖ్యమంత్రి జిపిఎస్ కోసం ఆర్డినెన్స్ తీసుకొస్తామంటూ తాజాగా ప్రకటించారు. సిపిఎస్ మాదిరిగానే జిపిఎస్ కూడా ఉద్యోగి కంట్రిబ్యూషన్ చెల్లించాల్సిందే కనక ఇది 'కొత్త సీసాలో పాత సారా' మాత్రమే! జిపిఎస్ ప్రకారం చివరి బేసిక్ పేలో 33 శాతం గ్యారంటీడ్ పెన్షన్‌గా చెల్లిస్తామని ప్రభుత్వం చెబుతోంది. దీనికి ప్రభుత్వోద్యోగి తన జీతంలో 10 శాతం కంట్రిబ్యూషన్ చెల్లించాల్సి ఉంటుంది. ఉద్యోగి 14 శాతం చొప్పున గాని చెల్లిస్తే 40 శాతం పెన్షన్ గ్యారెంటీగా ఇస్తామని చెబుతున్నారు. ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌లో ఎటువంటి కంట్రిబ్యూషన్ చెల్లించకుండానే చివరి వేతనంలో 50 శాతం వరకూ పెన్షన్ లభిస్తుంది. ఒపిఎస్‌లో రిటైర్ అయినా, మరణించినా మొత్తం గ్రాట్యూటీ చెల్లిస్తే, జిపిఎస్‌లో 37 శాతం వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేసి, మిగిలిన 63 శాతం యాన్యుటీలు కొనుగోలు చేస్తారు. ఒపిఎస్‌లో కమ్యుటేషన్, ఫ్యామిలీ పెన్షన్, హెల్త్‌కార్డులు వస్తే, జిపిఎస్‌లో యాన్యుటీల ఎంపికను బట్టే ఫ్యామిలీ పెన్షన్ వస్తుంది.

నయా ఉదారవాద విధానాల అమలు పర్యవసానంగా ఉద్యోగుల పెన్షన్ హక్కు వారు తమ కష్టార్జితం నుంచి కొనుక్కునే సరుకుగా దిగజారిపోయింది. ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగులు ఈ విధానాలపై పెద్దఎత్తున పోరాడుతున్నారు. మనదేశంలో 1956లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ స్కీమ్‌ను మొదట ప్రవేశపెట్టారు. ఉద్యోగులు తమ జీవితాల్లోని అతి ముఖ్యమైన కాలం ప్రభుత్వ సేవలకు అంకితం చేసినందుకు ఉద్యోగ విరమణ అనంతరం వారి జీవితాలు సవ్యంగా సాగిపోయేలా చూడటం తమ బాధ్యత అని అప్పటి ప్రభుత్వం అంగీకరించింది. ఆ తరువాత రాష్ట్రాలూ అదేబాటలో నడిచాయి. 1991 తర్వాత వచ్చిన నయా ఉదారవాద విధానాలను అమలు చేసిన కాంగ్రెస్ పాలనలో అందుకు ప్రాతిపదిక ఏర్పడగా, వాజ్‌పాయ్ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం 2003లో సిపిఎస్‌ను తీసుకొచ్చింది. ఆ తరువాత వచ్చిన మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం దానిని కొనసాగించింది. మన రాష్ట్రంలో 2004లో అప్పటి సిఎం వైఎస్ రాజశేఖరరెడ్డి అమలులోకి తీసుకొచ్చారు. ఈ విధానాలపై నాటి నుంచి ఉద్యోగులు పోరాడుతూనే ఉన్నారు. పలు రాష్ట్ర ప్రభుత్వాలు సిపిఎస్‌ను రద్దు చేసి, ఒపిఎస్ తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించాయి. రాజస్తాన్, చత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్ర ప్రభుత్వాలు సిపిఎస్ కింద కేంద్ర పిఎఫ్ఆర్‌డిఎకు చెల్లించిన మొత్తాన్ని తిరిగివ్వాలని కోరాయి. పంజాబ్ ప్రభుత్వం సిపిఎస్ స్థానే పాత పెన్షన్ స్కీమ్ వర్తింపజేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. కేరళ, తమిళనాడు, కర్ణాటకసహా పలు రాష్ట్రాలు పాత పెన్షన్ వర్తింపు కోసం ప్రయత్నాలు చేస్తున్నాయి.

రాష్ట్రప్రభుత్వాలు పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించేందుకు కేంద్రం ససేమిరా అంటోంది. పిఎఫ్ఆర్‌డిఎ చట్టం ప్రకారం, పిఎఫ్ఆర్‌డిఎ నిబంధనలు 2015 ప్రకారం గాని ఒకసారి కేంద్రం వద్ద జమచేసిన పెన్షన్ నిధులను వెనక్కి ఇచ్చే అవకాశం ఏదీ లేదని పార్లమెంట్ సాక్షిగా గత ఏడాది కేంద్రం ప్రకటించింది. 2003లో సిపిఎస్‌ను తీసుకొచ్చింది, ఒకసారి ఆ స్కీమ్‌లో తలదూర్చాక మళ్లీ వెనక్కిపోలేని విధంగా నిబంధనలు 2015లో జారీ చేసింది కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాలే. లక్షల కోట్ల ధనాన్ని స్టాక్ మార్కెట్‌లో జూదానికి వాడుకునేందుకు, బడా కార్పొరేట్లకు ఉద్యోగుల కష్టార్జితాన్ని సర్కారు దోచిపెడుతోంది. పెన్షన్ యజమాని ఇష్టాన్ని బట్టి ఇచ్చేది కాదని, దయాదాక్షిణ్యాలను బట్టి చేసే దానం కాదని, అది ఒక సామాజిక సంక్షేమ చర్య అని, వృద్ధాప్యంలో వారిని పట్టించుకోకుండా వదిలేయబోమన్న హామీ మేరకే ఆ ఉద్యోగులు ఆ విధంగా సేవలందించారని సుప్రీంకోర్టు 1982లో తీర్పునిచ్చింది. కేంద్రం విధానాలపై పలు రాష్ట్ర ప్రభుత్వాలు పోరాడుతుండగా, పూర్తి లొంగుబాటును ప్రదర్శిస్తూ, తూచా తప్పక అమలు చేస్తోన్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ దిగజారింది. 'సిపిఎస్' రద్దు చేసి, ఒపిఎస్‌ను తీసుకొస్తామన్న హామీని అమలు చేయాల్సిన జగన్ సర్కారు అందుకు భిన్నంగా 'జిపిఎస్'ను ముందుకుతేవడం సమంజసం కాదు. ఇప్పటికైనా వైసిపి ప్రభుత్వం 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలి. అలా చేయని పక్షంలో ఉద్యోగ, ఉపాధ్యాయ లోకం తమ హక్కుల సాధనకు, ప్రయోజనాల పరిరక్షణకు ఉద్యమించడం తప్ప వేరే మార్గం లేదు.

మంచి మాట

మతతత్వాన్ని మట్టుపెట్టే పని ముస్లింలు, సిక్కులు, హిందువులు, క్రైస్తవులు తదితరులందరిదీ. భారతీయులందరిదీ. దీనికోసం వారంతా మతతత్వ దృక్పథాన్ని అధిగమించి, నిజమైన జాతీయవాద మనస్తత్వాన్ని అలవరచుకోవాలి.

- సుభాష్ చంద్రబోస్

ఎవరి మెప్పు కోసం విజన్ 2047?

విశ్లేషణ

అగస్టు 15వ తేదీన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశాఖపట్నంలో విజన్ 2047 ప్రకటించారు. ఇందులో సాధించాల్సిన లక్ష్యాలు, అందుకు అనుసరించాల్సిన మార్గాల గురించి వివరించారు. స్వామి కార్యంలో స్వకార్యం లాగా తాను గతంలో రూపొందించుకున్న విజన్ 2020, సన్‌రైజ్ విజన్స్ గురించి చెప్పుకున్నారు. ప్రణాళికలు రూపొందించుకోవడం, వాటిని చేరుకోడానికి దారులు నిర్ణయించుకోవడం వ్యక్తిగతమైతే చర్చించాల్సిన అవసరం లేదు. కాని అది ఒక దేశ భవిష్యత్ కోసమని చెప్పిన తర్వాత వాటిపై చర్చ జరుగుతుంది. ఈ విజన్‌ను చంద్రబాబు నాయుడు తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు హోదా లోనో, మాజీ ముఖ్యమంత్రి హోదా లోనో ప్రకటించలేదు. 'గ్లోబల్ ఫోరమ్ ఫర్ సస్టెయినబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్' ఛైర్మెన్ హోదాలో ప్రకటించడం మరో విశేషం. ఆయన అనేకమంది మేధావులతో, నిపుణులతో 'వందల గంటల పాటు కసరత్తు' చేసి రూపొందించినట్లు చెప్పుకున్నారు. సలహాలు, సూచనలు కావాలని ప్రజలను కోరుతూ బహిరంగ చర్చకు పెట్టారు. కావున ఈ విజన్ 2047 ఏమిటి? ఏం సాధించాలనుకుంటున్నారు? ఎలా సాధించాలనుకుంటున్నారు? అనే విషయాలు చర్చనీయాంశంగా మారతాయి. అయితే దేశానికి సంబంధించిన ఈ విజన్ 2047 సాధించడంలో తెలుగుదేశం పార్టీ, అందులో చంద్రబాబు నాయుడు పాత్ర ఎంత, ఎలా వుంటుంది అనేది వేరే విషయం. ఈ విజన్‌లో ప్రజల స్థానం ఏమిటనేది ముఖ్యమైన అంశం. దేశమంటే సంపద, సంపద అంటే పెట్టుబడిదారులు అనే నరేంద్ర మోడీ విధానమా? దేశమంటే మనుషులోయ్ అన్న విధానామా? అనేది ప్రశ్న.



వి. రాంభూపాల్

వందేళ్ళ స్వాతంత్ర్యం నాటికి...

2047 నాటికి మన స్వాతంత్ర్యానికి వందేళ్ళు పూర్తవుతాయి. క్రీ.పూ 500 నాటి నుండి క్రీ.శ 1758 వరకు భారతదేశం ఒక విస్తృతమైన, బలీయమైన ఆర్థిక వ్యవస్థగా వెలుగొందిందని, 2047 నాటికి తిరిగి దాన్ని సాధించాలని, అందుకు ఈ విజన్ మార్గమని ఆయన తెలిపారు. 2047 నాటికి మన భారతదేశం ప్రపంచంలో మూడవ అతి పెద్ద ఆర్థిక శక్తిగా ఎదగాలని ఈ విజన్ ద్వారా చంద్రబాబు ఆశిస్తున్నారు. మూడవ శక్తి ఏమిటి....వీలైతే మొదటి శక్తిగా మన దేశం ఎదగాలని ప్రతి భారతీయుడు కోరుకోవాలి. కాని కోరికలను బట్టి ఆశలు నెరవేరవు. అనుసరించే మార్గాలనుబట్టి సాధించాలనుకుంటున్న చోటికి చేరుతామా లేదా అన్నది తెలుతుంది. 1991లో ప్రారంభమైన ప్రైవేటీకరణ విధానాల ఫలితాలను తాను ముందుగానే ఊహించి స్వర్ణాంధ్రప్రదేశ్ కోసం 'విజన్ 2020' రూపొందించినట్లు ఆయన ఈ విజన్‌లో రాసుకున్నారు. అంతేకాదు 1995-2004 మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రగతిని పరుగులు తీయించారట!

> కాంగ్రెస్ 1991లో ప్రారంభించిన ప్రపంచీకరణ విధానాలు ఈ ముప్పయి సంవత్సరాల్లో దేశ ప్రజలకు ఎంత వినాశనాన్ని తెచ్చాయో అనుభవం నేర్పుతోంది. వీటిని ఏ మాత్రం గుర్తించకుండా ఆ విధానాలే అభివృద్ధికి మూలమని ఈ విజన్‌లో చెప్పడం, వాస్తవాన్ని గుర్తించ నిరాకరించడమంటే ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ ఆర్థిక విధానాలను మరింతగా తలకెత్తుకోవడానికి సిద్ధపడడమే.

కాంగ్రెస్ 1991లో ప్రారంభించిన ప్రపంచీకరణ విధానాలు ఈ ముప్పయి సంవత్సరాల్లో దేశ ప్రజలకు ఎంత వినాశనాన్ని తెచ్చాయో అనుభవం నేర్పుతోంది. వీటిని ఏ మాత్రం గుర్తించకుండా ఆ విధానాలే అభివృద్ధికి మూలమని ఈ విజన్‌లో చెప్పడం, వాస్తవాన్ని గుర్తించ నిరాకరించడమంటే ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ ఆర్థిక విధానాలను మరింతగా తలకెత్తుకోవడానికి సిద్ధపడడమే. సుమారు 40 సంవత్సరాలకు పైగా ప్రజల సొమ్ముతో ప్రభుత్వ రంగం ద్వారా నిర్మించుకున్న బిఎస్ఎన్ఎల్, పోస్టల్, రైల్వే, ఓడరేవులు, విమానాశ్రయాలు, రోడ్లు, బ్యాంకులు, ఎల్ఐసి లాంటి అనేక సంస్థలను, వాటి ఆస్తులను తెగనమ్మి కొద్దిమంది లాభపడి, లక్షల మందికి ఉపాధిని, సామాజిక న్యాయాన్ని దూరం చేసిన ఆ ఆర్థిక విధానాలు దేశ ప్రజలకు శాపంగా మారాయి. 2016 నుండి 2022 నాటికి దేశవ్యాప్తంగా 74,222 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నట్లు కేంద్ర నేర పరిశోధన సంస్థ ప్రకటించింది. 1991 నుండి ఇప్పటి వరకు దేశంలో ఐదు లక్షల మందికి పైగా వ్యవసాయదారులు బలవన్మరణాలకు పాల్పడినట్లు, రెండు కోట్ల మంది వ్యవసాయాన్ని వదిలేసినట్లు రైతు సంఘాల నేతలు గగ్గోలు పెడుతున్నారు. అందుకే ఈ విధానాలను ప్రారంభించిన కాంగ్రెసు పార్టీనే నేడు ఆ విధానాల గురించి మాట్లాడడం మానేసింది. అంతేకాదు, ఈ విధానాలకు మూలకర్త అయిన నాటి దేశ ప్రధాని పి.వి.నరసింహారావు తన పదవీ కాలం ముగిసిన తర్వాత హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో జరిగిన సన్మాన సభలో 'కొత్త ఆర్థిక విధానాల వల్ల దేశంలోకి కార్ల పరిశ్రమలు వస్తాయనుకుంటే కార్లు వచ్చాయి' అని వాపోయారు. సృష్టికర్తకు ఐదు సంవత్సరాలకే ఆ విధానాల తత్వం బోధపడితే, ఈయనకు మాత్రం ముప్పై ఏళ్లయినా బోధపడకపోవడం ఈ విజన్‌లోని ముఖ్యమైన దృష్టి లోపం.

మూడవ పెద్ద ఆర్థిక వ్యవస్థ!

ప్రపంచ మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా, 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా దేశాన్ని ముందుకు తీసుకుపోతామని నరేంద్ర మోడీ, నిర్మలా సీతారామన్ గత తొమ్మిది సంవత్సరాలుగా చెప్పిన చోట చెప్పకుండా చెబుతూనే వున్నారు. అదే కీర్తనను ఇప్పుడు చంద్రబాబు అందుకున్నారు. ప్రస్తుత ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థల్లో మన దేశం ఐదవ స్థానంలో వుంది. అమెరికా 26.8 ట్రిలియన్ డాలర్లు, చైనా 19.3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలు. జపాన్ 4.4, జర్మనీ 4.2, భారతదేశం 3.7 ట్రిలియన్ డాలర్లు కలిగివున్నాయి. రానున్న 25 సంవత్సరాల్లో జపాన్ ఆర్థిక వ్యవస్థ 0.7 ట్రిలియన్ డాలర్లు తగ్గినా, మన దేశం 0.8 పెరిగినా మనం మూడవ స్థానంలోకి చేరుతాం. అయితే మొదటి, రెండు స్థానాలకు మూడో స్థానానికి ఎంత దూరం వుంటామనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. 2035 నాటికి ప్రపంచ అతి పెద్ద ఆర్థిక శక్తిగా ఎదగాలని చైనా ప్రయత్నిస్తున్నది. అమెరికా తన అగ్ర స్థానాన్ని నిలుపుకోవడానికి అనేక ప్రయత్నాలు చేస్తోంది.

భారతదేశ విశ్వగురు ఆర్థిక వ్యవస్థ

ఈ విజన్ డాక్యుమెంట్‌లో చంద్రబాబు పంచ వ్యూహాలు ప్రకటించారు. ఒకటి బహుళ జాతీయంగా భారతీయ సంస్థలు అభివృద్ధి కావడం, రెండవది నాలుగు 'పి' లు అమలు చేయడం, మూడవది కొత్త పరిశోధనలు, నాలుగు ఇంధన సమృద్ధి దేశంగా భారత్, ఐదు జల సమృద్ధి దేశంగా మారడం. విదేశీ బహుళజాతి సంస్థలు దేశంలోకి జొరబడి అన్ని రంగాలను లూటీ చేస్తుంటే ఇప్పుడు దేశ కంపెనీలు కూడా బహుళజాతి సంస్థలుగా మారాలని కోరుకుంటున్నారు. 4 'పి' లు అంటే పీపుల్ (ప్రజలు), పబ్లిక్ (ప్రభుత్వం), ప్రైవేట్, పార్టనర్ షిప్ (భాగస్వామ్యం) అనే ఈ నాలుగు 'పి' ల ద్వారా విజన్ 2047 లక్ష్యాన్ని సాధించాలని చంద్రబాబు ఆలోచన. వాస్తవంగా ఈ 'పి' లు కొత్తవి కావు. ప్రపంచబ్యాంకు విధానాలు దేశంలో అమలు చేయనారంభించిన నాటి నుండి ఇవి అమలవుతున్నాయి. ఇంకా చెప్పాలంటే స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండే ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య విధానాలు అమలవుతున్నాయి. 1944లో దేశంలోని నాటి పెద్ద ప్రైవేట్ కంపెనీలు బాంబేలో కూర్చొని రూపొందించిన మిశ్రమ ఆర్థిక వ్యవస్థ అనేది ఈ 'పి' ల పుట్టినిల్లు. ఈ విధానాల వల్లే కదా నాడు చిన్న చేపలుగా వున్న ప్రైవేట్ కంపెనీల సంపన్నులు నేడు మోడీ సేవతో దేశాన్నే కబళించే తిమింగలాలుగా మారింది. ఈ 'పి' ల విధానంలో కొత్తదనం ఏముంది? గతంలో చంద్రబాబు నాయుడు విద్యుత్, ఆర్టీసి, వివిధ ప్రభుత్వ సంస్థల్లో అమలు చేసిన ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం వల్లే కదా ప్రజల చేత తిరస్కరించబడింది. నేటి బిజెపి ప్రభుత్వం మధ్య యుగాల భావాలు అమలు చేయడం కోసం శాస్త్ర విజ్ఞానాన్ని, పరిశోధనలను తీవ్రంగా హేళన చేస్తుంటే ఆ విధానాలను ఎదిరించకుండా పరిశోధనలు ఎలా సాధ్యమవుతాయి? సహజ వనరులను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే విధానాల్లో ఇంధన, జల వనరుల్లో దేశం ఎలా సమృద్ధిగా అభివృద్ధి సాధిస్తుంది?

ప్రజల పరిస్థితులు ఏమిటి?

గ్లోబల్ లీడర్ లక్ష్యం సరే దేశ ప్రజల పరిస్థితి మాటేమిటి? ప్రస్తుతం దేశ ప్రజల సగటు తలసరి ఆదాయం 2,601 డాలర్లు. ఈ లెక్కన మన ప్రపంచ దేశాల ర్యాంకింగ్‌లో మన దేశం 139వ స్థానంలో వుంది. ప్రపంచ ఆకలి సూచీలో 2022 నాటికి 107వ స్థానంలో వుంది. ఆర్థిక, రాజకీయ సంక్షోభాల్లో కూరుకుపోయిన శ్రీలంక, పాకిస్తాన్, యుద్ధంలో మునిగిపోయిన ఉక్రెయిన్ కంటే మన దేశ ప్రజలు తీవ్ర ఆహార సమస్యను ఎదుర్కొంటున్నారు. నాణ్యమైన విద్య, వైద్యం సాధారణ ప్రజలకే కాదు, దిగువ మధ్య తరగతిగా వున్న కోట్ల మందికి అందని సరుకుగా మారిపోయింది. పట్టణాల్లో వున్న ప్రజల్లో రెండు కోట్ల మందికి గృహ వసతి లేదని నీతి ఆయోగ్ చెప్పింది. రక్షిత మంచి నీరు అందని జనం సుమారు 32 శాతం పైగా వున్నారు. ప్రజలు అధోగతికి దిగజారుతుంటే దేశ ఆర్థిక వ్యవస్థ మూడో స్థానానికి ఎగబాకాలంటే సంపన్నులు బలపడడమేనా? 2014కు ముందు ప్రపంచ సంపన్నుల వంద ర్యాంకింగ్‌లో స్థానంలేని అదానీ నేడు రెండవ స్థానానికి చేరడమే అభివృద్ధా?

ప్రజల పాత్ర లేని అభివృద్ధి అది సంపన్నుల అభివృద్ధే తప్ప, దేశాభివృద్ధి ఎలా అవుతుంది? అందుకే విజన్ 2047లో ప్రజల అభివృద్ధికి ప్రణాళిక లేదు. ఉపాధి కోల్పోతున్న ఉద్యోగులు, ఉపాధి అందని నిరుద్యోగులు, పనుల కోసం పొట్ట చేతబట్టుకొని రాష్ట్రాలు, దేశాలు దాటుతున్న ప్రజలు, వ్యవసాయానికి దూరమవుతున్న రైతులు, కూలీలు, కనీస వేతనాలు అందని శ్రమజీవుల బాగు లేని విజన్ ఎవరి కోసం? మతం పేరుతో మారణకాండ సాగుతుంటే, స్త్రీలను వివస్త్రలను చేస్తుంటే, దళితులు, ఆదివాసుల హక్కులు కాలరాయబడుతుంటే, రాజ్యాంగబద్ధ సంస్థలు ఏలికల చుట్టాలు అవుతూ దేశమంతా ఈసురోమంటుంటే...విజన్ 2047 ఎవరి మెప్పు కోసం? వందేళ్ళ క్రితమే 'దేశమంటే మట్టి కాదోయ్, మనుషులోయ్' అన్న గురజాడ మాటను ఇలాంటివారి చెవుల్లో మారుమోగేలా వినిపించాలి.

> **ఉపాధి కోల్పోతున్న ఉద్యోగులు, ఉపాధి అందని నిరుద్యోగులు, పనుల కోసం పొట్ట చేతబట్టుకొని రాష్ట్రాలు, దేశాలు దాటుతున్న ప్రజలు, వ్యవసాయానికి దూరమవుతున్న రైతులు, కూలీలు, కనీస వేతనాలు అందని శ్రమజీవుల బాగు లేని విజన్ ఎవరి కోసం? మతం పేరుతో మారణకాండ సాగుతుంటే, స్త్రీలను వివస్త్రలను చేస్తుంటే, దళితులు, ఆదివాసుల హక్కులు కాలరాయబడుతుంటే, రాజ్యాంగబద్ధ సంస్థలు ఏలికల చుట్టాలు అవుతూ దేశమంతా ఈసురోమంటుంటే...విజన్ 2047 ఎవరి మెప్పు కోసం? వందేళ్ళ క్రితమే 'దేశమంటే మట్టి కాదోయ్, మనుషులోయ్' అన్న గురజాడ మాటను ఇలాంటివారి చెవుల్లో మారుమోగేలా వినిపించాలి.**

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

★

మోడీ పాలనలో కొనసాగుతున్న రూపాయి పతనం

వ్యాఖ్య

ఒకే విధానాలను అనుసరిస్తూ ఎదుటి వారిని వేలెత్తి చూపితే...అవకాశం వచ్చినపుడు అవే వేళ్లు మన వైపు తిరుగుతాయి. రాజకీయాల్లో ఉన్నవారికి ఈ స్పృహ ఉండదని గతంలో అనేక ఉదంతాలు వెల్లడించాయి. ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోడీ, బిజెపి నేతలకూ అదే పరిస్థితిని రూపాయి తెచ్చింది. 'యుపిఎ ప్రభుత్వానికి దేశ భద్రత గురించిగానీ అదే విధంగా రూపాయి పతనం గురించి గానీ పట్టలేదు. దాని కుర్చీని కాపాడుకోవటం గురించే ఆందోళన పడుతోంది. డాలరుతో మారకంలో రూపాయి పతనం అవుతోంది. కాంగ్రెస్ కారణంగా అది ఐసియులో ఉంది." రూపాయి పతనం గురించి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండగా నరేంద్ర మోడీ ట్వీట్లు, సభలలో చేసిన విమర్శలివి. 2013-14లో రూపాయి ఒక డాలరుకు రూ. 56-62 మధ్య కదలాడింది. ఇప్పుడు కొత్త రికార్డు నెలకొల్పి రూ. 83 దాటింది. తాము అధికారానికి వస్తే రూపాయి విలువను రూ. 45కు పెంచుతామని నాడు బిజెపి చెప్పింది. "గత మూడు నెలలుగా రూపాయి పతనం వేగంగా జరుగుతోంది. దాన్ని బలపరిచేందుకు కేంద్రం ఏ చర్యలూ చేపట్టలేదు. ఇలా రూపాయి పతనం అవుతుంటే ఇతర దేశాలు దీన్ని అవకాశంగా తీసుకుంటాయి. ఇంతటి తీవ్ర ఆర్థిక సంక్షోభం ఉంటుందని దేశం ఎన్నడూ ఊహించలేదు. కానీ అలాంటి సంక్షోభంలో నాయకత్వం దిక్కుతోచకుండా ఉంది. దీంతో ఆశ సన్నగిల్లుతోంది. పౌరుల్లో విశ్వాసాన్ని నింపేందుకు ఎలాంటి చర్యలనూ కేంద్రం తీసుకోలేదు. గత ఐదు సంవత్సరాలుగా ప్రతి మూడు నెలలకు ఒకసారి ధరలు తగ్గుతాయని, ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తుందని కేంద్రం చెప్పటాన్ని వింటున్నాంగానీ జరిగిందేమీ లేదు." అని బిజెపి ఎన్నికల ప్రచారకమిటీ నేతగా మోడీ చెప్పారు.



ఎం. కోటేశ్వరరావు

కేంద్ర ప్రభుత్వం 2022 జులై 11న పార్లమెంటులో అంగీకరించినదాని ప్రకారం గడచిన ఎనిమిది సంవత్సరాల్లో డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ. 16.08 (25.39 శాతం) పతనమైంది. ఆరోజు మారకపు విలువ రూ. 79.41గా ఉంది. ఇప్పుడు 83 దాటింది. డాలరుతో మారకంలో అన్ని కరెన్సీల విలువలు పడిపోతున్నపుడు మనది ఎలా తగ్గకుండా ఉంటుందని పాలక పార్టీ నేతలు వాదనలు చేస్తున్నారు. ఇతర కరెన్సీలతో విలువ తగ్గలేదంటున్నారు. ప్రధాన కరెన్సీలతో 2014-2023లో ఆగస్టు 19 నాటి రూపాయి విలువలు ఎలా ఉన్నదీ చూస్తే (పట్టిక) వాస్తవం ఏమిటో తెలుస్తుంది. 2014 ఏడాదిలో సగటు విలువ అని గమనించాలి.

డాలరు విలువ పెరిగింది తప్ప మన రూపాయి విలువ తగ్గలేదు, ఇతర కరెన్సీల కంటే మనది పటిష్టంగా వుంది, ఇతర కరెన్సీల విలువలు కూడా పడిపోతున్నాయంటూ సమర్థించు కొనేందుకు, జనాన్ని నమ్మించేందుకు బిజెపి మంత్రులు, నేతలు చూస్తున్నారు. దాని వలన మనకు ఒరిగేదేమిటి? పైన పేర్కొన్న పట్టిక ప్రకారం ఒక్క జపాన్ కరెన్సీ ఎన్‌తో మాత్రమే మన రూపాయి విలువలో మార్పు లేదు. మిగిలిన కరెన్సీలతో పోలిస్తే మన రూపాయి పతనమైంది. మనకంటే దరిద్రంగా ఉన్న దేశాల కరెన్సీలతో పోల్చుకుంటే మనది పెరగవచ్చు. ప్రధాన కరెన్సీలతో కూడా పతనం అన్నది వాస్తవం. డాలరు విలువ పెరిగింది, మనది తగ్గలేదని చెబుతున్న వారు ఇప్పుడున్న మారకం రేటుతో డాలర్లను కొంటారా లేక 2014 నాటి రేట్లతో కొనుగోలు చేస్తారా? ఒన్ ఇండియా డాట్ కామ్‌లో 2020 ఆగస్టు 14న ప్రచురితమైన ఒక విశ్లేషణ ప్రకారం 2005 జనవరిలో రూ.43.47గా ఉన్నది. 2014 మే నెలలో రూ.59.44గా ఉంది. పతనం పదహారు రూపాయలు. ఇప్పుడు రూ.83 అనుకుంటే మోడీ ఏలుబడిలో రూ.24 తగ్గింది. మనది ఎగుమతి చేసే దేశమైతే మన కరెన్సీ పటిష్టంగా ఉంటే మనకు లాభం, దిగుమతులైతే డాలర్లు, ఇతర కరెన్సీల కోసం మనం ఎక్కువ రూపాయలు చెల్లించాలి. రాయితీ రేట్లకు మనం రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తున్నాం. వారికి డాలర్లలో చెల్లించేందుకు వీలు లేదు గనుక మన చమురు శుద్ధి సంస్థలు ఇటీవల చైనా యువాన్లలో చెల్లిస్తున్నాయి. అంటే మనం డాలర్ల బదులు యువాన్లు కొనుగోలు చేస్తున్నాం.

కరెన్సీ	2014	2023
డాలరు	60.99	83.15
రూబుల్	1.61	0.88
పౌండ్	100.45	105.89
యువాన్	9.90	11.42
యన్	0.57	0.57
యూరో	81.04	90.57

తొమ్మిదిన్నర సంవత్సరాల పాలనలో రూపాయి విలువ పతనంలో కొత్త రికార్డులను తాకింది. ఇంకా పతనం కావచ్చని చెబుతున్నారు. అమెరికాలో ద్రవ్యోల్బణం తగ్గించాలంటే అక్కడ వడ్డీ రేటు పెంచటాన్ని మార్గంగా విధాన నిర్ణేతలు ఎంచుకున్నారు. దాంతో అమెరికా డాలరు రుణాల మీద వచ్చే వడ్డీ ఎక్కువగా ఉండటంతో ప్రపంచంలో ఉన్న డాలర్లన్నీ అక్కడకు చేరుతున్నాయి. దాని విలువ పెరుగుతోంది. మనతో అనేక కరెన్సీల మీద ప్రతికూల ప్రభావం పడుతోంది. మరికొంత కాలం అమెరికా వడ్డీ రేటు ఎక్కువగానే ఉంటుందని చెబుతున్నారు. అంటే మన కరెన్సీ విలువ ఇంకా పతనం కావచ్చు. మన ఎగుమతులు దిగుమతుల కంటే తక్కువగా ఉన్నందున మనకు నష్టం. డాలరుతో చైనా కరెన్సీ విలువ కూడా తగ్గింది. అది చైనాకు వరంగా మారింది. దాని ఎగుమతులు ప్రపంచంలో తక్కువ ధరకు అమ్ముడుపోతాయి. ఎగుమతి సామర్థ్యం పెరుగుతుంది. మన ఎగుమతులకు పోటీ పెరుగుతుంది. వాణిజ్య లోటు పెరిగితే మన రూపాయి మరింత బలహీనమౌతుంది. మన దేశంతో సహా ప్రపంచంలోని నల్లధనం గల అనేక మంది స్విస్ బ్యాంకుల్లో డబ్బు దాచుకుంటారని తెలిసిందే. స్విస్ కరెన్సీ ఫ్రాంక్ లోకి డబ్బును మార్చుకొని ఆస్తులు కొనుగోలు చేస్తారు. లేదా బ్యాంకుల్లో డబ్బు దాచుకుంటారు. నరేంద్రమోడీ అధికారానికి వచ్చిన 2014లో ఒక స్విస్ ఫ్రాంక్‌కు మన కరెన్సీ మారకపు విలువ ఏడాది సగటు రూ.66.68. అది ఇప్పుడు ఆగస్టు 19న రూ.94.28గా ఉంది. అంటే మన కరెన్సీ పతనమౌతున్న కొద్దీ నగదు వ్యాపారులు డాలర్లు లేదా ఫ్రాంక్‌లో తమ డబ్బును దాచుకునేందుకు ఎగబడతారు. దాంతో వాటి విలువ మరింత పెరుగుతుంది. ఎగబడే దేశాల కరెన్సీ విలువ పతనమౌతుంది. ఇప్పుడు మన రూపాయి ఈ సమస్యనే ఎదుర్కొంటోంది. పదేళ్ల క్రితం విమర్శలు చేసిన నరేంద్రమోడీ లేదా ఇతర బిజెపి నేతలు ఇప్పుడు నోటికి తాళం వేసుకొని పక్కదారి పట్టించేందుకు చూస్తున్నారు. మన కరెన్సీ విలువను పెంచేందుకు అంటే పదేళ్ల క్రితం బిజెపి చెప్పినట్లు రూ.45కు తగ్గించేందుకు పూనుకుంటే మన ఎగుమతిదార్లు గగ్గోలు పెడతారు, దిగుమతిదార్లు సంతోషిస్తారు. అదే పతనాన్ని అనుమతిస్తే దానికి భిన్నంగా స్పందన ఉంటుంది.

2013 నాటి పతనానికి ఇప్పటి పతనానికి పోలిక సరైంది కాదని కొందరు ఆర్థికవేత్తలు కూడా చెబుతున్నారు. కొన్ని సందర్భాలలో కొన్ని కరెన్సీలతో పోలిస్తే రూపాయి బలపడిందని కూడా ఉదాహరణలు చూపారు. అలా జరిగిన ఉదంతాలు కూడా ఉన్నాయి. ఇక్కడ జనానికి కావలసింది రూపాయి బలపడితే లేదా పతనమైతే జనం మీద మన ఖజానా మీద చూపిన అనుకూల, ప్రతికూల ప్రభావాలు ఏమిటన్నది గీటురాయి. రెండు రెళ్ల నాలుగు అన్నట్లుగా మన ఎగుమతులు పెరిగితే మనకు లాభం, దిగుమతులు పెరిగితే నష్టం. అన్ని అనర్థాలకు కారకులు గత యుపిఏ పాలకులు అని ఊరూవాడా ప్రచారం చేశారు. మేకిన్ ఇండియా, మేక్ ఇండియా పేరుతో పెద్ద ఎత్తున ఎగుమతులు చేసి చైనా స్థానాన్ని ఆక్రమిస్తామన్నారు. కానీ జరిగిందేమిటి? కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సర్వే 2022-23లోని గణాంకాల అనుబంధం పేజీ 108,109లో ఇచ్చిన సమాచారం ఏం చెబుతున్నదో ఎవరైనా చూడవచ్చు. 2003-04 (వాజ్‌పేయి సర్కార్ చివరి సంవత్సరం)లో మన దేశ ఎగుమతుల విలువ రూ.2,93,367 కోట్లు కాగా యుపిఏ చివరి సంవత్సరం 2013-14 నాటికి అవి రూ.19,05,011 కోట్లకు చేరాయి. అదే నరేంద్ర మోడీ ఏలుబడిలో 2021-22 నాటికి రూ.30,47,021కు చేరాయి. ఎవరు ఎంత వృద్ధి సాధించినట్లు? ఏ స్కూలు విద్యార్థిని అడిగినా కాంగ్రెసే అని వెంటనే చెప్పేస్తారు. కాంగ్రెస్ ఏలుబడిలో దేశం పరువు పోయిందని, ప్రజలు తమనే తిరిగి తెచ్చారని విదేశీ పర్యటనలలో చెప్పుకుంటున్న బిజెపి నేతలు మన ఎగుమతులకు మార్కెట్లను ఎందుకు సంపాదించలేకపోయారో చెప్పగలరా?

మాక్రోట్రెండ్స్ నెట్ సమాచారం మేరకు 2004 నుంచి 2013 వరకు పది సంవత్సరాల్లో సగటున మన జిడిపిలో 22.09 శాతం విలువగల వస్తుసేవల ఎగుమతులు జరిగాయి. 2014 నుంచి 2021 వరకు ఎనిమిది సంవత్సరాల సగటు 19.85 శాతమే ఉంది. నరేంద్ర మోడీ విదేశాల్లో మన ప్రతిష్టను పెంచారని, మేకిన్ ఇండియా, మేడిన్ ఇండియా పిలుపులు, ఎగుమతి ప్రోత్సాహకాలు, భారీ ఎత్తున విదేశీ పెట్టుబడులు తెచ్చారని, సులభతర వాణిజ్య సూచికను ఎంతగానో మెరుగుపరిచారని చెప్పిన కబుర్లు, ప్రచారం ఏమైనట్లు? ఎగుమతుల శాతం ఎందుకు తగ్గినట్లు?

★

కవిత్వం

గుంతల 'రహదారులు'

రాష్ట్రంలోని రోడ్లు
నగరం లోని రహదారులు
పల్లెసీమ లోని వీధులు
అన్నీ గోతుల మయం
కొన్ని గుంతల మయం
మరి కొన్ని జలాశయాలు!

సదరు గతుకుల రోడ్లపై
హోరు శబ్దాలు చేస్తూ వాహనాలు!
హాహాకారాలు చేస్తూ ....
క్షతగాత్రులు హాస్పిటల్‌కి..!?

నాలుగేళ్ల నుంచి ఈ రోడ్లపై
వాహనయానం చేసే..
ప్రయాణీకులకు నరకయాతన..!?

నిధుల లేమితో విధులకు
చేతులెత్తేసిన పాలకులు..!
రహదారులుకు మరమ్మతులు లేక
అడుగడుగునా రోడ్లు
మడుగుల్లా మారాయి..!

కాస్త వాన కురిస్తే చాలు !
రోడ్ల గుంతలలోకి నీరు చేరి ...
క్షతగాత్రుల పుండ్లు గాయాల్లా వుంటాయి
ఊరిలోని చెరువుల్లా దర్శనమిస్తాయి..!

ప్రజలూ, ప్రతిపక్షాలవారూ రహదారుల
గుంతల వద్ద
నిరసనల నల్ల జెండాలు ఎగరేసినా
ఏలికలకు చీమ కుట్టినట్లైనా వుండదు..!?

రహదారులు ప్రజా ప్రగతికి మార్గాలు..!
రోడ్లు ప్రభుత్వ పాలనకు చిహ్నాలు
రహదారులు పునరుద్ధరించ లేని పాలకులు
ఈ రాష్ట్ర ప్రగతి రథాన్ని ఎలా
నడుపుతారు...?

- జి.సూర్యనారాయణ, దివిసీమ.

థాయిలాండ్ ప్రధానిగా స్థిరాస్తి దిగ్గజం శ్రద్ధ థవిసిన్ !

బ్యాంకాక్ : పాపులిస్ట్ ఫెయూ థాయి పార్టీకి చెందిన స్థిరాస్తి వ్యాపార దిగ్గజం శ్రద్ధ థవిసిన్ థాయిలాండ్ 30వ ప్రధానిగా నియమితులు కావడానికి అవసరమైనన్ని ఓట్లు లభించాయి. ఓటింగ్ ఇంకా పూర్తి కానప్పటికీ గెలుపునకు అవసరమైన ఓట్లు శ్రద్ధకు వచ్చాయి. అయితే పార్లమెంట్ వేదికపై ఒకరు కుప్పకూలడంతో ఇంకా దాదాపు 20 మంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి వుండగానే ఓటింగ్‌ను నిలిపివేశారు. 11 పార్టీల సంకీర్ణానికి శ్రద్ధ నేతృత్వం వహించనున్నారు. ఎనిమిది కేబినెట్ పదవులు, 9 డిప్యూటీ కేబినెట్ పదవులను తాము తీసుకోనున్నట్లు ఫెయూ థాయి పార్టీ తెలిపింది. కాగా ఎన్నికల ఫలితాలకు ద్రోహం చేసేలా కొత్త ప్రభుత్వం వుందని విమర్శకులు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే రాజకీయ ప్రతిష్టంభనకు స్వస్తి పలికి, సామరస్యతను నెలకొల్పాలంటే ఇది అవసరమని ఫెయూ థాయి నేతలు సమర్థిస్తున్నారు. నెలల తరబడి నెలకొన్న సస్పెన్స్, చట్టపరమైన తగాదాలు, సభ్యుల బేరసారాలు వీటన్నింటి ఫలితంగా ఎన్నికల్లో రెండో స్థానంలో వచ్చిన వ్యక్తి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే పరిస్థితి నెలకొంది. 2006లో సైనిక కుట్రలో పదవీచ్యుతుడైన మాజీ ప్రధాని తక్సిన్ షినవ్రత 15 ఏళ్ళ తన ప్రవాసాన్ని ముగించుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన గంటల వ్యవధిలోనే పార్లమెంటరీ ఓటింగ్ జరిగింది. ఫెయూ థాయి పార్టీ విజయానికి తాను స్వదేశానికి తిరిగి రావడానికి సంబంధం ఏమీ లేదని తక్సిన్ చెబుతున్నారు.

ఆ మూడు రోజులు ఢిల్లీ మూత

(మొదటిపేజీ తరువాయి)

మండపం కన్వెన్షన్ సెంటంలో ఈ సదస్సు నిర్వహించనున్నారు. జి20 అధ్యక్షురాలిగా భారత్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి దేశంలోని వివిధ ప్రాంతాల్లో అనేక సమావేశాలు నిర్వహించింది. ఈ సమావేశాల నిర్వహణకు వేదికగా నిలిచిన ఆయా నగరాల సుందరీకరణ పేరుతో పలు కాలనీలను, ఇళ్లను కూల్చివేశారు. చాలా మంది పేదలను అక్కడి నుంచి బలవంతంగా గెంటేశారు. జి-20 అనేది జి-7 ఎలైట్ క్లబ్‌గా మారిందంటూ కార్మిక సంఘాల నుంచి, మేధావులు, ప్రజాతంత్ర సంస్థల నుంచి ఈ సమావేశాలు జరిగిన ప్రతి చోటా నిరసన ర్యాలీలు జరిగాయి. కీలకమైన శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ఎలాంటి నిరసనలు, అసమ్మతిని అనుమతించరాదని మోడీ ప్రభుత్వం ఇప్పటి నుంచే ఢిల్లీలో సభలు, సమావేశాలపై ఆంక్షలు పెడుతున్నది. మూడు రోజుల క్రితం సుర్జిత్ భవన్‌లో వివిధ కార్మిక సంఘాలు, సామాజిక సంస్థలు కలసి జి-20కి ప్రత్యామ్నాయంగా 'వియ్-20' పేరుతో ఏర్పాటు చేసిన సెమినార్ కమ్ వర్క్‌షాప్‌ను అడ్డుకునేందుకు సుర్జిత్ భవన్ గేటుకు ఢిల్లీ పోలీసులు తాళాలు వేసిన ఉదంతం చూశాం. సదస్సు తేదీలు దగ్గరపడుతున్న కొద్దీ ఢిల్లీ పోలీసులు ఆంక్షలను మరింత తీవ్రతరం చేస్తున్నారు. ఇప్పటికే వివిధ శాఖలకు సమాచారం పంపారు ఆధిపత్యవాద దేశాల మెప్పు పొందేందుకు మోడీ సర్కార్ అతిగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. శిఖరాగ్ర సమావేశం జరిగే మూడు రోజులూ ఢిల్లీలోని విద్యా సంస్థలకు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు ప్రకటించనున్నారు. దీంతో పాటు రవాణా వ్యవస్థలపైనా ఆంక్షలు విధించనున్నారు. విద్యా బోధనకు ఆన్‌లైన్ సేవలను ఉపయోగించుకోవాలని సూచించినట్లు సమాచారం.వాణిజ్య సముదాయాలు, మాల్స్, మార్కెట్లు, ఇతర కార్యాలయాల కార్యకలాపాలను ఆ మూడు రోజుల పాటు పూర్తిగా మూసివేయనున్నారు. ఏడవ తేదీ అర్ధరాత్రి నుంచే కొత్త ఆంక్షలు అమల్లోకి వస్తాయి. దేశ, విదేశాలకు చెందిన అత్యంత ప్రముఖులు (వివిఐపి) ప్రయాణించే సమయంలో ట్రాఫిక్‌పై ఆంక్షలు విధించాల్సివుంటుందని తెలిపారు. నిత్యావసర వస్తువులను రవాణా చేసే వాహనాలు మినహా మిగతా భారీ వాహనాలను ఢిల్లీ నగర పాలక సంస్థ, న్యూఢిల్లీ నగరాల్లోకి ప్రవేశించకుండా ఆంక్షలు విధించారు. ఢిల్లీ విమానాశ్రయం నుంచి 18 హెూటళ్లకు వెళ్లే మార్గాల్లో విదేశీ ప్రతినిధుల రాకపోకలు సాగిస్తారు. సమీపంలోని ఆసుపత్రులు, మార్కెట్లు, ఆకర్షణీయ ప్రదేశాలు, ట్రాఫిక్ పోలీసులు జారీ చేసే సూచనలు, వాహనాల కదలికలు వంటివాటిని అన్ని భాషల్లోనూ తెలియజేసేందుకు ఓ వర్చువల్ హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేస్తామని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ
ఉయ్యూరు బ్రాంచి (0611) వెటర్నరీ హాస్పిటల్ ప్రక్కన, ఉయ్యూరు, కృష్ణా జిల్లా, ఏపి - 521165

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఉయ్యూరు బ్రాంచి ఆధీకృత అధికారిగా దిగువ సంతకందారు సదరు చట్టం నందలి రూలు 8(6) ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సాధారణ ప్రజానీకమునకు ముఖ్యంగా ఋణగ్రహీతలకు నోటీసు ఇచ్చి తెలియజేయునదిఏమనగా బ్యాంకు వారు దిగువ పేర్కొన్న బకాయిలను, తదుపరి వడ్డీ, ఛార్జీలు మొ॥నవి తిరిగి రాబట్టుకొనుటకు వారికి హామీగా ఉంచి, స్వాధీనత చేసుకోబడిన స్థిరాస్తులను క్రింద సూచించిన విధముగా ఇ-వేలం ద్వారా బ్యాంకు వారిచే అమ్ముటకు నిర్ణయించడమైనది. దిగువ స్థిరాస్తి అమ్మకం "ఎక్కడ ఏది ఉన్నదో, అది, ఎలా ఉన్నదో అలా మరియు అక్కడ ఏది ఉంటే అది" ప్రాతిపదిన దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతల నుండి రావలసిన బకాయి మొత్తము రూ. 26,35,643/- (అక్షరాలా ఇరవై ఆరు లక్షల ముప్పై ఐదు వేల ఆరు వందల నలభై మూడు రూపాయలు మాత్రమే) మరియు వడ్డీ, ఇతర ఖర్చులు రాబట్టుకొనేందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఉయ్యూరు బ్రాంచి వారిచే ఇ-వేలం అమ్మకం ద్వారా ది. 12-09-2023న ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించడమైనది. బిడ్లు సమర్పించుటకు ఆఖరుతేది : ఈ-వేలం ప్రారంభానికి ముందు వరకు

ఋణగ్రహీతల వివరములు : 1) శ్రీమతి పక్కల శాంతి, హెచ్.నెం. 6-128, శయన హోమ్స్ (సత్య లలిత నివాస్), 1వ అంతస్తు, ఫ్లాట్ నెం. ఎఫ్ 2, గండిగుంట, ఉయ్యూరు - 521165, కృష్ణా జిల్లా, ఎపి. 2) శ్రీ పక్కల సోమశేఖర్, శాంతి, హెచ్.నెం. 6-128, శయన హోమ్స్ (సత్య లలిత నివాస్), 1వ అంతస్తు, ఫ్లాట్ నెం. ఎఫ్ 2, గండిగుంట, ఉయ్యూరు - 521165, కృష్ణా జిల్లా, ఎపి.

ఆస్తి వివరములు :

శ్రీమతి పక్కల శాంతి, భర్త : సోమశేఖర్ గారి పేరిట కృష్ణా జిల్లా, ఉయ్యూరు నగర పంచాయితీ, గండిగుంట గ్రామం, 6వ వార్డు, దగ్గరి ఇంటి నెం. 6-128, ఆర్.ఎస్.నెం. 271/1 & 2 మొత్తం 336.9 చ॥గ॥లలోని అవిభక్త వాటా 48.13 చ॥గ॥లతో కలిపి 1224 చ॥అ॥ల విస్తీర్ణంగల ప్లింత్ ఏరియాతో శయన హోమ్స్ (సత్య లలిత నివాస్) నందు ఫస్ట్ ఫ్లోర్ నందు గల రెసిడెన్షియల్ ఫ్లాట్ ఎఫ్-2. ఫ్లాట్‌కి హద్దులు : తూర్పు : శూన్యాకాశము, దక్షిణం : శూన్యాకాశము, ఉత్తరం : శూన్యాకాశము, పడమర : కామన్ పాసెజ్ మరియు మెట్లు.

రిజర్వుధర (రూ.) : 27,00,000/- ధరావత్తు ధర (రూ.) : రూ. 2,70,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం https://www.ibapi.in మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్ సైట్ : www.unionbankofindia.co.in నందు చూడగలరు. అధీకృత అధికారికి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తిపై ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేదు, ఆసక్తిగల బిడ్డర్లు ఆస్తి పరిశీలన కోసం పైన పేర్కొన్న తేది నందు బ్రాంచి హెడ్ మొబైల్ నెం. 93818 72086, బ్రాంచి Mail ID : bm0806111@unionbankofindia.bankలలో సంప్రదించవచ్చు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 లోని రూలు 8(6)/ రూలు 9(1) అనుసరించి చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం నోటీసు
చెల్లించవలసిన బకాయిలను పూర్తిగా చెల్లించని సందర్భంలో పైన తెలిపిన తేదీన ఈ-వేలం అమ్మకం నిర్వహణ గురించి సదరు ఋణం తీసుకున్న ఋణగ్రహీత / సహాబాధ్యతగల వారికి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని 8(6) రూలు 9(1) క్రింద దీనిని నోటీసుగా పరిగణించవలెను.

తేది : 18-08-2023 సం/- ఆథరైజ్డ్ ఆఫీసర్,
ప్రదేశం : ఉయ్యూరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ
పోరంకి బ్రాంచి టివిఆర్ కాలనీ, బందర్ రోడ్డు, పోరంకి, విజయవాడ, కృష్ణా జిల్లా. ఏపి - 521137

ఈ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పోరంకి శాఖ ఆధీకృత అధికారిగా దిగువ సంతకందారు సదరు చట్టం నందలి రూలు 8(6) ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సాధారణ ప్రజానీకమునకు ముఖ్యంగా ఋణగ్రహీతలకు నోటీసు ఇచ్చి తెలియజేయునదిఏమనగా బ్యాంకు వారు దిగువ పేర్కొన్న బకాయిలను, తదుపరి వడ్డీ, ఛార్జీలు మొ॥నవి తిరిగి రాబట్టుకొనుటకు వారికి హామీగా ఉంచి, స్వాధీనత చేసుకోబడిన స్థిరాస్తులను క్రింద సూచించిన విధముగా ఇ-వేలం ద్వారా బ్యాంకు వారిచే అమ్ముటకు నిర్ణయించడమైనది. దిగువ స్థిరాస్తి అమ్మకం "ఎక్కడ ఏది ఉన్నదో, అది, ఎలా ఉన్నదో అలా మరియు అక్కడ ఏది ఉంటే అది" ప్రాతిపదిన దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతల నుండి రావలసిన బకాయి మొత్తము రూ. 26,59,110.03/- (అక్షరాలా ఇరవై ఆరు లక్షల యాభై తొమ్మిది వేల నూట పది రూపాయల మూడు పైసలు మాత్రమే) (నోటీసు తరువాత రికవరీ చేయబడిన మొత్తాన్ని తీసివేయాలి) తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో రాబట్టుకొనేందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పోరంకి శాఖ వారిచే ఇ-వేలం అమ్మకం ద్వారా ది. 12-09-2023న ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించడమైనది. బిడ్లు సమర్పించుటకు ఆఖరు తేది : ఈ-వేలం ప్రారంభానికి ముందు వరకు

ఋణగ్రహీత / హామీదారుల వివరములు : 1) శ్రీ కర్నాటి దుర్గారావు (అప్లికెంట్), తండ్రి : రాఘవులు, డోర్ నెం. 76-8/1-12/2, టెలిఫోన్ కాలనీ, భవానీపురం, విజయవాడ - 520012. 2) శ్రీమతి కర్నాటి పుష్ప, (సహ ఋణగ్రహీత), భర్త : కర్నాటి దుర్గారావు, డోర్ నెం. 76-8/1-12/2, టెలిఫోన్ కాలనీ, భవానీపురం, విజయవాడ - 520012. 3) శ్రీ కర్నాటి దుర్గారావు (అప్లికెంట్), తండ్రి : రాఘవులు, డోర్ నెం. 115/సి, (దగ్గరి డోర్ నెం. 3-456), ఉండవల్లి జామాయిల్ తోట రోడ్డు, ఫస్ట్ ఫ్లోర్ బిల్డింగ్, ఉండవల్లి గ్రామం, ఉండవల్లి మండలం, ఎస్ఆర్ఓ, గుంటూరు జిల్లా. 4) శ్రీమతి కర్నాటి పుష్ప, (సహ ఋణగ్రహీత), భర్త : కర్నాటి దుర్గారావు, డోర్ నెం. 115/సి, (దగ్గరి డోర్ నెం. 3-456), ఉండవల్లి జామాయిల్ తోట రోడ్డు, ఫస్ట్ ఫ్లోర్ బిల్డింగ్, ఉండవల్లి గ్రామం, ఉండవల్లి మండలం, ఎస్ఆర్ఓ, గుంటూరు జిల్లా.

స్థిరాస్తి వివరములు

గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్ రిజిస్ట్రార్, ఉండవల్లి గ్రామం & పంచాయితీ, ఉండవల్లి జామ ఆయిల్ తోట రోడ్డు, డి.నెం. 115/సి, దగ్గరి డి.నెం. 3-456 వద్ద మొత్తం 103.685 చ॥గ॥ల విస్తీర్ణంలోని స్థలము నందు అవిభక్త లేదా పేర్కొనబడని వాటా 51.84 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఇంటి స్థలము అందలి ఫస్ట్ ఫ్లోర్ ఆర్‌సిసి నివాస భవనం. హద్దులు : తూర్పు : విక్రేతలకు చెందిన ఆస్తి, దక్షిణం : విక్రేతలకు చెందిన ఆస్తి, పడమర : మున్నంగి ప్రకాష్ రెడ్డి మరియు ఇతరులకు చెందిన ఆస్తి, ఉత్తరం : 18 అ॥ వెడల్పు గల జాయింట్ రోడ్డు.

రిజర్వుధర (రూ.) : 25,50,000/- ధరావత్తు ధర (రూ.) : రూ. 2,55,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం https://www.ibapi.in మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్ సైట్ : www.unionbankofindia.co.in నందు చూడగలరు. అధీకృత అధికారికి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తిపై ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేదు, ఆసక్తిగల బిడ్డర్లు ఆస్తి పరిశీలన కోసం పైన పేర్కొన్న తేది నందు అధీకృత అధికారి మొబైల్ నెం. 94913 70200, Mail ID: UBIN0533009@unionbankofindia.bank లలో సంప్రదించవచ్చు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 లోని రూలు 8(6)/ రూలు 9(1) అనుసరించి చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం నోటీసు
చెల్లించవలసిన బకాయిలను పూర్తిగా చెల్లించని సందర్భంలో పైన తెలిపిన తేదీన ఈ-వేలం అమ్మకం నిర్వహణ గురించి సదరు ఋణం తీసుకున్న ఋణగ్రహీత / సహాబాధ్యతగల వారికి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని 8(6) రూలు 9(1) క్రింద దీనిని నోటీసుగా పరిగణించవలెను.

తేది : 18-08-2023 సం/- ఆథరైజ్డ్ ఆఫీసర్,
ప్రదేశం : పోరంకి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పోరంకి శాఖ

ఆ 17 నిమిషాలు ఉత్కంఠభరితం !

చంద్రయాన్-3 సాఫ్ట్ ల్యాండింగ్‌కు సర్వం సిద్ధం

- కొనసాగుతున్న తనిఖీలు
- నేడు అపురూప ఘట్టం ఆవిష్కరణకు ఇస్రో ఏర్పాట్లు

బెంగళూరు : జాబిల్లి ఉపరితలంపై మన అంతరిక్ష నౌక చంద్రయాన్-3 అడుగుపెట్టేందుకు సర్వం సిద్ధమైంది. అపురూపమైన ఈ ఘట్టం ఆవిష్కరించే క్రమంలో చివరి క్షణాలు అత్యంత కీలకమైనవని ఇస్రో అధికారులు చెబుతున్నారు. దాన్ని '17 నిమిషాల టెర్రర్'గా అభివర్ణిస్తున్నారు. ఈ చారిత్రక క్షణాల కోసం యావత్ భారతీయులు ఉద్విగ్నంగా ఎదురుచూస్తున్నారు. చంద్రుడిపై పరిశోధనలకు రోదసిలోకి దూసుకెళ్లిన చంద్రయాన్-3 లక్ష్యం దిశగా చివరి అంకానికి చేరుకుంది. బుధవారం సాయంత్రం 6:04 గంటలకు ఆ అపరూప ఘట్టాన్ని ఆవిష్కరించేందుకు ఇస్రో సిద్ధమైంది. విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌తో కూడిన ల్యాండింగ్ మాడ్యూల్ చంద్రుడిపై నిర్దేశిత ప్రదేశం (సాఫ్ట్ ల్యాండింగ్)లో ల్యాండ్ అయ్యే క్రమంలో చివరి 17 నిమిషాలు అత్యంత కీలకమని ఇస్రో శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ప్రస్తుతం ల్యాండింగ్ మాడ్యూల్‌ను నిరంతర తనిఖీ చేస్తున్నారు. నిర్దేశిత ప్రదేశంలో ల్యాండర్ దిగేందుకు చంద్రునిపై సూర్యోదయం కోసం ఎదురు చూస్తున్నట్లు ఇస్రో తెలిపింది. సూర్యుడి వెలుగు రాగానే సాఫ్ట్ ల్యాండింగ్ ప్రక్రియను చేపట్టనున్నారు. బుధవారం సాయంత్రం సుమారు 5:45 గంటల తర్వాత ఈ ప్రక్రియ మొదలుకానున్నట్లు అంచనా వేస్తున్నారు. అత్యంత క్లిష్టమైన ఈ సాఫ్ట్ ల్యాండింగ్ ప్రక్రియ పూర్తిగా స్వతంత్రమైనది. సరైన ఎత్తులో, సరైన సమయంలో, సరిపడా ఇంధనాన్ని వినియోగించుకుని ల్యాండర్ తన ఇంజన్లను మండించుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత సురక్షిత ల్యాండింగ్ కోసం సరైన ప్రదేశాన్ని స్కాన్ చేసుకుంటుంది. ఇదంతా ల్యాండర్ స్వయంగా చేసుకోవాల్సిందే.

27కి సాఫ్ట్ ల్యాండింగ్ వాయిదా పడొచ్చు !

ఒకపక్క చంద్రునిపై చంద్రయాన్-3 సాఫ్ట్ ల్యాండింగ్‌కి ఇస్రో శాస్త్రవేత్తలు సన్నద్ధమవుతుండగా, అవసరమైతే ఈ ప్రక్రియను 27వ తేదీకి వాయిదా వేయవచ్చని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ల్యాండర్ మాడ్యూల్‌కి సంబంధించిన పేరామీటర్లలో ఏవైనా అసాధారణంగా వున్నాయని తేలితే ఈ ప్రక్రియను వాయిదా వేస్తామన్నారు.

ప్రస్తుతం అంతరిక్ష నౌక వేగాన్ని తగ్గించడంపైనే శాస్త్రవేత్తల దృష్టి కేంద్రీకృతమై వుందని ఇస్రో స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ డైరెక్టర్ నీలేష్ దేశాయ్ తెలిపారు. "ఆ వేగాన్ని మనం నియంత్రించలేకపోతే క్రాష్ ల్యాండింగ్ అయ్యేందుకు అవకాశం వుంటుంది. అందువల్ల టెలిమెట్రీ సిగ్నల్స్‌ను విశ్లేషించి, చంద్రునిపై పరిస్థితులను పరిశీలించి ఎక్కడ ఏది సరిగా లేకపోయినా ల్యాండింగ్ ప్రకియను 27న నిర్వహించేందుకు సిద్ధమవుతామని చెప్పారు.

ఒకవేళ 27కే ల్యాండింగ్ ప్రక్రియ చేపట్టాల్సి వస్తే అప్పుడు ప్రధాన ల్యాండింగ్ ప్రదేశం నుండి 400కిలోమీటర్ల దూరంలో ల్యాండర్ దిగేందుకు మరో ప్రదేశాన్ని ఎంపిక చేశామని కూడా చెప్పారు.



ల్యాండింగ్ ప్రక్రియ ఇలా....

- ల్యాండర్ మాడ్యూల్‌లో పేరామీటర్లు అన్నింటినీ తనిఖీ చేసి, ఎక్కడ ల్యాండ్ అవ్వాలో నిర్దేశించుకున్న తర్వాత బెంగళూరులోని ఇండియన్ డీప్ స్పేస్ నెట్‌వర్క్ నుంచి ఇస్రో సంబంధిత కమాండ్లను ల్యాండర్ మాడ్యూల్‌కు అప్‌లోడ్ చేస్తుంది. షెడ్యూల్డ్ ల్యాండింగ్‌కు రెండు గంటల ముందు ఇది జరుగుతుంది.
- సాఫ్ట్ ల్యాండింగ్ కోసం చంద్రుడి ఉపరితలానికి 30 కిలోమీటర్ల ఎత్తులో ల్యాండర్ పవర్ బ్రేకింగ్ దశలోకి అడుగుపెడుతుంది. ఇక్కడి నుంచి చివరి 17 నిమిషాలు చాలా ఉత్కంఠభరితంగా కొనసాగుతాయి.
- జాబిల్లి ఉపరితలానికి చేరువయ్యేందుకు ల్యాండర్ తన నాలుగు ఇంజిన్లను మండించుకుంటుంది. ఆ తర్వాత క్రమంగా తన వేగాన్ని తగ్గించుకుంటుంది. ల్యాండర్ కుప్పకూలకుండా ఉండేందుకు ఇది ఉపయోగపడుతుంది. జాబిల్లి గురుత్వాకర్షణకు అనుగుణంగా ఈ ప్రక్రియ కొనసాగుతుంది.
- జాబిల్లి ఉపరితలానికి వెళ్లే సమయంలో ల్యాండర్ వేగం సెకనుకు 1.68 కిలోమీటర్లుగా ఉంటుంది. ఒక విమానం వేగం కంటే ఇది పది రెట్లు ఎక్కువ.
- జాబిల్లి ఉపరితలానికి 6.8 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకున్న తర్వాత ల్యాండర్ తన రెండు ఇంజిన్లను ఆఫ్ చేసి మరో రెండు ఇంజిన్లనే ఉపయోగించుకుని వేగాన్ని తగ్గించుకుంటుంది. రివర్స్ థ్రస్ట్‌తో మరింత కిందకు వచ్చేందుకు ప్రయత్నిస్తుంది.
- అప్పటికీ ల్యాండర్ ఇంకా జాబిల్లి ఉపరితలానికి సమాంతరంగానే ఉంటుంది. దీన్ని 'రఫ్ బ్రేకింగ్ దశ' అంటారు. ఇదంతా 11 నిమిషాల పాటు సాగుతుంది.
- ఆ తర్వాత ల్యాండర్ 'ఫైన్ బ్రేకింగ్ దశ'లోకి అడుగుపెడుతుంది. ఇక్కడ చంద్రయాన్-3 అంతరిక్ష నౌక 90 డిగ్రీలు వంపు తిరుగుతుంది. అప్పుడు చంద్రుని ఉపరితలంపై నిలువు స్థానానికి వస్తుంది. గతంలో ఇక్కడే చంద్రయాన్-2 నియంత్రణ కోల్పోయి క్రాష్ అయ్యింది.
- అలా క్రమంగా వేగాన్ని తగ్గించుకుంటూ జాబిల్లి ఉపరితలానికి 800 మీటర్ల ఎత్తుకు చేరుకున్న తర్వాత ల్యాండర్ నిలువు, అడ్డం వేగాలు సున్నాకు తగ్గుతాయి. అప్పుడు ల్యాండర్ అనువైన ప్రదేశం కోసం అన్వేషిస్తుంది.
- ఆ తర్వాత ల్యాండర్ మరింత కిందకు దిగి 150 మీటర్ల ఎత్తుకు వస్తుంది. అప్పుడు మరోసారి ల్యాండింగ్ కోసం ఎగుడు దిగుళ్లు, బండరాళ్లు లేని ప్రదేశం కోసం వెతుకుతుంది.
- అన్నీ అనుకూలంగా కన్పిస్తే రెండు ఇంజిన్ల సాయంతో ల్యాండర్ జాబిల్లిపై అడుగుపెడుతుంది. అప్పుడు దాని కాళ్లు సెకనుకు మూడు మీటర్ల వేగంతో చంద్రుని ఉపరితలాన్ని తాకుతాయి.
- ల్యాండర్ కాళ్లకు అమర్చిన సెన్సార్లు.. జాబిల్లి ఉపరితలాన్ని నిర్ధారించుకున్న తర్వాత ఇంజిన్లు ఆఫ్ అవుతాయి. ఆ 17 నిమిషాల టెన్షన్‌కు తెరపడి ప్రయోగం విజయవంతమవుతుంది.

ల్యాండర్ జాబిల్లిపై దిగిన తర్వాత దాని ఒక తలుపు తెరుచుకుంటుంది. అందులో నుంచి రోవర్ జారుకుంటూ కిందకు వస్తుంది. ఆ తర్వాత ల్యాండర్ జాబిల్లి ఉపరితలంపై పరిశోధనలు సాగిస్తుంది. ల్యాండర్, రోవర్ మొత్తం 14 రోజులపాటు చంద్రుడిపై పరిశోధనలు సాగిస్తాయని ఇస్రో వెల్లడించింది.

సహకారం మరింత బలోపేతం

- ఇదే బ్రిక్స్ ఎజెండా
- ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : బ్రిక్స్ సభ్య దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం గావించడమే జొహానెస్ బర్గ్ శిఖరాగ్ర సదస్సు ప్రధాన ఎజెండాగా ఉంటుందని ప్రధాని నరేంద్ర మోడీ చెప్పారు. భారత్, చైనా, రష్యా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా దేశాలతో కూడిన బ్రిక్స్ 15వ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు మంగళవారం ఉదయం ఇక్కడి నుంచి బయల్దేరి వెళ్లడానికి ముందు ప్రధాని ఒక ప్రకటన చేశారు. ప్రపంచవ్యాప్తంగా వర్ధమాన, పేద దేశాలు ఎదుర్కొనే సవాళ్ళను చర్చించే వేదికగా బ్రిక్స్ ఉంటుందని ఆయన అన్నారు. జొహానెస్‌బర్గ్‌కు చేరుకున్న ప్రధాని మోడీకి అక్కడ ఘన స్వాగతం లభించింది. బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్‌తోను, బ్రిక్స్-ఆఫ్రికా ఔట్‌రీచ్, బ్రిక్స్ ప్లస్ డైలాగ్‌ల్లో పాల్గొంటారు. పలువురు ప్రపంచ నేతలతో ద్వైపాక్షిక సమావేశాలు జరుపుతారని విదేశాంగ శాఖ ప్రతినిధి తెలిపారు.

వివిధ రంగాల్లో పరస్పర సహకారానికి బలమైన ఎజెండాను బ్రిక్స్ అమలు చేస్తోందని మోడీ పేర్కొన్నారు. అభివృద్ధి చొరవలు చేపట్టడం, బహుముఖ్య వ్యవస్థలను సంస్కరించడంతో పాటూ మొత్తంగా పేద, వర్ధమాన దేశాలకు ఆందోళన కలిగించే అంశాలను చర్చించేందుకు బ్రిక్స్ ఒక వేదికగా మారిందని భావిస్తున్నట్లు మోడీ పేర్కొన్నారు. భవిష్యత్ సహకారానికి రంగాలను గుర్తించడానికి, వ్యవస్థాగత అభివృద్ధిని సమీక్షించడానికి బ్రిక్స్ సదస్సు మంచి అవకాశమని అన్నారు.

ఆఫ్రికా, మధ్య ప్రాచ్యానికి చెందిన 20కి పైగా దేశాల అధినేతలు ఈ సదస్సుకు హాజరవుతున్నారు. వారిలో చాలామంది ఇప్పటికే బ్రిక్స్ సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకున్నారు. సదస్సులో ఇది కూడా ప్రధాన చర్చనీయాంశంగా వుండనుంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ సదస్సుకు వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా హాజరవుతారు.

గ్రీస్ ప్రధాని ఆహ్వానం మేరకు ఈ నెల 25న దక్షిణాఫ్రికా నుండి గ్రీస్‌కు మోడీ వెళతారు. 40ఏళ్ళ తర్వాత గ్రీస్‌లో పర్యటిస్తున్న మొదటి భారత ప్రధాని తానే అయిన గౌరవం దక్కిందని మోడీ వ్యాఖ్యానించారు. బహుముఖాలుగా సంబంధాలను విస్తరించుకునేందుకు, కొత్త అధ్యాయాన్ని ప్రారంభించేందుకు తాను ఎదురుచూస్తున్నానని మోడీ పేర్కొన్నారు. అక్కడ గల భారతీయులతో కూడా ఆయన సమావేశం కానున్నారు.

జోహానెస్‌బర్గ్ చేరుకున్న మోడీ

షెడ్యూల్ టైం ప్రకారం జోహానెస్‌బర్గ్ వాటర్‌క్లాఫ్ ఎయిర్ ఫోర్స్ బేస్‌కు చేరుకున్న ప్రధాని అక్కడ నుండి నేరుగా బ్రిక్స్ బిజినెస్ ఫోరం లీడర్స్ డైలాగ్ సమావేశంలో పాల్గొన్నారు. తర్వాత బ్రిక్స్ లీడర్స్ రిట్రీట్‌లో కూడా పాల్గొన్నారు. 2019 తర్వాత ముఖాముఖి బ్రిక్స్ నేతలు భేటీ అవుతున్న సమావేశం ఇది. పైగా ఇరాన్, బంగ్లాదేశ్, ఇతర వర్ధమాన దేశాలను కలుపుకోవడం ద్వారా బ్రిక్స్‌ను విస్తరించాలని భావిస్తున్న నేపథ్యంలో ఈ సదస్సు అదనపు ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన అనేక అతిథి దేశాల నేతలతో సమావేశమై, చర్చించేందుకు ఎదురుచూస్తున్నట్లు మోడీ జోహాన్నెస్‌బర్గ్‌లో పేర్కొన్నారు.

బిజెపి ప్రభుత్వంతో రాజ్యాంగానికి హాని

- రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకష్ణ

ప్రజాశక్తి - అమలాపురం(డాక్టర్ బిఆర్.అంబేద్కర కోనసీమ జిల్లా)

రానున్న ఎన్నికల్లో కేంద్రంలో బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. 'రాష్ట్రాన్ని రక్షించండి - దేశాన్ని కాపాడండి' అన్న నినాదంతో సిపిఐ చేపట్టిన బస్సు యాత్ర మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కొనసాగింది. ఈ సందర్భంగా అల్లవరం మండలం బోడసకుర్రులో దళితులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను ఖండిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని ఆర్ఎస్ఎస్, బిజెపి మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. ఈ తొమ్మిదేళ్లలో రాజ్యాంగానికి తూట్లు పొడిచేలా పలు చర్యలకు పాల్పడిందన్నారు. మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దళితులను సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అణగదొక్కాలని చూస్తున్నారన్నారు. కాకినాడలో దళిత యువకుని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబును సిఎం ఇప్పటికీ వెనకేసుకొస్తున్నారని దుయ్యబట్టారు. అమలాపురం మాజీ ఎంపి జివి.హర్షకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులపై ఢిల్లీలోని కేంద్ర ఎస్‌సి కమిషన్‌కు ఫిర్యాదు చేశానని తెలిపారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ మహిళలు, దళితులకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. పోలీసుల చిత్రహింసలకు గురైన దళిత యువకుడు వెంకటప్రసాద్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

దళిత యువకునికి పరామర్శ

విచారణ పేరుతో పోలీసుల చిత్రహింసలకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తూర్పుగోదావరి జిల్లా చాగల్లుకు చెందిన దళిత యువకుడు వడ్డీ వెంకటప్రసాద్‌ను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మంగళవారం పరామర్శించారు. ఘటనకు కారణమైన కడియం ఎస్ఐను సస్పెండ్ చేయాలని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

హెలికాప్టర్ ద్వారా సహాయక చర్యలు

గాల్లో ప్రాణాలు !

- పాక్‌లో కేబుల్ కార్‌లో చిక్కుకున్న చిన్నారులు
- హెలికాప్టర్లతో ఐదుగురిని రక్షించిన ఆర్మీ

ఇస్లామాబాద్ : పాకిస్తాన్‌లో పర్వతప్రాంతమైన ఖైబర్ ఫక్తూన్‌ఖవా (కెపి)లోని బట్టగ్రామ్‌లో మంగళవారం పలువురు చిన్నారులు సహా 8 మంది కేబుల్ కారులో చిక్కుకొని విలవిల్లాడారు. స్కూలుకు వెళ్ళేందుకు ఈ పిల్లలు ప్రతి రోజూ లోయను దాటాల్సి వుంటుంది. అందుకోసం కేబుల్ కారును ఉపయోగిస్తారు. అయితే మంగళవారం నాడు మారుమూల పర్వత ప్రాంతంలో ప్రయాణం మధ్యలో కేబుల్ కారు వైర్ తెగింది. దీంతో 1200 అడుగుల ఎత్తులో పిల్లలు వేలాడుతూ విలవిల్లాడారు. చిన్నారులను రక్షించేందుకు మూడు హెలికాప్టర్లను సైన్యం రంగంలోకి దింపింది. మంగళవారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో కడపటి వార్తలు అందేసరికి ఐదుగురు చిన్నారులను క్షేమంగా బయటకు తీసుకొచ్చారు. మిగలిన ముగ్గురి సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అయితే హెలికాప్టర్ల ద్వారా చేపట్టిన ఆపరేషన్ సాయంత్రం 4.45 వరకూ ఆ ప్రాంతంలో వాతావరణం సహకరించకపోవడం, చీకటి పడటంతో సహాయక చర్యలకు అంతరాయం ఏర్పడింది. అయితే అదే మార్గంలో మరో కేబుల్ కార్ ఏర్పాటు చేయడం, కింద పడిపోకుండా జోలె లాంటి ఏర్పాటు చేయడం వంటి చర్యల ద్వారా చిన్నారులను రక్షించేందుకు సహాయక చర్యలను కొనసాగిస్తున్నామని సంబంధిత అధికారులు మంగళవారం రాత్రి 10.30 గంటలకు తెలిపారు. బాధితుల్లో మిగిలిన చిన్నారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ కేబుల్ కారులోనే వేలాడుతున్నారు. రక్షణ కోసం చిన్నారులు ఎదురుచూపులు చూస్తున్నారని సీనియర్ అధికారి అబ్దుల్ బసిత్ ఖాన్ తెలిపారు.

బిజెపిని దించేస్తేనే రక్ష

- లాలూ ప్రసాద్ యాదవ్

పాట్నా : ప్రధానమంత్రి నరేంద్ర మోడీని, ఆయన పార్టీని ఓడించడం ద్వారానే దేశాన్ని రక్షించుకోగలమని, అదే తమ ప్రధాన లక్ష్యమని బీహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ అన్నారు. దాదాపు ఏడేళ్ల విరామం తరువాత లాలూ ప్రసాద్ యాదవ్ తన భార్య రబ్రీదేవితో కలిసి పూర్వీకుల గ్రామమైన పుల్వారియాను సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో లాలూ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపిని గద్దె దింపడమే తమ ముందున్న ప్రధాన కర్తవ్యమని ఆయన చెప్పారు. మోడీ సర్కార్ రాజ్యాంగంపైనే దాడికి యత్నిస్తోందని వాపోయారు. ఆయనను ఓడిస్తేనే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకున్నట్లని ఆయన చెప్పారు.

AUCTION NOTICE
IN THE HONOURABLE COURT OF THE XVI ADDIONAL DISTRICT JUDGE AT NANDIGAMA, KRISHNA (NTR) DISTRICT,
E.P. 156/22 A.O.P. No. 381/21
Between: M/s. SHRIRAM CITY UNION FINANCE PVT LTD. ...DHR
And:
UTLA NAGESWARA RAO ...JDR 1
UTLA PADMA ...JDR 2
SALE OF IMMOVABLE PROPERTY
The General Public/ Interested bidders are hereby informed that in the above E.P. the below mentioned immovable properties belonging to Judgment Debtor herein are ordered for Sale in an open court auciton, the said auction is to be held on 15-09-2023 in the premises of XVI Additional District Judge at Nandigama, Krishna (NTR) District at 10:30 A.M.
SCHEDULE OF THE PROPERTY
EXECUTION PETITION SCHEDULE FILED ON BEHALF OF THE D.H.R. PROPERTY BELONGS TO J.D.R. NO.2
Krishna District, Jaggaiahpet Sub-District, Penuganchprolu Mandal, Anigandlapadu Gram Panchayat Limits, Anigandlapadu Village, R.S.No.35/2, out of Ac.0.29 Cents, an extent of Ac. 0.08 cents or 387.2 Sq.Yds of Vacant Site situated Near Door No.4-174, bounded by:- East: Panchayat C.C. Road, South: Passage, West: Site of Bosetty Rathaiah, Bosetty Narasimha Rao, North: Passage; Within the above an extent of Ac. 0.08 cents or 387.2 Sq.Yds of Vacant Site Only (This Property Corresponds to Document No.6553/2016 of S.R.O.Jaggaiahpet)
DHR'S VALUE: Rs.10,00,000/-
//BY ORDER OF THE COURT//
T.V.V.S.SARMA, Advocate
Nandigma, Krishna District

AUCTION NOTICE
IN THE HONOURABLE COURT OF THE XVI ADDIONAL DISTRICT JUDGE AT NANDIGAMA, KRISHNA (NTR) DISTRICT,
E.P. 360/20 A.O.P. No. 548/18
Between: M/s. SHRIRAM CITY UNION FINANCE PVT LTD. ...DHR
And:
D.TIRUPATI RAO ...JDR
SALE OF IMMOVABLE PROPERTY
The General Public/ Interested bidders are hereby informed that in the above E.P. the below mentioned immovable properties belonging to Judgment Debtor herein are ordered for Sale in an open court auciton, the said auction is to be held on 11-09-2023 in the premises of XVI Additional District Judge at Nandigama, Krishna (NTR) District at 10:30 A.M.
SCHEDULE OF THE PROPERTY
EXECUTION PETITION SCHEDULE FILED ON BEHALF OF THE D.H.R. PROPERTY BELONGS TO J.D.R. NO.1
An extent of 0.04 cents 002 Sq.links or 193.69 Sq.Yards of Vacant Residential Site in R.S.No.141/1A, Plot No.7, situated in Makkapet Village and Gram Panchayat Area, Vatsvai Mandal, Jaggaiahpet Sub-Registry, Krishna Dist., Doc. No.3174/16 being bounded by: East: Plot No.6 ...87 links, South: Plot No.4 ...46 links, West: Plot No.8 ...87 links, North: 20 links Width Road ...46 links.
DHR'S VALUE: Rs.3,00,000/-
//BY ORDER OF THE COURT//
T.V.V.S.SARMA, Advocate
Nandigma, Krishna District

AUCTION NOTICE
IN THE HONOURABLE COURT OF THE XVI ADDIONAL DISTRICT JUDGE AT NANDIGAMA, KRISHN (NTR) DISTRICT.
E.P. 901/21 A.O.P. No. 402/20
Between: M/s. SHRIRAM CITY UNION FINANCE PVT LTD. ...DHR
And:
MUDAVATH NAGARAJU ...JDR1
MUDAVATH KUMAR NAYAK ...JDR3
SALE OF IMMOVABLE PROPERTY
The General Public/ Interested bidders are hereby informed that in the above E.P. the below mentioned immovable properties belonging to Judgment Debtor herein are ordered for Sale in an open court auciton, the said auction is to be held on 20-09-2023 in the premises of XVI Additional District Judge at Nandigama, Krishna (NTR) District at 10:30 A.M.
SCHEDULE OF THE PROPERTY
EXECUTION PETITION SCHEDULE FILED ON BEHALF OF THE D.H.R. PROPERTY BELONGS TO J.D.R. NO.3
Krishna District, Jaggaiahpet Sub-District, Jaggaiahpet Mandal, Dharmavarappadu Gram Panchayat Limits, Chillakallu Village, R.S.No.196 out of Ac.2.17 cents, an extent of Ac.0.90 cents, of land which is divided into house Plots, out of which Plot No.14 measuring an extent of Ac. 0.04 cents 476 Sq.Links or 216.66 Sq.Links, or 216.66 Sq.Yds off Vacant Site situated near Door No.6-110, Doc.No.1012/17. Bounded by:- East: Site of Mudavath Naga Raju ...40.1 Ft., South: Site in Plot No. ...13.50 Ft., West: 18 Ft. Width Road ...38 Ft., North: Site of Valluri Murali Krishna etc. ...50 Ft.
DHR'S VALUE: Rs.4,00,000/-
//BY ORDER OF THE COURT//
T.V.V.S.SARMA, Advocate
Nandigma, Krishna District

AUCTION NOTICE
IN THE HONOURABLE COURT OF THE XVI ADDIONAL DISTRICT JUDGE AT NANDIGAMA, KRISHN (NTR) DISTRICT,
E.P. 153/22 A.O.P. No. 380/21
Between: M/s. SHRIRAM CITY UNION FINANCE PVT LTD. ...DHR
And:
CHILUKURI SRINIVASA RAO ...JDR
SALE OF IMMOVABLE PROPERTY
The General Public/ Interested bidders are hereby informed that in the above E.P. the below mentioned immovable properties belonging to Judgment Debtor herein are ordered for Sale in an open court auciton, the said auction is to be held on 14-09-2023 in the premises of XVI Additional District Judge at Nandigama, Krishna (NTR) District at 10:30 A.M.
SCHEDULE OF THE PROPERTY
EXECUTION PETITION SCHEDULE FILED ON BEHALF OF THE D.H.R. PROPERTY BELONGS TO J.D.R. NO.1
Krishna District, Jaggaiahpet Sub-District, Jaggaiahpet Mandal, Chillakallu Gram Panchayat Area, Chillakallu Village, R.S.No. 221/1 out of Ac.14.80 cents, an extent of Ac.1.37 cents, out of which Ac. 0.38 cents 850 Sq.links out of which Plot No.16, measuring Ac. 0.09 cents 730 Sq.links or 474 Sq.Yds of Vacant Site situated near Door No.4-250, bounded by:- East: Site in Plot No.13, South: Other's Site 45 Feet, West: 21 Feet Wide Road, North: 30 Feet Wide Road 45 Feet.
DHR'S VALUE: Rs.18,00,000/-
//BY ORDER OF THE COURT//
T.V.V.S.SARMA, Advocate
Nandigma, Krishna District

మీకోసం

ఉప్పులో నీరు చేరకుండా ఉండాలంటే అందులో పచ్చి మిరపకాయ వేయాలి.

జీవన సౌరభం

గొప్ప పనులు బలంతో కాదు, పట్టుదలతో సాధ్యమవుతాయి.

బుజ్జి కుక్క భయం

టింకూకి పదేళ్ళుంటాయి. కుక్కపిల్లలంటే ఇష్టపడుతున్నాడని తన స్నేహితురాలిని అడిగి వాళ్లింట్లో ఉన్న ఓ బుజ్జి కుక్క పిల్లను పెంచుకోవడానికి తెచ్చింది వాళ్ళమ్మ. టింకూ తెగ సంబరపడిపోయాడు. ఒక వెడల్పాటి గిన్నెలో పాలు పోసి దాని ముందుంచాడు. అది పాలు తాగి ఆడుతుంటే గంతులు వేశాడు. ఒక రోజు టింకూ బ్రెడ్ పళ్ళెంలో పెట్టి అదే పళ్ళెంలో పాలగ్లాసు పెట్టుకుని తిందామని బల్లపై పెట్టాడు. ఇంతలో వాడి చెయ్యి తగిలి గ్లాసులో పాలు పళ్ళెంలో ఒలికిపోయాయి. బుజ్జి కుక్కపిల్ల చూస్తుండగానే పాలు క్షణంలో మాయమయ్యాయి. బ్రెడ్ ఆ పాలను తాగేసిందని అది గ్రహించింది. దాని కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి.

పాలు తాగిన ఆ బ్రెడ్ తనలాగానే ఒక ప్రాణి అని భావించింది. 'కాకపోతే అది తనలా చలాకీగా కాకుండా, కదలకుండా బద్ధకంగా పడి ఉంది. అంత సోమరితనంలోనూ గ్లాసుడు పాలూ క్షణంలో తాగేసింద'ని ఆశ్చర్యపోయింది. ఆ బ్రెడ్ ముక్కని పలకరించుదామనే లోపు టింకూ వచ్చి చెంచాతో బ్రెడ్ తినేశాడు. బుజ్జి కుక్క తన కళ్ళను తానే నమ్మలేకపోయింది. పాలు తాగిన బ్రెడ్‌ని తిన్న టింకూని చూసి భయంతో వణికిపోయింది. పాలు తాగే తననీ టింకూ అలాగే తినేస్తాడేమో అనే ఊహతో ఇక అది పాలు తాగడమే మానుకుంది.

ఆ రోజు నుండి టింకూతో అదివరకులా ఆడుకోవడం లేదు. దాని కంటికి టింకూ రాక్షసుడిలా కనబడసాగాడు. వచ్చిన మూడు రోజులకే చలాకీతనం కోల్పోయి ఏం తాగకుండా, ఆడుకోకుండా ముడుచుకుపోయి వణుకుతున్న బుజ్జి కుక్కని చూసిన టింకూ వాళ్ళమ్మకి అది తల్లి బెంగో, అనారోగ్యమో అర్థం కాలేదు. ఎంత బుజ్జగించినా పాలు తాగకపోవడంతో చేసేదేం లేక తిరిగి స్నేహితురాలింట్లో వదిలివేసింది. అక్కడ తల్లి దగ్గర చేరి మళ్ళీ హాయిగా ఆడుకుంటున్న బుజ్జి కుక్కపిల్లను చూసి బెంగ అనే అనుకున్నారు, అసలు సంగతి తెలియని స్నేహితురాళ్ళిద్దరూ.

- గుడిపూడి రాధికారాణి



దారి కనుక్కోండి!

చిన్నారులూ, ఈ బొమ్మలో ఈ చివర ఉన్న కప్ప ఆ చివర ఉన్న గుడ్లగూబను చేరుకోవాలి. మీరు కప్పకు కాస్త దారి చూపిద్దురూ ..!

నేను గీసిన బొమ్మ

టి కౌశిక్ అభిరామ్, 4వ తరగతి, అరవింద హైస్కూలు, కుంచనపల్లి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

'ఆమె'కు స్థానం లేని ఔషధ ప్రయోగం!

తలనొప్పి.. జ్వరం.., కాళ్లు చేతులు లాగడం.. మెడ, నడుం ఒకటే నొప్పి.. ఇలా రకరకాల నొప్పులతో బాధపడే మహిళలు ఎంతోమంది ఉంటారు. ఉపశమనం కోసం మెడికల్ షాపుల్లో దొరికే మందులో.. డాక్టర్లు ఇచ్చే వైద్యమో ఏదొకటి ప్రయత్నిస్తూనే ఉంటారు. అయితే ఈ మందులన్నీ వారికి కచ్చితమైన ఉపశమనాన్ని ఇస్తున్నాయా? అంటే మాత్రం.. కచ్చితమైన సమాధానం లేదు. మార్కెట్లో అందుబాటులో ఉన్న ఔషధాలన్నీ రకరకాల క్లినికల్ పరీక్షల్లో సఫలమయ్యాకే వినియోగానికి వస్తుంటాయి. అయితే ఆ పరీక్షలన్నీ మగ జంతువులు లేక మానవుల శరీరాలపై జరిగాయి. రుతుక్రమ సమస్యల వల్ల ఆడ జంతువులు, మానవులు ఈ పరీక్షల నుంచి మినహాయించారు. దీంతో మహిళల ఆరోగ్యంపై ఈ ఔషధాలు ఎంతవరకు ప్రభావం చూపుతాయన్నదానిపై ఎవరూ సమాధానం చెప్పలేరు. ఈ ప్రశ్నలకు ఇప్పుడు సమాధానం దొరుకుతుంది అంటున్నారు సారా బైలీ. యూనివర్శిటీ ఆఫ్ బాత్‌లో న్యూరోఫార్మకాలజీ సీనియర్ లెక్చరర్ అయిన సారా ఈ క్లినికల్ ట్రయల్స్ గురించి పలు విషయాలు చర్చించారు.

గతంలో క్లినికల్ ట్రయల్స్ ఫలితాలు, భిన్న జాతులు మధ్య పెద్దగా వ్యత్యాసం చూపవని శాస్త్రవేత్తలు భావించేవారు. కానీ పరిస్థితి మారింది. సైన్స్ చెబుతున్న దాని ప్రకారం రెండు భిన్న జాతుల మధ్య విభిన్న ఫలితాలు వస్తాయి. తాజా ఔషధ అధ్యయనాల్లో స్త్రీ, పురుష జంతువులు, మానవుల శరీరాలపై ప్రయోగాలు చేస్తున్నారు.

ఉదాహరణకు మగ ఎలుకలు, ఆడ ఎలుకలపై నిర్వహిస్తున్న ఈ క్లినికల్ ట్రయల్స్‌లో మెదడు పరిణామం, ఆకారం, శరీర భాగాలతో నరాల అనుసంధానం వంటి వన్నీ హైలెట్ చేస్తున్నారు. ఈ పరిశోధనలు ఉత్తమ ఫలితాలు చూపిస్తాయనడంలో సందేహం లేదు. ఒత్తిడి వల్ల పురుషుడు ప్రభావితమయ్యే తీరుకు రెండు రెట్లు అధికంగా మహిళలు ప్రభావితమవుతారు. అంటే లింగ భేదం, ఒత్తిడి ప్రభావంలో చాలా స్పష్టమైన వ్యత్యాసాన్ని చూపిస్తుందన్నది తేలిపోయింది.

పురుషులు కంటే మహిళలు సెలెక్టివ్ సెరోటోనిన్ రీఅప్‌టేక్ ఇన్హిబిటర్స్ (ఎస్ఎస్ఆర్ఐ)లు బలమైన ప్రతిస్పందనలను కలిగిఉంటారు. అలాగే పురుషులు ట్రైసైక్లిక్ యాంటిడిప్రెసెంట్‌కి మెరుగైన ప్రతిస్పందనలు ఇస్తుంటారు. అయితే వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకోకుండా చాలా కాలంగా క్లినికల్ ట్రయల్స్ నుండి మహిళలను మినహాయిస్తూ వచ్చారు. దీనివల్ల వారి ఆరోగ్యంపై ఆందోళనకర పరిణామాలు వెలుగుచూశాయి. ఉదాహరణకు గుండె సంబంధిత వ్యాధులు, మూర్ఛ, తలనొప్పి, వికారం వంటి వాటికి తీసుకునే ఔషధాల వల్ల మహిళలు తరచూ విపరీత పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తోంది.

వ్యాధి తీవ్రత అంచనా పురుషులపై చేసింది కాబట్టి, ఆ సమస్య ఉన్న మహిళలు అదే ఔషధాన్ని తీసుకోవడం వల్ల వారికి పురుషులతో పోలిస్తే సైడ్ ఎఫెక్ట్ రిస్క్ కూడా రెట్టింపు అవుతుంది. పురుషుల కంటే తక్కువ వయసున్న, లేదా సమాన వయసున్న వారైనా సరే పురుషుల వ్యాధి తీవ్రతను ఆధారం చేసుకుని పరీక్షలు చేసిన ఔషధాలనే మహిళలు వాడుతున్నారు. కానీ సెక్స్ హార్మోనుల స్థాయి, ఎంజైమ్‌ల కార్యకలాపాలు స్త్రీ, పురుషుల్లో భిన్నంగా ఉంటాయి. మెటబాలజీ స్థాయిల్లో కూడా తేడా ఉంటుంది. ఈ కారణాల వల్ల ఔషధాల చర్యల్లో భిన్నమైన ఫలితాలు ఉంటాయి. కానీ



చాలాకాలంగా ఒకే రకం మందు వినియోగిస్తున్నారు.

రుతుచక్రం కారణంగా జంతు, మానవులలో మహిళలను ఎక్కువగా మినహాయించారు. హార్మోనుల హెచ్చుతగ్గులు ఫలితాలపై ప్రభావం చూపుతాయని వారిని నిరాకరిస్తూ వచ్చారు. ఒకవేళ కచ్చితంగా ట్రయల్స్ చేయాల్సిన వచ్చినా అది అధిక ఖర్చుతో కూడుకున్నది. పురుషుల్లో ఒకే స్థాయిలో సెక్స్ స్టెరాయిడ్ హార్మోనులు ఉండగా, మహిళల్లో వాటి స్థాయిలు పెరుగుతూ, తగ్గుతూ ఉంటాయి. ఇది మెదడు పనితీరు, ప్రవర్తనపై ప్రభావం చూపిస్తూ.. స్త్రీలలో ఔషధాల పనితీరును కూడా ప్రభావితం చేస్తుంది.

అయితే గత పరిశోధనల్లో ఆడ ఎలుకలపై చేసిన క్లినికల్ ట్రయల్స్ పెద్దగా వ్యత్యాసాన్ని చూపించలేదు. కానీ మహిళల ఈస్ట్రన్ చక్రంతో పోల్చి చూస్తే.. ఆడ ఎలుకల్లో ఇది నాలుగు లేదా ఐదు రోజులు మాత్రమే ఉంటుంది. అంటే ఈ పరీక్షలు మహిళల ఆరోగ్యాన్ని పరిగణించడంలో పెద్దగా ప్రభావాన్ని చూపించలేదు.

పెను ప్రమాదాన్ని తెచ్చిపెట్టింది

1950లో అభివృద్ధి చేసిన థాలిడోమైడ్ ఔషధం గొప్ప విషాధాన్ని మిగిల్చింది. గర్భిణీలలో ఉదయం వేళ వికారం, కళ్లు తిరగడం వంటి మార్నింగ్ సిక్‌నెస్‌కు ఈ ఔషధాన్ని ఇచ్చేవారు. అయితే గర్భిణీలపై ఇది ఎటువంటి ప్రభావం చూపిస్తుందో ప్రయోగింపబడలేదు. కేవలం పురుషులపై మాత్రమే ట్రయల్స్ చేశారు. ఫలితంగా క్రమంగా ఈ మందులు వేసుకున్న మహిళలు ప్రసవించిన బిడ్డలపై ఇది ప్రభావం చూపించింది. ఎంతలా అంటే ప్రపంచవ్యాప్తంగా 10 వేల మంది నవజాత శిశువులు కాళ్లు, చేతులు సరిగ్గా అభివృద్ధి

చెందకుండా, ఇతర పుట్టుకతో వచ్చే లోపాలతో జన్మించారు. అప్పటికి గాని జరిగిన నష్టాన్ని వైద్యులు గుర్తించలేదు.

పరిస్థితులు మెరుగుపడుతున్నాయి

ప్రస్తుతం రుతుచక్రం, ఔషధాల పరస్పర చర్య, గర్భధారణ సమయంలో మార్పులు, హార్మోన్ల గర్భ నిరోధకత వంటి అంశాలపై పరిశోధనలు అభివృద్ధి చెందుతున్నాయి. కానీ కొన్ని దశాబ్దాల పాటు మహిళలను ట్రయల్స్ నుండి మినహాయించడం వల్ల ఎన్నో విషయాలు తెలియకుండాపోయాయి. అమెరికాలో 1990ల నుండి క్లినికల్ ట్రయల్స్‌లో మహిళల భాగస్వామ్యాన్ని చట్టబద్ధం చేశారు. దాదాపు 30 సంవత్సరాల తరువాత అమెరికన్ మెడికల్ రీసెర్చ్ ఏజెన్సీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (ఎన్ఐహెచ్) నిధులు సమకూర్చడంతో క్లినికల్ స్టడీస్‌లో పాల్గొనే సంఖ్యలో మహిళలు దాదాపు సగం మందికి పైగా ఉన్నారని పరిశోధనలు చెబుతున్నాయి. జీవసంబంధమైన లింగం (జన్యుపరంగా నిర్వచించబడినవి), లింగం (వ్యక్తి స్వీయ గుర్తింపు) రెండింటిలోనూ ఈ పరిశోధనలు చేస్తున్నారు. విశ్లేషణలతో పాటు నివేదికలను ఏకీకృతం చేయడంలో ఇవి అభివృద్ధి చెందుతున్నాయి. వీటిపై సమగ్ర సమాచారం అందించేందుకు కొన్ని శాస్త్రీయ పత్రికలు కూడా ఇందులో భాగస్వామ్యం అవుతున్నాయి.

దీర్ఘకాలం వేచి చూడాలి

ఈ పరిశోధనల్లో మొదట ఆడ ఎలుకలను భాగస్వామ్యం చేశారు. అయితే ఇందుకోసం చాలా సమయం పట్టింది. 2014లో ఎన్ఐహెచ్ ప్రకటనను అనుసరించి ఆడ, మగ కణాలు, జంతువులను పరిశోధనల్లో చేర్చే ప్రక్రియ వేగవంతం చేశారు. వైద్య పరిశోధనలకు నిధులు సమకూర్చే సంస్థల్లో ఒకటైన ఎన్ఐహెచ్ పిలుపునందుకుని కెనడియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ రీసెర్చ్, యూరోపియన్ కమిషన్‌లు సమకూర్చిన భారీ నిధులతో ఇతర దేశాల్లో ఈ విధానాలను అమలుచేస్తున్నారు. కానీ కొత్త ఔషధాన్ని తయారుచేసేందుకు 10 నుండి 15 ఏళ్ల సమయం పడుతుంది. ఆ తరువాత క్లినికల్ ట్రయల్స్ ఉంటాయి. అలాగే ఈ ట్రయల్స్‌లో పాల్గొనేవారిని నియమించడంలో ఉన్న అవరోధాలను బట్టి కూడా సమయం పడుతుంది. ఏదేని ఔషధం మహిళల ఆరోగ్యంపై ఏవిధంగా ప్రభావం చూపుతుందో అర్థం చేసుకోలేనంత కాలం చాలా ప్రయోజనాల నుండి వారు మినహాయింపుకు గురౌతారు.

సిపిఎం అభ్యర్థి జైయిక్ సి థామస్‌కు మహిళల బ్రహ్మరథం

తిరువనంతపురం : కేరళ మాజీ ముఖ్యమంత్రి ఊమెన్‌చాందీ మరణంతో ఉప ఎన్నిక జరుగుతున్న పుతుప్పళ్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎల్‌డిఎఫ్ తరపున పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థి జైయిక్ సి థామస్‌కు మహిళలు బ్రహ్మరథం పట్టారు. ఆయనకు మద్దతుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు సుభాషిణి అలీ, కేంద్ర కమిటీ సభ్యులు కెకె శైలజ, పికె శ్రీమతి, రాష్ట్ర మంత్రి ఆర్ బిందు తదితరులు పాల్గొన్నారు.

సుభాషిణీ అలీ, కెకె శైలజతో కలిసి అభివాదం చేస్తున్న థామస్

హర్యానా, పంజాబ్ రైతులపై ఖాకీ జులుం

- వందలాది మంది అరెస్టు
- ఖండించిన ఎఐకెఎస్

చండీగఢ్ : వరద సహాయం కోసం శాంతి యుతంగా నిరసనలకు ప్రయత్నించిన హర్యానా, పంజాబ్‌లకు చెందిన రైతులపై పోలీసులు హింసకు దిగారు. రైతులను లాఠీలతో కొట్టడమే కాకుండా, వందలాది మందిని అరెస్టు చేశారు. తక్షణమే వరద సహాయం అందచేయాలనే డిమాండ్‌తో సోమ, మంగళవారాల్లో హర్యానా, పంజాబ్ ఉమ్మడి రాజధాని చండీగఢ్‌లో నిరసనలకు ఆ యా రాష్ట్రాలకు చెందిన రైతులు ప్రణాళిక సిద్ధం చేశారు. అయితే మార్గ మధ్యంలోనే పోలీసులు అడ్డుకున్నారు. రైతులను, రైతు నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. కొంత మంది రైతులు అన్ని అడ్డంకులను దాటుకుని చండీగఢ్ సరిహద్దులకు చేరుకున్నారు. బ్యారికేడ్లు అడ్డుపెట్టి నిరోధించడానికి పోలీసులు ప్రయత్నించారు. దీంతో రైతులు రోడ్డుపై నిరసనకు దిగారు. పోలీసులు వీరిని లాఠీలతో చెదరగొట్టారు. రైతులపై పోలీసుల హింసను ఎఐకెఎస్ తీవ్రంగా ఖండించింది. ఇటీవల హర్యానా, పంజబ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలకు రైతులు, ఇతర ప్రజలు తీవ్ర కష్టాలు పడినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉదాసీనంగా ఉన్నాయని విమర్శించింది. వర్షాలకు వందల మంది మరణించడంతో సహా ఇళ్లు, పంటలు, పశువుల నష్టం జరిగిందని, అయినా ప్రభుత్వాల నుంచి ఎలాంటి ఉపశమనం లభించలేదని తెలిపింది. డిమాండ్ల సాధన కోసం శాంతి యుతంగా చండీగఢ్ వెళుతున్న నిరసనకారులపై పోలీసు బలగాల్ని ఉపయోగించడాన్ని తీవ్రమైన నియంతృత్వ చర్యగా ఎఐకెఎస్ ఖండించింది. అరెస్టు చేసిన రైతులందర్నీ తక్షణమే విడుదల చేయాలని, ప్రత్యేక వరద సహాయ ఆర్థిక ప్యాకేజీని కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాలని ఎఐకెఎస్ డిమాండ్ చేసింది.

వశిష్ఠ దర్శకత్వంలో 'మెగా'

చిరంజీవి హీరోగా 157వ చిత్ర ప్రకటన కూడా ఆయన పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం ప్రకటించారు. 'బింబిసార'తో సంచలన విజయం అందుకున్న వశిష్ఠ మల్లిడి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. యువీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ మేరకు ఓ పోస్టర్ విడుదల చేశారు. చిత్ర దర్శకుడు మల్లిడి వశిష్ఠ కూడా ఈ చిత్రం గురించి ట్విట్టర్‌లో పేర్కొన్నారు. 'నన్ను, నేను చెప్పిన కథను అంగీకరించిన మైటీ మెగాస్టార్ చిరంజీవి గారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెబుతున్నాను. ఆయన్ను వెండితెరపై చూపించే అవకాశం ఇచ్చినందుకు కతజ్ఞుడిని" అని ట్వీట్ చేశారు.



చిరంజీవి కొత్త చిత్రం

మంగళవారం చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఆయన కొత్త చిత్రం ప్రకటన విడుదల చేశారు. సుస్మిత కొణిదెల భారీ స్థాయిలో నిర్మించనున్న ఈ చిత్రం, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రూపొందనుంది. త్వరలోనే చిత్ర దర్శకుడిని అనౌన్స్ చేస్తారు. 'నాలుగు దశాబ్దాలుగా వెండితెరను ఏలుతున్న లెగసీ. భావోద్వేగాలను కలిగించే అపారమైన వ్యక్తిత్వం. తెరపైన, బయట పండగ లాంటి వ్యక్తి. 155 చిత్రాల తర్వాత, ఇప్పుడు 'మెగా 156'తో మెగా రాకింగ్ ఎంటర్టైనర్ అవుతుంది.

కోస్టల్ రైడర్స్ విజయపరంపర

ఎపిఎల్ సీజన్ 2లో మూడో విజయం

షాట్ కొడుతున్న ధరణి కుమార్

ప్రజాశక్తి - పి.ఎం.పాలెం (విశాఖపట్నం)

ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఎపిఎల్) సీజన్ - 2లో కోస్టర్ రైడర్స్ వరుస విజయాలతో అదరగొడుతోంది. విశాఖలోని ఎసిఎ-విడిసిఎ మైదానంలో జరుగుతున్న లీగ్ మ్యాచ్‌లో ఆ జట్టు గోదావరి టైటాన్స్‌పై 35 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచిన గోదావరి టైటాన్స్ ఫీల్డింగ్ ఎంచుకుని బరిలోకి దిగింది. బ్యాటింగ్ తీసుకున్న కోస్టల్ రైడర్స్ జట్టు బ్యాట్స్‌మెన్‌లు 20 ఓవర్లలో 9 వికెట్లను కోల్పోయి 173 పరుగులు సాధించారు. ఓపెనర్ బ్యాట్స్‌మెన్‌గా బరిలోకి దిగిన ఇ.ధరణి కుమార్ 32 బంతుల్లో 3 సిక్స్‌లు, 8 ఫోర్లుతో 59 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు. మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన ఎం.హర్షవర్ధన్ 22 బంతుల్లో 35 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గోదావరి టైటాన్స్ బ్యాట్స్‌మెన్‌లు 18.1 ఓవర్లలో 138 పరుగులు మత్రమే చేసి ఆలౌటయ్యారు. ఆ జట్టులో మూడో స్థానంలో దిగిన ఎం.హేమంత్ రెడ్డి మాత్రమే 4 సిక్స్‌లు, 5 ఫోర్లుతో 49 బంతుల్లో 58 పరుగులు చేశారు. మిగతా జట్టు సభ్యులు అంతగా రాణించలేకపోయారు. తాజా గెలుపుతో కోస్టల్ రైడర్స్ జట్టు తన విజయాల సంఖ్యను మూడుకు పెంచుకుంది.

కార్ల్‌సన్‌ను నిలువరించిన ప్రజ్ఞానంద

- తొలి గేమ్ డ్రా
- ఫిడే ప్రపంచకప్ చెస్ ఫైనల్

బాకు(అజర్‌బైజాన్): ప్రపంచ చెస్ టైటిల్‌కు జరుగుతున్న తొలిరౌండ్ పోటీలో భారత యువ గ్రాండ్ మాస్టర్ రమేశ్‌బాబు ప్రజ్ఞానంద టాప్‌సీడ్ మాగ్నస్ కార్ల్‌సన్‌ను నిలువరించాడు. మంగళవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో 18ఏళ్ల ప్రజ్ఞానంద 35ఎత్తుల అనంతరం కార్ల్‌సన్ డ్రాకు అంగీకరించాడు. 35 ఎత్తుల తర్వాత రూక్ అండ్ నైట్ ఎండ్ గేమ్‌లో ఇరువురు సమంగా నిలవడంతో గేమ్ డ్రాగా ముగిసింది. విశ్వనాథన్ ఆనంద్ తర్వాత చెస్ ప్రపంచకప్ ఫైనల్‌కు చేరిన రెండో భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద మాత్రమే. అలాగే 18ఏళ్ల అత్యంత పిన్న వయసులో చెస్ ప్రపంచకప్ ఫైనల్‌కు చేరిన తొలి గ్రాండ్‌మాస్టర్‌గానూ ప్రజ్ఞానంద ఇప్పటికే రికార్డు నెలకొల్పాడు. ఇక సోమవారం జరిగిన సెమీస్‌లో ప్రజ్ఞానంద 3వ సీడ్, అమెరికాకు చెందిన 3వ ర్యాంకర్ ఫాబినో కరువానాను టై బ్రేక్‌లో ఓడించి తొలిసారి ఫైనల్లోకి దూసుకొచ్చాడు. ఉత్కంఠభరితంగా సాగిన ఆ సెమీస్‌లో ప్రజ్ఞానంద 3.5-2.5పాయింట్ల తేడాతో కరువానాను చిత్తుచేశాడు. ఈ క్రమంలోనే 2024 క్యాండిడేట్ చెస్ ఛాంపియన్‌షిప్‌కూ అర్హత సాధించాడు. కార్ల్‌సన్‌తో గత 6నెలల్లో ఐదుసార్లు తలపడిన ప్రజ్ఞానంద మూడుసార్లు విజయం సాధించడం విశేషం.

ప్రపంచకప్ చెస్ ఫైనల్లో కార్ల్‌సన్‌తో పోటీపడుతున్న 18ఏళ్ల ప్రజ్ఞానంద

ప్రి క్వార్టర్స్‌కు లక్ష్యసేన్, ప్రణయ్

రెండోరౌండ్‌లో ఓడిన సింధు

బిడబ్ల్యుఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్

కోపెన్‌హాగెన్(డెన్మార్క్): బిడబ్ల్యుఎఫ్ ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్ ప్రి క్వార్టర్‌ఫైనల్లోకి టాప్‌సీడ్ లక్ష్యసేన్, 9వ సీడ్ హెచ్ఎస్ ప్రణయ్ దూసుకెళ్లగా.. మహిళల సింగిల్స్‌లో పివి సింధు పోరాటం రెండోరౌండ్‌లోనే ముగిసింది. మంగళవారం జరిగిన రెండోరౌండ్ పోటీలో లక్ష్యసేన్ 21-11, 21-12తేడాతో జియోక్-హక్-జిన్(కొరియా)పై, ప్రణయ్ 21-9, 21-14తో వార్డియాకో(మలేషియా)పై సునాయాసంగా నెగ్గారు. ఈ టోర్నమెంట్‌లో టాప్‌సీడ్‌గా బరిలోకి దిగిన లక్ష్యసేన్ తొలి గేమ్‌నుంచి ప్రత్యర్థిపై బలమైన స్మాష్‌లతో విరుచుకుపడ్డాడు. ఇక మమిళల సింగిల్స్‌లో పివి సింధు 14-21, 14-21తో నొజోమీ ఒకుహరా(జపాన్) చేతిలో వరుససెట్లలో ఓడింది. ప్రి క్వార్టర్స్‌లో ఒకుహరా 7వ సీడ్ రచనోక్ ఇంటనాన్(థాయ్‌లాండ్)తో తలపడనుంది.

క్లీన్‌స్వీప్‌పై గురి

ఐర్లాండ్‌తో చివరి టి20 నేడు రాత్రి 7.30గం॥ల నుంచి

డబ్లిన్: టి20 సిరీస్‌ను చేజిక్కించుకున్న టీమిండియా ఇక క్లీన్‌స్వీప్‌పై గురిపెట్టింది. జస్ప్రీత్ బుమ్రా సారథ్యంలోని టీమిండియా మూడు టి20ల సిరీస్‌లో ఇప్పటికే 2-0 ఆధిక్యతలో నిలిచి సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఈ క్రమంలో ఐర్లాండ్‌తో బుధవారం జరిగే మూడో, చివరి టి20లో ఆతిథ్య జట్టును చిత్తు ఓడించాలని చూస్తోంది. తొలి టి20లో వర్షం కారణంగా డక్‌వర్త్‌లో 2 పరుగుల తేడాతో నెగ్గినా.. రెండో టి20లో 33పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఆసియాకప్‌కు ముందు జరిగే చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఇదే కావడంతో యువ క్రికెటర్లంతా సమిష్టిగా సత్తాచాటాలని ఉవ్విళ్ళూరుతున్నారు. దీంతో ఇప్పటివరకు బెంచ్‌కే పరిమితమైన ఆవేశ్ ఖాన్, జితేశ్ శర్మ, షాబాజ్ అహ్మద్ చివరి మ్యాచ్‌లో చోటు దక్కించుకొనే ఛాన్స్ ఉంది. ఆసియాకప్‌కు స్టాండ్‌బైగా ఎంపికైన సంజు శాంసన్ తన ఫామ్‌ను నిరూపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈనెలాఖరునుంచి ఆసియాకప్ ప్రారంభం కానుండగా.. ఆ టోర్నీకి 17మందితో కూడిన జట్టును బిసిసిఐ సెలెక్షన్ కమిటీ సోమవారం ప్రకటించిన సంగతి తెలిసిందే.

రవూఫ్ దెబ్బకు ఆఫ్ఘన్ ధమాల్

తొలి వన్డేలో 142పరుగుల తేడాతో పాకిస్తాన్ గెలుపు

హంబన్‌తోట(శ్రీలంక): ఆఫ్ఘన్‌తో తటస్థ వేదికైన శ్రీలంకలో జరిగిన తొలి వన్డేలో పాకిస్తాన్ జట్టు ఘన విజయం సాధించింది. 202పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆఫ్ఘన్‌ను రవూఫ్(5/18) తన నిప్పులు చెరిగే బంతులతో 59పరుగులకు ఆలౌట్ చేశాడు. దీంతో పాక్ జట్టు 142పరుగుల భారీ తేడాతో తొలి వన్డేలో ఘన విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ జట్టు 47.1ఓవర్లలో 201పరుగులకే కుప్పకూలింది. ఇమామ్ ఉల్ హక్(61), షాదాబ్(39), ఇఫ్తికార్(30) టాప్ స్కోరర్స్. ముజీబ్‌కు మూడు, నబి, రషీద్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఆఫ్ఘన జట్టు 4పరుగులకే 3వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత క్రమంలో వికెట్లను కోల్పోతూ 19.2 ఓవర్లలో ఆలౌటైంది. గుర్బాజ్(18), అజ్మతుల్లా(16) రెండంకెల స్కోర్ చేశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రవూఫ్‌కు లభించగా.. రెండో వన్డే గురువారం జరగనుంది. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో పాకిస్తాన్ జట్టు 1-0 ఆధిక్యతలో నిలిచింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68